ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుని గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 283 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | శుక్రవారం 9 జనవరి 2026 | పేజీలు : 12 | వెల : 3

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar

### భారీగా తగ్గిన వెండి

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుతున్నాయనే సంకేతాల నేపథ్యంలో వెండి ధరలు ఒక్కసారిగా భారీగా పడిపోయాయి. సోమవారం ఎంసిఎక్స్ మార్కెట్లో కిలో వెండి ధర ఒక్క రోజే రూ.21 వేలు తగ్గింది. మధ్యాహ్నం తర్వాత ఒక్క గంటలోనే కిలో వెండి ధర భారీగా తగ్గి రూ.2,33,120 కు చేరింది. ముఖ్యంగా ఉక్రెయిన్–, రష్యా యుద్ధానికి సంబంధించి సానుకూల పరిణామాలు కనిపించడంతో పెట్టుబడిదారుల్లో లాభాల స్వీకరణ కనిపించింది.

### ఇవి బ్యాటరీలకు ఆధార్ తరహా నెంబర్లు

కేంద్ర రవాణా మంత్రిత్వశాఖ శని వారం ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల సంబందిత కీలక ముసాయిదా మార్గదర్శకాలు వెలువరించింది. ఇవి కార్లు ఇతర వాహనాలకు అత్యవసరంగా వాడే బ్యాటరీలకు ఇకపై ఆధార్ తరహా నిర్ధిష్ట క్రమ సంఖ్యలను పొందుపర్చేందుకు ప్రతిపాదించారు. సమర్ధవంతమైన రీ ఛార్జింగ్‌కు, వీటి ఉనికి తెలుసుకునేందుకు (ట్రెసిబులిటి) ఈ నెంబర్ల ప్రక్రియ ఉపయోగపడుతుందని మార్గదర్శకాలలో మంత్రిత్వ శాఖ తెలిపింది.


# ఉపాధి హామీని నిర్వీర్యం చేసే కుట్ర



- గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయి
- దేశవ్యాప్తంగా దీనికి గుర్తింపు లభించింది
- దేశంలో 80 శాతం మంది ఈ ఉపాధి హామీపై ఆధారపడి జీవిస్తున్నారు
- పథకం పేరు మార్పు వెనుక ప్రధాని మోదీ కుట్ర ఉంది
- ఎస్ఐఆర్ వెనుక పెద్ద కుట్ర ఉంది
- వీబీ జీ రామ్ జీ చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశాం

హైదరాబాద్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, దేశవ్యాప్తంగా దీనికి గుర్తింపు లభించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం నాడు గాంధీభవన్‌లో పీసీసీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం వల్ల వెట్టిచాకిరి ఆగిపోయిందని, గ్రామాల నుంచి వలసలు తగ్గాయన్నారు. అలాగే పనికితగ్గ వేతనం డిమాండ్ చేసే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దేశంలో 80 శాతం మంది ఈ ఉపాధి హామీపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రపన్నుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. పథకం పేరు మార్పు వెనుక ప్రధాని మోదీ కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. ఎస్ఐఆర్ వెనుక పెద్ద కుట్ర ఉందని.. - మిగతా3లో



### డ్రగ్స్ దందా... కువైట్‌లో ఇద్దరు భారతీయులకు మరణశిక్ష

- హెరాయిన్, మెథాంఫెటమైన్‌లతో పట్టుబడిన భారతీయులు
- నిందితులకు అంతర్జాతీయ డ్రగ్స్ నెట్ వర్క్‌తో సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడి
- ఆధారాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో మరణశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు



### రాహుల్ గాంధీని రేవంత్ రెడ్డి ఏం అన్నాడో నేనూ అదే అన్నాను

- రాహుల్ గాంధీ పప్పు కాదు, ముద్దపప్పు అని రేవంత్ రెడ్డి అన్నారన్న కేటీఆర్
- ఇప్పుడు నేనూ ముద్దపప్పు అన్నానని చెప్పిన కేటీఆర్
- రేవంత్ రెడ్డిని విమర్శించిన తర్వాత తనను అనాలన్న కేటీఆర్

హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏమని సంబోధించారో, తాను అదే వ్యాఖ్య చేశానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ 'పప్పు' కాదని, 'ముద్దపప్పు' అని రేవంత్ రెడ్డి గతంలో అన్నారని, ఇప్పుడు తాను కూడా అదే పదం ఉపయోగించానని ఆయన స్పష్టం చేశారు. "రేవంత్ రెడ్డి అసెంబ్లీలో అసభ్యకర పదాలు మాట్లాడితే కోపం వచ్చి, నేను కూడా రాహుల్ గాంధీని ఒక మాట అన్నాను. నా వ్యాఖ్యలపై కాంగ్రెస్ - మిగతా3లో



### దేశంలో 49 లక్షల టైఫాయిడ్ జ్వరం కేసులు నమోదు

- టైఫాయిడ్ జ్వరం సోకినవారిలో 7.3 లక్షల మంది ఆస్పత్రిలో చేరారు
- బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ ద్వారా టైఫాయిడ్ జ్వరం వస్తుంది
- కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల ఇలా జరుగుతున్నది
- ఒకటి నుంచి మూడు వారాల్లోగా లక్షణాలు కనిపిస్తాయి

### అమెరికా నౌకలను ముంచేస్తాం...



- అవసరమైతే అమెరికా నౌకలను ముంచేస్తామన్న రష్యా ఎంపీ
- ఉత్తర అట్లాంటిక్ సముద్రంలో హెలికాప్టర్‌తో అమెరికా మెరైన్ల ఆపరేషన్
- ఇది సముద్రపు దొంగతనమంటూ రష్యా తీవ్ర విమర్శ
- వెనెజువెలాపై ఆంక్షల అమలులో భాగంగానే ఈ చర్య
- వెనెజువెలాతో సంబంధముందంటూ రష్యా జెండా కలిగిన ట్యాంకర్‌ను సీజ్ చేసిన అమెరికా

# టెలిమెట్రీ పరికరాల ఏర్పాటు కుదరదు

## తెలుగు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ లేఖ




- 'అప్పటి వరకు టెలిమెట్రీల ఏర్పాటు కుదరదు'
- టెలిమెట్రీల ఏర్పాటు అంశంపై ఇరు రాష్ట్రాలకు ప్రతిపాదనలు
- నీటి వాటా ట్రిబ్యునల్లో తేలాక, ప్రాజెక్టులు అప్పగించాకే ఏర్పాటు చేస్తామని వెల్లడి
- అప్పటి వరకు టెలిమెట్రీల ఏర్పాటు సాధ్యంకాదని స్పష్టీకరణ

హైదరాబాద్

సుప్రీంకోర్టులో కేసులు, బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్ విచారణ తేలే వరకు ఉమ్మడి ప్రాజెక్టులపై తదుపరి దశల టెలిమెట్రీ యంత్రాల ఏర్పాటు వాయిదా వేయాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు అభిప్రాయపడింది. ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు లేకపోవడం, బోర్డుకు ప్రాజెక్టులు అప్పగించకపోవడంతో పూర్తి స్థాయిలో టెలిమెట్రీకి ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొంది. మొదటి దశ టెలిమెట్రీ యంత్రాల్లో అన్నింటి ఫలితాలు సరిగ్గా లేకపోవడం, పరికరాల ధర, నిర్వహణ లాంటి అంశాలను కూడా పరిగణలోకి తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు లేఖ రాసింది. కృష్ణా జలాల పంపిణీపై బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్ విచారణ పూర్తయి, నీటి కేటాయింపులు తేలి ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించిన తర్వాత గానీ పరీవాహకంలో ప్రవాహాలను లెక్కించేందుకు టెలిమెట్రీ పరికరాల ఏర్పాటు కుదరదని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు స్పష్టం చేసింది. కీలకమైన ఈ రెండు అంశాలపై న్యాయ విచారణ - మిగతా3లో



### ప్రగల్భాలతో మరోసారి నవ్వుల పాలవుతున్న పాక్!

- భారత్‌తో యుద్ధం తర్వాత పాక్ మిలిటరీ సామర్థ్యానికి గుర్తింపు వచ్చిందట
- తమ యుద్ధ విమానాలకు గిరాకీ పెరిగిందంటున్న పాక్ రక్షణ మంత్రి
- రష్యా ఇంజన్, చైనా డిజైన్.. ఇదీ పాకిస్థాన్ యుద్ధ విమానాల తయారీ సామర్థ్యం

# మేడారం జాతరకు కేసీఆర్‌కు ఆహ్వానం

- ఎర్రవల్లికి సురేఖ, సీతక్క
- కాంగ్రెస్ మహిళా మంత్రులకు కేసీఆర్ ఆత్మీయ పలకరింపు
- ఇంటికి వచ్చిన ఆడబిడ్డలకు అతిథి మర్యాదలతో, పసుపు కుంకుమలు చీర, తాంబూలాలతో సంప్రదాయ సత్కారం
- గురువారం ఎర్రవెల్లి నివాసంలో ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను కలిసిన మంత్రులు కొండా సురేఖ, దనసరి సీతక్క



సిద్దిపేట

మేడారం మహా జాతర నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను ఆహ్వానించేందుకు మంత్రులు కొండా సురేఖ, సీతక్క.. ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా కేసీఆర్ దంపతులకు పట్టు వస్త్రాలు పెట్టి మేడారం మహా జాతర ఆహ్వాన పత్రికను మంత్రులు అందించారు. అనంతరం, కేసీఆర్ దంపతులు కూడా మంత్రులను సన్మానించారు. ఆహ్వానం సందర్భంగా దాదాపు 20 నిమిషాలపాటు వారు మాట్లాడుకున్నారు. ఈ క్రమంలో మేడారంలో జాతర సందర్భంగా చేస్తున్న ఏర్పాట్లను కేసీఆర్‌కు వివరించినట్టుగా తెలిసింది. అనంతరం, మేడారం జాతరకు ఏదోఒక రోజు తాము హాజరు అవుతామని కేసీఆర్ చెప్పారని మంత్రులువెల్లడించారు. - మిగతా3లో

## సంపాదకీయం

# వికసిత్ భారత్ సాధనలో ప్రవాసీ భారతీయుల పాత్ర

09 జనవరి 1915న ప్రవాసీ భారతీయుడైన మహాత్మాగాంధీ దక్షిణ ఆఫ్రికా నుంచి తిరిగి తన జన్మ భూమికి చేరిన రోజుకు గుర్తుగా ప్రతి ఏట 09 జనవరిన "ప్రవాసీ భారతీయుల దినోత్సవం లేదా ప్రవాసీ భారతీయ దివస్ లేదా నాన్–రెసిడెంట్ ఇండియన్స్ డే"గా 2003 నుంచి పాటించడం జరుతున్నది. ప్రవాసీ భారతీయుల నైపుణ్యాలు, మేధస్సు, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, సంపదలను తమ జన్మభూమి అభివృద్ధికి వినియోగించడాన్ని ప్రోత్సహించడం, ప్రవాసాలను సాదరంగా ఆహ్వానించడం, భారత అభివృద్ధికి కృషి చేసిన ప్రవాసీలను సన్మానించడం లాంటి అంశాలను చర్చించే వేదికగా ప్రవాసీ భారతీయుల దినోత్సవం ఉపయోగపడుతున్నది. ప్రవాసీ భారతీయ దివస్ నేపథ్యంలో న్యూఢిల్లీలో విదేశాంగ మంత్రిత్వ శాఖ "వికసిత్ భారత్ సాధనకు ప్రవాసీ భారతీయుల పాత్ర" అనబడే ప్రత్యేక సదస్సును నిర్వహించడం కూడా కొనసాగుతున్నది. ప్రవాసీ భారతీయులతో పాటు భారతీయ మూలాలు కలిగిన వ్యక్తులు (పరసన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్, పిఐఓ) కూడా భారత దేశంలో పెట్టుబడులు పెట్టి దేశాభివృద్ధికి చేయూతనివ్వడం నిరంతరం కొనసాగాలని ప్రభుత్వం, పౌర సమాజం కోరుకుంటున్నది. సంస్కృతులు, వాణిజ్యం, టెక్నాలజీ, ఇన్నొవేషన్, సృజన మెండుగా ఉన్న దేశభక్తి కలిగిన ప్రవాసీ భారతీయులు 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనకు దోహదపడాలనే సదుద్దేశంతో ఎన్ఆర్ఐలను ప్రోత్సహిస్తూ రెడ్ కార్పెట్ ఆహ్వానం పలుకుతోంది. 2024 వివరాల ప్రకారం, 15 మిలియన్ల ప్రవాసీ భారతీయులు, మరో 20 మిలియన్ల భారత మూలాలు కలిగిన పిఐఓలు పలు అభివృద్ధి చెందిన దేశాల్లో స్థిరపడి ఉన్నారు. అత్యధిక ప్రవాసీ భారతీయులు కలిగిన దేశంగా అమెరికా ప్రసిద్ధిగాంచింది. అమెరికాలో 44.6 లక్షలు, యూఏఈలో 35 లక్షలు, మలేసియాలా 29.14 లక్షలు, కెనడాలో 28.76 లక్షలు, సౌథీ అరేబియాలా 24.64 లక్షల ప్రవాసీ భారతీయులు ఉన్నారని తెలుస్తున్నది. 'మేధో వలస' లేదా 'బ్రెయిన్ డ్రేయిన్' అనబడే పదాన్ని తొలిసారి యూకెలో 1960లో ప్రయోగించారు. నైపుణ్యం, ఉన్నత విద్య ప్రమాణాలు కలిగిన యువత ఉన్నత భవితకు తమ దేశాన్ని వదిలి అభివృద్ధి చెందిన దేశాలకు వలస పోవడాన్ని 'మేధో వలస లేదా హూమన్ క్యాపిటల్ ఫ్లైట్' అని అంటున్నారు. అభివృద్ధి చెందుతున్న యువభారతం నుంచి ఆకర్షణీయ వేతనాలు, ఉద్యోగ అవకాశాలు, ఉన్నత ప్రమాణాలు కలిగిన యూనివర్సిటీల విద్యా బోధనలు, అత్యాధునిక శాస్త్ర సాంకేతిక పరిశోధనలకు అవకాశాలు, ఉత్తమ జీవనశైలి, సులభ వీసా విధానాలు, రూపాయి విలువ పతనం, రాజకీయ స్థిరత్వం లాంటి కారణాలతో భారత యువత లక్షల సంఖ్యలో ప్రతి ఏట అభివృద్ధి చెందిన దేశాలకు వలస పోవడం, అక్కడే స్థిరపడి ప్రవాసీ భారతీయులుగా మారడం జరుగుతోంది. ఉన్నత విద్యకు మాత్రమే కాకుండా నైపుణ్యం, సృజనశీల మేధస్సు కలిగిన వ్యక్తులు కూడా విదేశాలకు వెళ్లి అక్కడే స్థిరపడడం కూడా కొనసాగుతున్నాయి. భారత్‌లో విద్యా ప్రమాణాలు తగ్గడం, పరిశోధనాలయాల కొరత, నిరుద్యోగం, వేతన వ్యత్యాసాలు, రాజకీయ అస్థిరత్వం, జీవనశైలి ప్రమాణాలు తగ్గడం, ఆర్థిక అవకాశాలు మూతపడడం లాంటి కారణాలు కూడా యువత విదేశీ పయనాలకు దోహదపడుతున్నాయి. అమెరికాలో 12 శాతం శాస్త్రవేత్తలు, 38 శాతం వైద్యులు, 36 శాతం నాసా ఉద్యోగులు ప్రవాసీ భారతీయులే అని తెలిసి ఆశ్చర్యపోతున్నాం. అంతే కాకుండా మైక్రోసాఫ్ట్ ఉద్యోగుల్లో 34 శాతం, ఐబిఎంలో 28 శాతం, ఇంటెల్‌లో 17 శాతం, గూగుల్‌లో 12 శాతం ఉద్యోగులు ప్రవాసీ భారతీయులే అని తెలుసుకోవాలి. మేధో వలసలో ప్రథమ స్థానం భారత్ చేజిక్కించుకుంది. 2022 ఏడాదిలో 7.7 లక్షల యువత విద్య కోసం విదేశాలకు వెళుతున్నారు. 2024లో దాదాపు 1.8 మిలియన్ల భారతీయ యువత చదువుల నిమిత్తం విమానయానం చేసారని తెలుస్తున్నది. 2014 నుంచి నేటి వరకు 23,000 మిలియనీర్లు భారత్‌ను వదిలి విదేశాలకు వెళ్లి స్థిరపడ్డారు. మేధో వలసను తగ్గించడానికి మన యూనివర్సిటీ విద్యా ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయి వరకు పెంచడం, తిరిగి వచ్చే ప్రవాసీ భారతీయులకు పన్ను రాయితీలను ఇవ్వడం, పేటెంట్ పొందే వారికి పన్నులు తగ్గించడం లాంటివని కల్పించాలని సూచిస్తున్నారు. భారత దేశ అమూల్య వనరు అయిన మేధావులు, నైపుణ్యం కలిగిన టెక్నోక్రాట్లు, ప్రొఫెషనల్స్ దేశాన్ని వదిలి వెళ్లడం జన్మభూమికి తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తున్నది. అదే విధంగా నిరంతరం మేధో వలస కొనసాగితే దేశ సామాజిక–ఆర్థిక సమగ్రాభివృద్ధికి తీవ్రమైన విఘాతం కలుగుతుందని తెలుసుకోవాలి. మేధో వలస వల్ల స్వదేశంలో ఇన్నొవేషన్, పరిశోధనలు, సుస్థిరాభివృద్ధి కుంటుపడుతుంది. మేధో వనరు వలస వల్ల దేశానికి కొంత ఆర్థిక చేయూత లభిస్తే అది కొంత వరకు ఊరటను ఇస్తుంది. ఒక మొక్కను నాటి, సకల పరిచర్యలు చేసి, నీరు పోసి, ఎరువు వేసి పెంచిన తర్వాత పండ్లు లభించే స్థాయిలో దానిని మరోకరు ఇవ్వడం ఎంత బాధను కలిగిస్తుందో అంతే నష్టాన్ని మేధో వలస కూడా జన్మభూమికి చేస్తుందని తెలుసుకోవాలి. మేధో వలస వల్ల అభివృద్ధి చెందిన దేశాలకుపెట్టుబడి పెట్టకుండానే 'రెడీ టు యూజ్ స్కిల్డ్ యూత్' ఉచితంగా లభిస్తున్నది.నేటి ప్రవాసీ భారతీయ దినం వేదిక భారత దేశానికి, ప్రవాసీ భారతీయులకు మధ్య వారధిగా నిలవాలని, ప్రవాసీ పౌర సమాజం తిరిగి తమ దేశంలో మేధోపరమైన, ఆర్థికపరమైన పెట్టుబడులు పెట్టి భారతాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశాల జాబితాలోకి చేర్చడానికి తమ వంతు కృషి

# ఓటు బ్యాంకులుగా ప్రవాస భారతీయులు

ఒకనాడు ఉన్నత విద్య అనంతరం మోహన్ దాస్ కరమ్ చాంద్ గాంధీ దక్షిణా ఆఫ్రికా వెళ్లి న్యాయ వాద వృత్తి చెప్పట్టేలా చేసింది. 1893 లో దక్షిణాఫ్రికాకు వెళ్ళిన మహాత్మా గాంధీ, దేశం బానిస రాజుల చేతిలో మగ్గి పోతుంది అనే వాస్తవాన్ని గ్రహించి, 9 జనవరి 1915 న దక్షిణాఫ్రికా నుంచి భారత దేశానికి జాతిపిత మహాత్మాగాంధీ తిరిగి వచ్చిన దినం సందర్భంగా, మహాత్ముడు ప్రవాసీ నాయకుడే అనే భావనతో, ప్రవాస భారతీయుల దినోత్సవ ము జనవరి 9 న జరుపుకొన బడుతున్నది. భారతదేశ అభివృద్ధికి విదేశీ భారతీయ వర్గాల సహకారాన్ని గుర్తించడానికి భారతదేశపు రిపబ్లిక్ ద్వారా జనవరి 9 న ఏటా జరిగే వేడుక రోజు. ఎల్.ఎమ్. సింఘ్వి నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ జనవరి 2002 లో ఈ దినోత్సవాన్ని సిఫారసు చేసింది. 2003 నుండి ప్రతి సంవత్సరం జనవరి 9 న ప్రవాస భారతీయుల దినోత్సవాన్ని జరుపు తున్నారు. భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మరియు ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సమాఖ్య, భారత పరిశ్రమల సమాఖ్య మరియు నార్త్ ఈస్టర్న్ రీజియన్ యొక్క అభివృద్ధి మంత్రిత్వ శాఖ చేత స్పాన్సర్ చేయబడింది. దేశం యావత్తు ప్రవాసీ భారతీయ దివస్ పేరిట ఎన్నో కార్యక్రమంలో నిర్వహిస్తూ వస్తున్నది భారత ప్రభుత్వం. వివిధ దేశాల్లో భారత సంతతి వారు అందరూ కలిసి దాదాపు 3కోట్ల వరకూ వివిధ దేశాల్లో స్థిరపడ్డారు. మాతృ దేశ అభివృద్ధికి ఎందరో దేశాభిమానంతో విశేష కృషి చేస్తున్నారు. నేడు భారత జాతి ప్రగతిలో ప్రవాస భారతీయుల భాగస్వామ్యం చిరస్మరణీయం. ప్రవాస భారతీయుల దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో ప్రశంసనీయమైన కృషి చేసిన ప్రవాస భారతీయులకు భారతదేశ వృద్ధిలో ప్రవాసి భారతీయుల పాత్రను అభినందించడానికి, వారిలో అసాధారణమైన యోగ్యత కలిగిన వ్యక్తులకు, భారత రాష్ట్రపతి ప్రతిష్ఠాత్మక ప్రవాసీ భారతీయ సమ్మాన్ పురస్కా రాలను ప్రతి సంవత్సరం అందజేస్తారు. మానవ జాతి పరిణామ క్రమంలో వలస ఒక ముఖ్యమైన మార్గం, విశ్వ వ్యాపితంగా నా భారతావని అనే స్వామి వివేకానందుల మాటలను నిజం చేస్తూ భారతీయ మూలాలు లేని మనుషులు లేరు. ఈ దేశంలో అని ప్రపంచ దేశాల్లో ఒక్క దేశాన్ని కూడా చూపించ లేము. భారతీయుల మేధాశక్తి ఒక దశలో వలస పోయింది అనకుండ మేధో వలస అనే పరిస్థితి వచ్చింది. చదువు మేధా సంపత్తి వైట్ కాలర్ ఉద్యో గాల పేరిట యూరోప్ వైపు వల సలు జరిగితే, అపార కండర బలం ఉండి శ్రామికులుగా గల్ఫ్ దేశాలకు నిరక్షరాసులైన కార్మిక వర్గం విస్తృత స్థాయిలో వలసలు జరిగాయి. వలసల ప్రక్రియ భారత జాతి వికాసానికి గణనీయమైన బాటలు పరిచింది. వ్యక్తి గత అభివృద్ధితో పాటు దేశాభివృద్ధి శరవేగంగా జరగడం ప్రారంభ మైంది. 90వ దశకంలో వచ్చిన ఆర్థిక సరళీకరణ, ప్రపంచీ కరణ విధానాలు కూడా కొంత అభివృధికి దోహద పడ్డాయి. ఈ వలసలకు అభివృద్ధికి గల ప్రముఖమైన సంబంధాన్ని కాదనలేము, విస్మరించలేము. కానీ ఈ ప్రవాసీ భారతీయ దివస్ బడా పారిశ్రామిక వేత్తల పెట్టుబడిని ఆహ్వానించే ఒక సంపన్నుల కార్య స్థలంగా రూపు దిద్దు కొన్నదే కానీ, శ్రమ జీవులను ఒక్క తాటికి తీసుకొచ్చె శ్రమైక జీవన సౌందర్యాన్ని



ఒక వేదికపై ఆవిష్కరించ లేక పోయింది. ఈ వలసలను విస్తృత కోణంలో అర్థం చేసుకో గలిగితే ప్రతి ఒక్కరి ప్రయోజనాలు నెరవేరుతాయి, సమిష్టి ప్రయోజనాలు మెరుగు పడుతాయి. ఒక వైపు ప్రపంచం ఒక కుగ్రామం అయినా నేడు సంపన్న పాశ్చాత్య దేశాల భారతీయుల సేవలు ఇంకా అవసరమైన దేశాలు స్థిర నివాసం ఏర్పరుచు కొనుట కోసం ఎన్నో రాయితీ ప్రయోజనాలు వలస మార్గాలను సులభతరం చేశాయి. అనేక దేశాలలో ప్రవాస భారతీ యులు అక్కడి దేశపు చట్ట సభల్లో ప్రముఖమైన స్థానాల్ని కైవసం చేసు కుంటున్నారు. మరో వైపు ఈ గల్ఫ్ దేశాలకు పెద్ద సంఖ్యలో మన దేశం నుండి కార్మికుల వలసలు 1970 నుండి మొదలై, నేటికీ కొనసాగు తున్నాయి. వీరి ఆర్జన మొత్తం ఈ దేశానికి పంపుతున్న... ఆర్థిక సైనికులైన గల్ఫ్ వలస కార్మికుల వలస జీవితాల్లో గణనీయమైన మార్పు రావాల్సి ఉంది. కార్మికులుగా వలస వెళ్లిన వీరు తిరిగి కుటుంబాన్ని కలవాలి అంటే అది ఒక గొప్ప విజయమే, ఇట్టి కార్మికులు గల్ఫ్ నుండి 48 డిగ్రీల పై ఉండే అధిక ఉష్ణోగ్రతలో తమ రక్తాన్ని చెమట చుక్కలుగా, ఆపై విదేశీ మారకంగా మార్చి పంపుతున్న క్రమంలో, విదేశీ మారకంతో క్రూడాయిల్, పెట్రోల్ వంటివి కొనడానికి ఉపయోగ పడుతున్నాయి. కార్మికుడిగా వెళ్లి ఎన్నో వ్యాపారాల్లో ఉన్నత స్థాయి అందుకున్న మన భారతీయ గల్ఫ్ ప్రవాసీలు, ప్రవాసీ భారతీయ దివస్ లో ప్రవాసీ సమ్మాన్ అవార్డు అందుకోలేక పోతున్న అంశమే బాధాకరం. టాక్స్‌ల రూపంలో అందుకుంటున్న ప్రభుత్వాలు, వారి దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి విధాన పరమైన నిర్ణయాలు తీసుకున్న దాఖలాలే లేక పోగా... వారిని ఓటు బ్యాంక్ గా మార్చు కుంటూ, ఆచరణకు నోచులోని హామీలతో కాలం వెళ్లదీవడం అత్యంత శోచనీయం. గల్ఫ్ వలస కార్మికులకు కనీస ప్రాతినిధ్యం లేని, ప్రవాసీ భారతీయ దివస్ ను "మజ్దూర్ ప్రవాసీ భారతీయ దివస్" గా మార్చాలని దశాబ్దానికి పైగా ప్రవాసుల సంక్షేమ వేదిక అధ్యక్షులు మంద భీం రెడ్డి నిరంతరం కార్మికుల హక్కులకోసం అవిశ్రాంతంగా పోరాడుతూనే ఉన్నారు. కార్మికుల జీవిత భీమా, ఆరోగ్య సంరక్షణ, మృత ధన సహాయం, పునరావాసం పునరేకీకరణ, నైపుణ్యంతో తిరిగి వచ్చిన కార్మికులకు తోడ్పాటు, ప్రధానంగా గల్ఫ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, అప్పుడే ప్రవాసీ ల కృషికి గుర్తింపు ఇచ్చి నట్లు అవుతుందని ప్రవాసీ

# తెలంగాణ తొలి ఉద్యమ పూర్వాపరాలు

తెలంగాణ ప్రజలకు అన్ని రంగాలలో జరుగుతున్న అన్యాయా నికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు మాత్రమే పరిష్కారమని, రాష్ట్ర సాధనకై పోరాటం తప్పదనే భావన తెలంగాణ యువతలో అంకురించింది. అలా తెలంగాణ తొలి ఉద్యమం తెలంగాణా హక్కుల పరిరక్షణ ఉద్యమంగా మొదలైంది. తెలంగాణా రక్షణలను అమలు చెయ్యాలని కోరుతూ 1969, జనవరి 9 న ఖమ్మం పట్టణంలో బి.ఎ. స్టూడెంట్, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ నాయకుడైన రవీంద్రనాథ్ గాంధీచౌక్ దగ్గర నిరవధిక దీక్ష ప్రారంభించాడు. తొలి దశ ఉద్యమ ప్రారంభ పూర్వా పరాలు తెలుసుకునే ప్రయత్నం ఇది. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలు కలిసి ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటు కావడంలో కీలకమైనది పెద్దమనుషుల ఒప్పందం. 1956లో తెలుగు మాట్లాడే ప్రాంతాలన్నీ ఏకమై ఒకే రాష్ట్రంగా ఏర్పడటానికి రాయలసీమ, తెలంగాణ ఆంధ్ర ప్రాంతాల నాయకులతో కలిసి. 1956, ఫిబ్రవరి 20 న ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇదే పెద్దమనుషుల ఒప్పందం. న్యూ ఢిల్లీలో పెద్దమనుషుల ఒప్పందంపై సంతకాలు చేసిన వారు తెలంగాణ తరపున, బూర్గుల రామ కృష్ణారావు, కె.వి.రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి, జె.వి. నరసింగరావు; ఆంధ్ర తరపున నీలం సంజీవరెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి, అల్లూరి సత్యనారాయణ రాజు, గౌతు లచ్చన్న ఉన్నారు. తెలంగాణ అభివృద్ధికి, తెలంగాణ సమానత్వ పరిరక్షణకు సంబంధించిన నిబంధనలు ఏర్పరచు కున్నారు. ఈ ఒప్పందాన్ననుసరించి 1956, నవంబర్ 1 న ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. ఆంధ్ర ప్రాంతానికి చెందిన నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, ఈ ఒప్పందం అమలు విషయమై కొద్దికాలంలోనే తెలంగాణా ప్రజల్లో అసంతృప్తి తగిలింది. ఒప్పందాన్ననుసరించి ఉప ముఖ్యమంత్రి పదవిని తెలంగాణా వాసికి ఇవ్వలేదు; అసలు ఆ పదవినే సృష్టించలేదు. అయితే 1959లో దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రి కాగానే ఉప ముఖ్యమంత్రిగా తెలంగాణ ప్రాంతానికి చెందిన కొండా వెంకట రంగారెడ్డి (కె.వి.రంగారెడ్డి) ని నియమించాడు. అయితే మళ్ళీ 1962 నుండి 1969 వరకు ఉపముఖ్యమంత్రి పదవి లేదు. 1969లో తెలంగాణ ప్రాంతానికి చెందిన జె.వి.నర్సిం గరావును ఉప ముఖ్యమంత్రిగా నియమించారు. ఈ విధంగా రాజకీయ పదవుల విషయంలో తమకు అన్యాయం జరిగిందని తెలంగాణ వారు భావించారు. అలాగే ఆంధ్ర ప్రాంతం నుండి తరలి వచ్చిన ప్రజలు తెలంగాణ ప్రాంతంలో భూములు కొని, వ్యవసాయం చేసారు. ఇది తమ భూముల ఆక్రమణగా కొందరు తెలంగాణా ప్రజలు భావించారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధ్యాయుల నియామకాల్లో తమకు అన్యాయం జరిగిందనే భావన కూడా తెలంగాణా ప్రజల్లో బలంగా కలిగింది. తెలంగాణ విద్యాసంస్థల్లో కూడా తమకు తగినన్ని సీట్లు రాలేదని విద్యార్థుల్లో అసంతృప్తి నెలకొని ఉంది. ఈ నేపథ్యం లోనే "తెలంగాణ తొలి ఉద్యమం"... "తెలంగాణ హక్కుల పరిరక్షణ ఉద్యమం"గా మొదలైంది. తెలంగాణ రక్షణలను అమలు చెయ్యాలని కోరుతూ 1969, జనవరి 9 న ఖమ్మం పట్టణంలో బి.ఎ. స్టూడెంట్, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ నాయకుడైన రవీంద్రనాథ్ గాంధీ చౌక్ వద్ద నిరవధిక దీక్ష ప్రారంభించాడు. ఆరోజు జరిగిన ఊరేగింపులో హింసాత్మక ఘటనలు జరిగాయి. మరుసటి రోజు ఉద్యమం నిజామాబాదుకు పాకింది. జనవరి 10 న హైదరాబాదులోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన విద్యార్థుల సమావేశంలో – తెలంగాణా రక్షణల అమలుకై జనవరి 15 నుండి సమ్మె చెయ్యాలని ప్రతిపాదించారు. అయితే, జనవరి 13 న అదే విశ్వవిద్యాలయంలో జరిగిన ఒక సమావేశంలో విద్యార్థులలోని ఒక వర్గం "తెలంగాణ విద్యార్థుల కార్యాచరణ సమితి"గా ఏర్పడి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే తమ ధ్యేయంగా ప్రకటించారు. జనవరి 13న ఉస్మానియా యూనివర్సిటీలో "తెలంగాణ విద్యార్థుల కార్యాచరణ సమితి" ఏర్పడింది. ఆ రోజు మొట్టమొదటి సారిగా ప్రత్యేక తెంగాణ సాధనను తమ లక్ష్యంగా విద్యార్థులు ప్రకటించుకున్నారు. విద్యార్థుల కార్యాచరణ సమితి మెడికల్ విద్యార్థి మల్లిఖార్జున్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది. విద్యార్థులు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధం కావాని మల్లిఖార్జున్ పిలుపునిచ్చారు. అదే రోజున పురప్రముఖులు కొందరు "తెలంగాణా పరిరక్షణల కమిటీ"ని ఏర్పాటు చేసారు. జనవరి 18 న విద్యార్థుల్లోని రెండు వర్గాలు (తెలంగాణ రక్షణల కోసం ఉద్యమించిన వారు, ప్రత్యేక తెలంగాణ కోరేవారు) వేరువేరుగా హైదరాబాదులో ఊరేగింపులు జరిపారు. ఈ రెండు ఊరేగింపులు ఆబిడ్స్ లో ఎదురైనపుడు ఘర్షణ చెలరేగింది. పోలీసులు లాఠీఛార్జి చెయ్యవలసి వచ్చింది. అదేరోజు శాసనసభలోని ప్రతిపక్ష పార్టీలు తెలంగాణా రక్షణల అమలు కొరకు ప్రభుత్వాన్ని వత్తిడి చేసాయి. ఉద్యమ కారుల కోరికలను చర్చించడానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం జనవరి 19 న అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఆ సమావేశం ఒక ఒప్పందానికి వచ్చింది. తెలంగాణలో పనిచేస్తున్న ఆంధ్ర ఉద్యోగులను వెనక్కి పంపించాలి. పెద్దమనుషుల ఒప్పందం లోని తెలంగాణ రక్షణలను అమలు చెయ్యాలి. అయితే ప్రత్యేక తెలంగాణ వాదులు ఈ ఒప్పందానికి సమ్మతించలేదు. ప్రత్యేక రాష్ట్రమే తమ ధ్యేయమని, అది నెరవేరే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని ప్రకటించారు. జనవరి 24న సదాశివపేటలో కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో 14 మంది గాయపడ్డారు. గాయపడ్డ వారిలో 17 ఏళ్ల శంకర్ మరుసటి రోజు గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. 1969 తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు శంకర్. కాల్పులకు నిరసనగా కొండా లక్ష్మణ్ బాపూజీ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ప్రత్యేక తెలంగాణ కాంగ్రెస్ సమితిని ఏర్పాటు చేశారు. అఖిలపక్ష కమిటీ ఒప్పందాన్ని అమలు చేస్తూ జనవరి 22న ప్రభుత్వం ఒక ప్రభుత్వ ఉత్తర్వును జారీ చేసింది. దీని ప్రకారం ఫిబ్రవరి 28 కల్లా స్థానికులు కాని ఉద్యోగులని వారి వారి స్థానాలకు వెనక్కి పంపివేస్తారు. తెలంగాణ రక్షణల అమలుకై మిగులు నిధుల అంచనాకు ఢిల్లీనుండి ఒక బృందం వస్తుంది. ఈ హామీలతో ఉద్యమానికి ఆద్యుడైన ఖమ్మం విద్యార్థి రవీంద్ర నాథ్ తన దీక్షను విరమించాడు. దీనితో తెలంగాణ రక్షణల అమలు ఉద్యమం ఆగిపోయింది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం రెండవ దశలోకి ప్రవేశించింది. జనవరి 28న వరంగల్లులో కాళోజీ నారాయణరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్యమంత్రి రాజీనామా చెయ్యాలని, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని తీర్మానం చేసారు.

1969 ఫిబ్రవరి 28 న యువకులు, మేధావి వర్గాలు కలిసి హైదరాబాదులో తెలంగాణ ప్రజాసమితి ని స్థాపించారు. జూన్ 4న తెలంగాణ పరిస్థితి తీవ్రతను తెలుసుకున్న ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ హైదరాబాద్ నగరానికి వచ్చి విద్యార్థి నాయకులు, తెలంగాణ ప్రజా సమితి నాయకులతో చర్చలు జరిపింది. తెలంగాణ తొలి ఉద్యమ కాలంలో మొత్తం 95 సార్లు కాల్పులు జరిగాయి. హైదరాబాద్, వరంగల్ నగరాల్లో కర్ఫ్యూ విధించారు. ఉద్యమంలో 369 మంది చనిపోగా, ప్రభుత్వ లెక్కలు మాత్రం 57 మంది చనిపోయినట్టుగా చెప్పాయి. తెలంగాణ ప్రజా సమితి నేతతో కేంద్రం చర్చలు జరిపింది. సెప్టెంబర్‌లో చెన్నారెడ్డి ఢిల్లీలో చర్చలు జరిపి వచ్చిన తర్వాత విద్యార్థులు తరగతులకు హాజరు కావాలని చెన్నారెడ్డి, విద్యార్థి నాయకుడు మల్లికార్జున్ ఒక ప్రకటన చేశారు. చదువులు కొనసాగిస్తూనే ఉద్యమంలో పాల్గొనాని విజ్ఞప్తి చేశారు. ఈ విధంగా ఉద్యోగులను, విద్యార్థును ఉద్యమం నుంచి పక్కకు తప్పించారు. మర్రి చెన్నారెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రజాసమితి 1971 లో పార్లమెంటుకు జరిగిన మధ్యంతర ఎన్నికలలో 10 సీట్లు సాధించడం, ఆ ఎన్నికల్లో ఇందిరా గాంధీకి సంపూర్ణ ఆధిక్యత రావడంతో తెలంగాణా ప్రజాసమితి మద్దతు కీలకం కాకపోవడం,1971 సెప్టెంబర్ 24 న బ్రహ్మానంద రెడ్డి రాజీనామా చేసాక కొద్దిరోజులకు చెన్నారెడ్డి తెలంగాణా ప్రజా సమితిని రద్దు చేయడం, ఆ పార్టీని జాతీయ కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయడం క్రమానుగతంగా జరిగి పోయాయి.

ధర్మఘంట

# శబరిమలలో సిబ్బంది కొరత..
# హుండీ లెక్కింపు ఆలస్యం

**తిరువనంతపురం:** కేరళలోని శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. మరోవైపు.. శబరి మలలో మకరవిళక్కు పూజలు ఘనంగా జరుగుతున్నాయి. దీంతో మకర జ్యోతి వేడుకలకు శబరిమల సర్వంగా సుందరంగా ముస్తాబవుతోంది. జనవరి 14న లక్ష మందికి పైగా భక్తులు జ్యోతి దర్శనం కోసం వస్తారని దేవస్థానం బోర్డు అంచనా వేసింది. ఇక, తొలిసారిగా ఫోటోలతో కూడిన పాస్‌లు, 900 బస్సులను భక్తుల కోసం అందుబాటులో ఉంచుతున్నారు. జనవరి 14న 35,000 మందికే అనుమతి ఉండటంతో రద్దీ నియంత్రణకు స్పాట్ బుకింగ్ నిలిపివేశారు. భక్తులకు అన్నదానం, వసతి సౌకర్యాలు కల్పించారు. ఇదిలా ఉండగా.. శబరిమల ఆలయానికి భక్తుల తాకిడి పెరగడంతో కానుకలు, హుండీ లెక్కింపులు జరుగుతున్నాయి. దేవస్థానం ఖజానాలో నాణేలు కొండలా పేరుకుపోయాయి. ప్రతిరోజూ, కానుకల హుండీలోని నోట్ల నుండి నాణేలను వేరు చేసి ఖజానాలోని ఒక భాగంలో ఉంచుతున్నారు. మండల కాలం నుండి మరియు మకరవిళక్కు పండుగ ప్రారంభమైన తర్వాత వచ్చిన నాణేలు కొండలా పేరుకుపోతున్నాయి. అయితే, దేవస్థానంలో డబ్బులు, నాణేలు లెక్కించడానికి తగిన సిబ్బంది లేకపోవడంతో లెక్కింపు ప్రక్రియ ఆలస్యమవుతోంది.





**వేధిస్తున్న ఉద్యోగుల కొరత..**

ప్రస్తుతానికి దేవస్థానం ఖజానాలో 175 మంది ఉద్యోగుల కొరత ఉంది. సిబ్బందిని నియమించుకోవడానికి దేవస్థానం ఉద్యోగులు అందుబాటులో లేరు. దీనికి బదులుగా తాత్కాలిక ఉద్యోగులను నియమించి సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నించినప్పటికీ, వారు కూడా లభించడం లేదు. అందువల్ల, డబ్బు లెక్కించడం అసాధ్యంగా మారింది. తీర్థయాత్రల సీజన్‌లో, సన్నిధానం, పంపా మరియు నిలక్కల్‌లో సేవ చేయడానికి ప్రతి సంవత్సరం 2000 మంది తాత్కాలిక ఉద్యోగులను నియమిస్తారు. మరోవైపు.. భద్రతా సిబ్బంది కోసం ఈసారి కేవలం 1750 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 1632 మందిని నియమించారు. వారిలో 50 మంది సన్నిధానం చేరుకున్న తర్వాత తిరిగి వెళ్లిపోయారు. దీంతో సిబ్బంది సరిపోక అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తోంది. కాగా, తాత్కాలిక ఉద్యోగులకు రోజుకు రూ. 650, ఉచిత వసతి, భోజనం ఇస్తామని హామీ ఇచ్చారు. భద్రతా విధులకు జీతం రోజుకు రూ. 900. వసతి, భోజనం అదనంగా ఉండనుంది.

**నాడు రోబోలతో లెక్కింపు..**

మకరవిళక్కు కోసం ఆలయం తెరిచిన తర్వాత, యాత్రికుల రద్దీ భారీగా పెరిగింది. దీనితో పాటు, కానుకల ద్వారా వచ్చే ఆదాయం కూడా పెరిగింది. అదే ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేసింది. ప్రస్తుత పరిస్థితిలో, మకరవిళక్కు తర్వాత ఆలయం మూసివేసినా, కానుకలను లెక్కించడం సాధ్యం కాదు. 2023లో, రోబోల సహాయంతో కానుకలను లెక్కించే ప్రణాళికను అమలు చేయడానికి దేవస్థానం బోర్డు ఒక ప్రణాళికను సిద్ధం చేసింది. అప్పటి దేవస్థానం బోర్డు అధ్యక్షుడు కె. అనంతగోపన్ తిరుపతిని సందర్శించి ఒక అధ్యయనం నిర్వహించారు. అది విజయవంతమైందని తేలింది. ఇక్కడ కూడా దానిని అమలు చేయాలని నిర్ణయించారు. అప్పటికే అనంతగోపన్ పదవీకాలం ముగిసింది. తర్వాత వచ్చిన దేవస్థానం బోర్డు దీనిపై ఆసక్తి చూపకపోవడంతో అది అమలు కాలేదు. ఈ కారణంగా, గత 2 సంవత్సరాలుగా, నాణేలను లెక్కించడానికి ఖజానాలో తాత్కాలిక సిబ్బందిని నియమిస్తున్నారు. పరిస్థితి తీవ్రతరం కావడంతో సన్నిధానంలోని ప్రతి డ్యూటీ పాయింట్ నుండి 10 మంది సిబ్బందిని ప్రతిరోజూ మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు నాణేలను లెక్కించడానికి ఖజానాకు పంపాలని దేవస్వం కార్యనిర్వహణాధికారి ఆదేశించారు.

# బిచ్చగాడిలా బతికాడు..
# చనిపోయాక డబ్బు కట్టలు చూసి అందరూ షాక్!

బిచ్చగాళ్లు, వారి సంపద గురించి చాలానే విన్నాం. బిచ్చగాళ్లుగా కొనసాగుతున్నప్పటికీ, ఖరీదైన ఇళ్లలో జీవించే వారి గురించి గతంలో అనేక కథనాలు చూశాం. కానీ ఇదొక బిచ్చగాని విషాద గాథ. కేరళలోని అలప్పు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన 50 ఏళ్ళ బెగ్గర్ వద్ద లభించిన నోట్ల కట్టలు చూసి అంతా అయ్యో అనుకున్నారు. ప్రస్తుతం ఈ ఉదంతం చర్చనీయాంశంగా మారింది. ఆహారం కోసం కేరళలోని అలెప్పూ వీధుల్లో అడుక్కునే బిచ్చగాడి వద్ద విదేశీ కరెన్సీతో సహా ఏకంగా రూ.4.5 లక్షలకు పైగా నగదు లభ్యం కావడంతో స్థానికులు, అధికారులు ఆశ్చర్య పోయారు. ఈ నగదులో రద్దైన రూ.2,000 నోట్లు కూడా ఉండటం దిగ్భ్రాంతికి గురిచేసింది. చారుమూట్ , సమీప ప్రాంతాలలో ఇతను అందరికీ సుపరిచితుడే. సోమవారం సాయంత్రం స్కూటర్‌పై వెళ్తుండగా ఒక వాహనం ఢీకొనడంతో గాయపడ్డాడు. స్థానికులు అతన్ని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. రికార్డుల ప్రకారం అతను తనను తాను అనిల్ కిషోర్‌గా పరిచయం చేసుకుని, స్థానిక చిరునామా ఒకటి ఇచ్చాడు. తలకి తీవ్రమైన గాయాలయ్యాయని ప్రత్యేక చికిత్స చేయించుకోవాలని వైద్యులు సూచించారు. కానీ వారి మాటల్ని అతను పట్టించుకోలేదు. మంగళవారం ఉదయానికి, అతని మృతదేహం కడతిన్నల్ ప్రాంతంలోని ఒక దుకాణం వెలుపల కనిపించింది. పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం పంపి, అతని సమీపంలో దొరికిన వస్తువులను పరిశీలించగా డబ్బుల విషయం వెలుగు చేసింది. అతని దగ్గర ఉన్న డబ్బాను స్థానిక పంచాయతీ సభ్యుడి సమక్షంలో పోలీస్ స్టేషన్‌లో తెరిచి, అధికారులే ఆశ్చర్యపోయారు. దాని లోపల ప్లాస్టిక్ డబ్బాలలో నిల్వ చేసి, టేప్‌తో చుట్టబడిన డబ్బు కట్టలు ఉన్నాయి. మొత్తం నగదు రూ.4.5 లక్షలకు పైగా ఉంది. ఆ నోట్లలో రద్దు చేయబడిన రూ.2,000 నోట్లు ,సౌదీ రియాలు కూడా ఉన్నాయి. అతను భిక్షాటనపైనే జీవించేవాడని, తరచుగా ఆహారం కొనడానికి చిన్న మొత్తంలో డబ్బు అడిగేవాడని స్థానికులు చెప్పారు. ఇంత పెద్ద మొత్తంలో డబ్బు, అదీ విదేశీ కరెన్సీ ఉంటుందని ఎవరూ ఊహించలేదన్నారు. ఏమీ లేని వ్యక్తిగా జీవించే వ్యక్తి దగ్గర ఇంత మొత్తం ఉండటం అందర్నీ దిగ్భ్రాంతికి గురిచేసిందని ఒక పంచాయతీ సభ్యుడుపేర్కొన్నాడు. కాగా అతడు తమ బంధువు అనిచెప్పి, మృతదేహం లేదా డబ్బు కోసం ఇంతవరకూ ఎవరూరాలేదని పోలీసులు చెబుతున్నారు. దీంతో చట్ట ప్రకారం నగదును కోర్టుకు అప్పగిస్తారు. దర్యాప్తు అధికారులు ఇప్పుడు కిషోర్ నేపథ్యాన్ని ఆ డబ్బు అతనికి ఎలా వచ్చిందో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.



# ప్రగల్భాలతో మరోసారి నవ్వులపాలవుతున్న పాక్!

ప్రపంచ దేశాల ముందు ఎన్నిసార్లు నవ్వులపాలైనా సరే పాకిస్థాన్ పాలకులు తమ ప్రగల్భాలను మాత్రం విడిచిపెట్టరు. తినడానికి తిండి లేక జనం అలమటిస్తున్నా, ప్రపంచ ద్రవ్య నిధి దయతలచి అప్పు ఇస్తే కానీ పూటగడవని స్థితిలో ఉన్నా డబ్బా కొట్టుకోవడం మాత్రం మానరు. తాజాగా ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలు ఈ కోవలోకే వస్తాయి. ఇంతకీ ఆయన ఏమన్నారంటే..

**ఖవాజా ప్రగల్భాలు..**

భారత్ తో ఇటీవల జరిగిన యుద్ధం తర్వాత పాకిస్థాన్ సైనిక సామర్థ్యం గురించి ప్రపంచానికి తెలిసిందని ఖవాజా ఆసిఫ్ చెప్పారు. తమ యుద్ధ విమానాల పాటవాన్ని గుర్తించి చాలా దేశాలు వాటిని సొంతం చేసుకోవాలని ముందుకొస్తున్నాయి. వాటికి ఎక్కడా లేని విధంగా డిమాండ్ ఏర్పడింది. ఈ డిమాండ్ ను చూస్తుంటే తాము ఇక అంతర్జాతీయ ద్రవ్య నిధి ఇచ్చే అప్పుల కోసం ఎదురుచూడాల్సిన అవసరం ఉండకపోవచ్చని అన్నారు.

**ఇందులో నిజమెంత..**

పాకిస్థాన్ ప్రస్తుతం అమ్ముతున్న యుద్ధ విమానాలు రెండు.. ఒకటి జేఎఫ్-17 కాగా రెండోది జే-10. వీటి కొనుగోలుకు ముందుకు వచ్చిన దేశాలు కూడా రెండే.. అందులో ఒకటి అజర్ బైజాన్, రెండోది లిబియా. వీటి అమ్మకానికి సంబంధించి బంగ్లాదేశ్ తో చర్చలు జరుగుతున్నాయి. ఈ రెండు యుద్ధ విమానాల తయారీలో పాకిస్థాన్ పాత్ర నామమాత్రమే. వాటి ఇంజన్లు రష్యా అందిస్తుండగా.. డిజైన్, తయారీ సంబంధిత పనులకు చైనాపై ఆధారపడుతోంది. ఒకటీ అరా పరికరాలు మాత్రమే పాకిస్థాన్ లో తయారవుతున్నాయి. అంటే.. పాక్ యుద్ధ విమానాల తయారీలో కీలక పాత్ర రష్యా, చైనాలదే. యుద్ధ విమానాల అమ్మకం ద్వారా వచ్చిన మొత్తంలో పెద్ద మొత్తం ఆ రెండు దేశాలకే వెళుతుంది. ఇక మిగిలేదెంత.. ఆ మొత్తంతో ఐఎంఎఫ్ కు బాకీ పడిన 300 బిలియన్ డాలర్ల అప్పు ఎప్పటికీ తీరుతుందని నిపుణులు అంటున్నారు.



**ఆర్థిక ఇబ్బందులు..**

కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు ఐఎంఎఫ్ నిధులపైనే పాకిస్థాన్ ఆధారపడింది. నిధుల కోసం ఐఎంఎఫ్ విధించిన షరతులు పాటించడం మినహా గత్యంతరం లేకుండా పోయింది. ఇందులో భాగంగానే అంతర్జాతీయ విమానయాన సంస్థను అమ్మేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

## డ్రగ్స్ దందా..
## కువైట్‌లో ఇద్దరు భారతీయులకు మరణశిక్ష



కువైట్ న్యాయస్థానం మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులో ఇద్దరు భారతీయులకు మరణశిక్ష విధించింది. హెరాయిన్, మెథాంఫెటమైన్‌లతో పట్టుబడిన ఇద్దరికి అక్కడి న్యాయస్థానం మరణ శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. దేశంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించిన కువైట్ అంతర్గత వ్యవహారాల శాఖ, ఇటీవల ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. ఇందులో భాగంగా డ్రగ్ కంట్రోల్ అధికారులు కైఫాన్, షువైఖ్ ప్రాంతాల్లో నిఘా పెట్టి ఇద్దరు భారతీయులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 14 కిలోల హెరాయిన్, 8 కిలోల మెథాంఫెటమైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులకు అంతర్జాతీయ డ్రగ్స్ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని సమాచారం. ఈ మేరకు ఆధారాలను ప్రాసిక్యూటర్లు కోర్టులో ప్రవేశపెట్టగా, దోషులకు మరణశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది.

## దేశంలో 49 లక్షల
## టైఫాయిడ్ జ్వరం కేసులు నమోదు

**న్యూఢిల్లీ:** 2023 సంవత్సరంలో దేశంలో సుమారు 49 లక్షల టైఫాయిడ్ జ్వరం కేసులు నమోదు అయినట్లు ఓ నివేదికలో వెల్లడైంది. దీంట్లో 7850 మరణించినట్లు పేర్కొన్నారు. ఢిల్లీ, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో టైఫాయిడ్ జ్వరం కేసులు అధికంగా ఉన్నాయి. ఆ రాష్ట్రాల్లో సుమారు 30 శాతం కేసులు నమోదు అయినట్లు నివేదిక ద్వారా తెలిసింది. ద లాన్సెట్ రీజినల్ హెల్త్ సౌత్‌ఈస్ట్ ఏషియాలో ఆ రిపోర్టును ప్రచురించారు. టైఫాయిడ్ జ్వరం సోకినవారిలో 7.3 లక్షల మంది ఆస్పత్రిలో చేరారని, దాంట్లో ఆరు లక్షల మందికి ఫ్లోరోక్వినోలోన్ రెసిస్టెన్స్ కలిగి ఉన్నట్లు నిర్ధారణ జరిగింది. యాంటీ బయాటిక్, యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ మందుగా దీన్ని వాడుతారు. బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ ద్వారా టైఫాయిడ్ జ్వరం వస్తుంది. కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల ఇలా జరుగుతున్నది. ఒకటి నుంచి మూడు వారాల్లోగా లక్షణాలు కనిపిస్తాయి. హై ఫీవర్, తలనొప్పి, కడుపు నొప్పి, అలసట వస్తుంది. యాంటీబయాటిక్స్, సపోర్టి కేర్ ద్వారా చికిత్స అందిస్తారు. లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్ అండ్ క్రిస్టియన్ మెడికల్ కాలేజీ(వెల్లోర్) పరిశోధకులు టైఫాయిడ్ ఫీవర్‌పై నివేదిక రూపొందించారు. ఢిల్లీ, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో ఎక్కువ శాతం ఫ్లోరోక్వినోలోన్ రెసిస్టెంట్ కేసులను గుర్తించారు. ఈ రాష్ట్రాల్లో మరణాలు కూడా ఎక్కువే ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు.



## అమెరికా నౌకలను ముంచేస్తాం

వెనెజువెలాతో సంబంధం ఉందంటూ, రష్యా జెండా కలిగిన ఆయిల్ ట్యాంకర్‌ను అమెరికా బలగాలు స్వాధీనం చేసుకోవడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రంలో జరిగిన ఈ ఘటనపై రష్యా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అమెరికా తీరు ఇలాగే కొనసాగితే, వారి కోస్ట్ గార్డ్ పడవలను టార్పిడోలతో ముంచివేయాల్సి వస్తుందని రష్యా చట్టసభ సభ్యుడు ఒకరు గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఐస్‌లాండ్‌కు దక్షిణంగా 190 మైళ్ల దూరంలో 'మారినెరా' అనే రష్యన్ ట్యాంకర్‌ను అమెరికా రక్షణ శాఖ, కోస్ట్ గార్డ్ సంయుక్తంగా సీజ్ చేశాయి. ఈ ఆపరేషన్‌కు బ్రిటన్ కూడా సహకరించింది. హెలికాప్టర్ ద్వారా నౌకపైకి దిగిన అమెరికా మెరైన్లు సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. ఇదే సమయంలో, జెండా లేని 'ఎం/టీ సోఫియా' అనే మరో నౌకను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వీడియోను యూఎస్ కోస్ట్ గార్డ్ విడుదల చేసింది. ఈ ఘటనపై రష్యా ఎంపీ అలెక్సీ జురావ్లెవ్ తీవ్రంగా స్పందించారు. "ఏం చేసినా శిక్ష పడదన్న ధీమాతో అమెరికా ఉంది. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తే సైనిక దాడులకు సిద్ధంగా ఉండాలి. అవసరమైతే అమెరికా కోస్ట్ గార్డ్ పడవలను ముంచేయాల్సి వస్తుంది" అని ఆయన హెచ్చరించారు. ఈ చర్యను 'సముద్రపు దోపిడీ' అని రష్యా అధికారులు అభివర్ణించారు. ఇది అంతర్జాతీయ సముద్ర చట్టాలను ఉల్లంఘించడమేనని రష్యా రవాణా శాఖ ఖండించింది. వెనెజువెలా చమురు ఎగుమతులపై అమెరికా విధించిన ఆంక్షలను అమలు చేయడంలో భాగంగానే ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఆంక్షలను తప్పించుకోవడానికి వెనెజువెలా, ఇరాన్ వంటి దేశాలు ఉపయోగిస్తున్న 'షాడో ఫ్లీట్' నౌకలను లక్ష్యంగా చేసుకుని అమెరికా ఈ ఆపరేషన్లు నిర్వహిస్తోంది. ఈ తాజా ఘటనతో అమెరికా, రష్యా మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.



## కోల్‌కతాలో ఐ-ప్యాక్ సంస్థపై ఈడీ దాడులు..

**తీవ్రంగా ఖండించిన సీఎం మమత**

**మనీ లాండరింగ్ కేసులో భాగంగా ఈ సోదాలు జరుపుతోంది**

కోల్‌కతాలోని పొలిటికల్ కన్సల్టెన్సీ ఐ-ప్యాక్ సంస్థపై గురువారం ఉదయం ఈడీ దాడులు చేసింది. ఐ-ప్యాక్ సంస్థకు చెందిన కీలక అధికారి ప్రతీక్ జైన్ ఇంటితోపాటు, వి.సాల్ట్ లేక్ లోని ఐ-ప్యాక్ ఆఫీసుపై కూడా ఈడీ దాడులు కొనసాగిస్తోంది. మనీ లాండరింగ్ కేసులో భాగంగా ఈ సోదాలు జరుపుతోంది. ప్రతీక్ జైన్.. మమత ఆధ్వర్యంలోని టీఎంసీ పార్టీ కోసం పని చేసే కీలక వ్యక్తి. టీఎంసీ కోసం రాజకీయ వ్యూహాలు రచిస్తుంటారు. దీంతో తనకు అనుకూలమైన ప్రతీక్ జైన్ ఇల్లు, కార్యాలయంపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ దాడులు చేయడాన్ని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్రంగా ఖండించారు. దాడులు జరుగుతున్న సమయంలోనే మమత, పోలీసు ఉన్నతాధికారులతో కలిసి ప్రతీక్ జైన్ ఇంటికి వెళ్లారు. తన పార్టీకి సంబంధించిన కీలక పత్రాల్ని తాను తీసుకున్నట్లు మమత తెలిపారు. తమ పార్టీకి సంబంధించిన అభ్యర్థుల వివరాలు, రాజకీయ, ఎన్నికల వ్యూహాలకు సంబంధించిన రహస్య సమాచారాన్ని తెలుసుకునేందుకే ఈడీ ఈ దాడులు చేస్తోందని మమత ఆరోపించారు. తాము కూడా బీజేపీ ఆఫీసుపై దాడులు చేస్తే ఎలా ఉంటుంది అని మమత ప్రశ్నించారు. తన చేతిలో ఒక ఫైల్ తో మమత మీడియాతో మాట్లాడారు. అలాగే, ఐ-ప్యాక్ ఆఫీసుకు కూడా ఆమె చేరుకున్నారు. ఈడీ దాడులు జరుగుతుండగా.. ఆఫీసు బయట టీఎంసీ కార్యకర్తలు అక్కడ నిరసనలు చేస్తున్నారు. మరోవైపు ఐ-ప్యాక్ ఆఫీసు వద్ద కేంద్ర బలగాల్ని కూడా మోహరించారు. పోలీసు ఉన్నతాధికారులు కూడా పరిస్తితిని సమీక్షిస్తున్నారు. మరోవైపు ఈడీ దాడులు జరుగుతున్న వ్యక్తి ఇంటికి సీఎం వెళ్లడాన్ని ప్రతిపక్ష బీజేపీ నేత సువేందు అధికార్

# టెలిమెట్రీ పరికరాల ఏర్పాటు కుదరదు

-మొదటిపేజీ తరువాయి

కొనసాగుతున్నం దున నిర్ణయం తీసుకోలేదని తెలిపింది. 2016-18 కాలంలో మొదటి దశ టెలిమెట్రీ ప్రారంభమైనప్పటికీ సాంకేతిక సమస్యలు, ఖచ్చితత్వం, డేటా నిలకడ, ఇరు రాష్ట్రాల అంగీకారం విషయాల్లో ఇబ్బందులు ఎదురయ్యాయని కేఆర్ఎంబీ తెలిపింది. బోర్డుకు స్పష్టమైన పరిధి, అమలు చేయగల అధికారాలు లేకుండా స్వతంత్ర టెలిమెట్రీ డేటాతో నియంత్రణ చేయడాన్ని రాష్ట్రాలు అంగీకరించకపోవచ్చని, అమలు సామర్థ్యం ప్రశ్నార్థకం అవుతుందని పేర్కొంది.

**18 రాడార్ సెన్సర్లలో కేవలం ఏడు మాత్రమే**

మొదటి దశ టెలిమెట్రీలో ఏర్పాటు చేసిన 18 రాడార్ సెన్సర్లలో కేవలం ఏడు మాత్రమే పూర్తిగా సంతృప్తికరంగా పని చేస్తున్నాయని, డేటా స్థిరత్వం విషయంలో ఇబ్బందులు ఉన్నాయని తెలిపింది. టెలీమెట్రీలో ఉపయోగించే సైడ్ లుకింగ్ డాప్లర్ పరికరాలు ఖరీదైనవని, మారుమూల ప్రాంతాల్లోని కాల్వల వద్ద భద్రత, నిర్వహణ లాంటి సమస్యలు ఎక్కువగా ఉంటాయని బోర్డు తెలిపింది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని బోర్డు పరిధి విషయమై సుప్రీంకోర్టు తీర్పు, బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్ ద్వారా ప్రాజెక్టుల వారీ కేటాయింపులు, ఆపరేషన్ ప్రొటోకాల్‌పై స్పష్టత వచ్చే వరకు రెండు, మూడు దశల టెలిమెట్రీ విస్తరణను వాయిదా వేయాలని కేఆర్ఎంబీ సూచించింది.

**మళ్లీ రీడిజైన్ చేసి ఏర్పాటు**

తీర్పులు, కేటాయింపుల తర్వాత మొత్తం కృష్ణా బేసిన్ కోసం టెలిమెట్రీ అవసరాలు, లొకేషన్లు, టెక్నాలజీని సమగ్రంగా మళ్లీ రీడిజైన్ చేసి ఏర్పాటు చేయడం సముచితమని కేఆర్ఎంబీ అభిప్రాయపడింది. రెండో దశలో తెలంగాణలో రెండు, ఏపీలో ఏడు టెలిమెట్రీ స్టేషన్ల ఏర్పాటుకు సుమారు రూ.7.5 కోట్ల వ్యయం అంచనా వేశారు. అందుకోసం తెలంగాణ ఇప్పటికే రూ.4 కోట్లకు పైగా నిధులు కూడా ఇచ్చింది. ఏపీ ఇవ్వాల్సి ఉంది. మూడో దశలో తెలంగాణ మరో 11 టెలిమెట్రీ స్టేషన్లను ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను పరిశీలించేందుకు ఇరు రాష్ట్రాల అధికారులు, బోర్డు సభ్యుడు నేతృత్వంలో సంయుక్త కమిటీ ఏర్పాటు చేయాలని ఛైర్మన్ సూచించినప్పటికీ, ఏపీ అంగీకరించలేదు.




**ఇద్దరూ కలిసినా పని అవ్వలేదు**

రెండు నెలల కిందట ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అధికారులతో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి నిర్వహించిన సమావేశంలో టెలిమెట్రీ యంత్రాల ఏర్పాటు విషయమై సానుకూల నిర్ణయం తీసుకున్నారు. అయినప్పటికీ ప్రక్రియ ముందుకు సాగలేదు. నిర్వహణ కోసం కృష్ణానదీ యాజమాన్య బోర్డుకు రెండు రాష్ట్రాలు సరైన సమయంలో నిధులు ఇవ్వడం లేదు. దీంతో బోర్డు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఉద్యోగులకు వేతనాలు కూడా ఇచ్చే పరిస్థితి లేనందున టెలిమెట్రీ కోసం తెలంగాణ ఇచ్చిన రూ.4 కోట్ల నిధుల నుంచి చెల్లింపులు చేస్తామని బోర్డు గతంలో తెలిపింది. అందులో నుంచే ఉద్యోగాలకు జీతాలు ఇచ్చినట్లు రెండు రాష్ట్రాలకు బోర్డు సమాచారం ఇచ్చింది.

**సీఎం చొరవతో రూ.4.18 కోట్లు**

టెలిమెట్రీల ఏర్పాటుకు రాష్ట్రం విడుదల చేసిన నిధులను నిర్వహణకు వినియోగించుకుంటామంటూ బోర్డు చేసిన ప్రతిపాదనపై సర్కారు గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. కృష్ణా పరీవాహకంలో పరిమితికి మించి ఏపీ నీటిని తీసుకెళ్లడాన్ని పక్కాగా లెక్కించేందుకు రెండో దశ టెలిమెట్రీ పరికరాల ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.4.18 కోట్లు కేటాయించారని నీటి పారుదల శాఖ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు బోర్డు ప్రతిపాదనను తెలియజేస్తూ ఈఎన్సీ అంజద్ హుస్సేన్ ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనిపై నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వివరాలు అందజేయగా, టెలిమెట్రీల కోసం కేటాయించిన నిధులను మళ్లించుకునే ప్రతిపాదనలు ఏంటంటూ ప్రశ్నించినట్లు సమాచారం. బోర్డు నిర్వహణ, టెలిమెట్రీల నిర్వహణను వేటికవే ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకోవాలని అన్నట్లు తెలిసింది. ఈ మేరకు ఈఎన్సీ బోర్డుకు లేఖ రాసినట్లు సమాచారం.

# కేటీఆర్ టూర్‌లో జగన్ జెండాలు

**ఖమ్మం :** రాజకీయాలలో ఇలా ఉండాలని ఉండదు. ఇలా ఉంటేనే బాగుంటుందని కూడా ఉండదు. రాజకీయాలలో ఎలాగైనా జరుగుతుంది. ఏదైనా జరుగుతుంది. దానికి ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు. కొన్ని సందర్భాలలో బద్ధ శత్రువులుగా ఉన్న కాంగ్రెస్, బిజెపి కలిసిపోతాయి. రాజకీయ లక్ష్యాల కోసం కలిసి పోటీ చేస్తాయి. ఇంతవరకు జాతీయస్థాయి రాజకీయ మొక్క చిత్రంలో ఇటువంటి సన్నివేశం చూడకపోయినప్పటికీ.. రాష్ట్ర స్థాయిలలో మాత్రం కాంగ్రెస్, బిజెపి ఒక ఒర లో ఇమిడిపోయిన దృశ్యాలు చాలానే కనిపించాయి.తెలంగాణలో ఇప్పుడు విభిన్నమైన రాజకీయ దృశ్యం కనిపిస్తోంది. బహుశా దీనిని చాలామంది ఊహించి ఉండరు. 2014లో, 2018 లో భారత రాష్ట్ర సమితి తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. 2018లో అధికారంలోకి వచ్చిన తర్వాత సహజంగానే భారత రాష్ట్ర సమితి అధినేత కేసిఆర్ ఏపీ రాజకీయాలలో వేలు పెట్టడం మొదలుపెట్టారు.అంతకుముందు చంద్రబాబు ప్రస్తావన తీసుకొచ్చి రిటర్న్ గిఫ్ట్ లో భాగంగా కేసీఆర్ ఈ దిశగా అడుగులు వేశారు. 2019లో ఏపీలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావడంలో విజయవంతం అయ్యారు.. చాలా సందర్భాలలో అలైబలై అన్నట్టుగా వ్యవహరించారు. మధ్య మధ్యలో ప్రగతి భవన్ కు పిలిపించడం.. తెలంగాణ సత్కారాలు అందించడం వంటివి జరిగిపోయాయి. 2023 ఎన్నికల్లో మాత్రం సెంటిమెంట్ రగిలించే క్రమంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు మీదికి ఏపీ పోలీసులు వచ్చారు. అప్పట్లో ఈ సన్నివేశం కాస్త ఉద్విగ్నంగా మారినప్పటికీ.. గులాబీ పార్టీకి మాత్రం ఓట్లు తెప్పించే మంత్రంగా పనిచేయలేదు.ఇప్పుడిక అటు తెలంగాణలో.. ఇటు ఆంధ్రప్రదేశ్లో కెసిఆర్, జగన్ అధికారాన్ని కోల్పోయారు. అధికారాన్ని దక్కించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రయత్నాలు ఎంతవరకు సఫలికృతం అవుతాయి తెలియదు కానీ.. తెలంగాణ రాష్ట్రంలో గులాబీ పార్టీకి వైసిపి బహిరంగంగా సపోర్ట్ తెలియజేస్తోంది. బుధవారం ఖమ్మంలో కేటీఆర్ పర్యటించినప్పుడు.. కూసుమంచి వద్ద స్వాగతం



పలికే క్రమంలో గులాబీ పార్టీ జెండాలతో పాటు, వైసిపి జెండాలు కూడా కనిపించాయి. కొంతమంది జగన్, కేటీఆర్ ను కలిపి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.తెలంగాణ వాదంతో, తెలంగాణ సెంటిమెంట్తో అధికారంలోకి వచ్చిన భారత రాష్ట్ర సమితి.. తెలుగుదేశం పార్టీని, వైసీపీని, జనసేన ను ఆంధ్ర బూచిలుగా చూపించే ప్రయత్నం చేసింది. చివరికి ఆ పార్టీలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తూ 2018లో అధికారంలోకి వచ్చింది. ఇక ఉద్యమ సమయంలో అయితే జగన్ మీద కేసీఆర్, కేటీఆర్ ఏ స్థాయిలో విమర్శలు చేశారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.మానుకోటలో జగన్ పర్యటన సందర్భంగా రాళ్లు రువ్విన సంఘటన కూడా విధితమే. ఇన్ని జరిగిన తర్వాత కేవలం రాజకీయ ఆకాంక్షలతోనే గులాబీ పార్టీ అడుగులు వేయడం.. తన ఉద్యమస్ఫూర్తిని మర్చిపోవడం బాధాకరం. తన పర్యటనలో వైసీపీ జెండాలు కనిపించడం ద్వారా తెలంగాణ సమాజానికి కేటీఆర్ ఏం సమాధానం చెబుతారు? ఎలాంటి సంజాయిషీ ఇస్తారు? ఈ ప్రశ్నలకు కాలమే సమాధానం చెప్పాలి.ఇటీవల బెంగళూరు నగరంలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో జగన్, కేటీఆర్ పాల్గొన్నారు. వారిద్దరూ పక్కపక్కన కూర్చున్నారు.. ఈ కలయికను గులాబీ పార్టీ గొప్పగా చెప్పుకుంది. వైసిపి గట్టిగా ప్రచారం చేసుకుంది. దీనిని బట్టి అంతర్గతంగా ఏం జరుగుతుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని తెలంగాణ వాదులు అంటున్నారు.

# ఉర్దూ వర్సిటీ విస్తరణకు సిద్ధం

**హైదరాబాద్ :** గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం విస్తరణకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ జారీ చేసిన షోకాజ్ నోటీసుపై స్పందించింది. మణికొండ జాగీర్‌లోని 50 ఎకరాల భూమిలో భవిష్యత్ అవసరాల కోసం అకడమిక్ భవనాలు, హాస్టళ్లు నిర్మించనున్నట్లు విశ్వవిద్యాలయం తెలిపింది. ఈ పనులకు సంబంధించిన సమగ్ర నివేదిక సిద్ధమవుతోందని, నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపుతామని.. అందుకు రెండు నెలల సమయం గడువు ఇవ్వాలని సమాధానం ఇచ్చింది.గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ యూనివర్సిటీ విస్తరణపై ముందడుగు పడింది. వర్సిటీ క్యాంపస్ విస్తరణ, భవిష్యత్ అవసరాలపై యాజమాన్యం దృష్టి సారించింది. వర్సిటీకి కేటాయించిన భూములపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ జారీ చేసిన షోకాజ్ నోటీసుకు వర్సిటీ సానుకూలంగా స్పందించింది. వర్సిటీకి కేటాయించిన భూముల్లో... మణికొండ జాగీర్ పరిధిలోని 50 ఎకరాల భూమిని ఎందుకు వెనక్కి తీసుకోకూడదో తెలపాలంటూ... రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కొన్ని రోజుల క్రితం షోకాజ్ నోటీసులు జారీ చేశారు.దీనిపై వర్సిటీ తాజాగా స్పందిస్తూ... ఆ స్థలంలో చేపట్టబోయే అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను వెల్లడించింది. పూర్తి స్థాయి నివేదికను సమర్పించేందుకు రెండు నెలల గడువు ఇవ్వాలని వర్సిటీ రిజిస్ట్రార్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు.ఈ షోకాజ్ నోటీసులపై 'మనూ' రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్కే ఇంతియాజ్ అహ్మద్ స్పందిస్తూ... జనవరి 1న లేఖ రాశారు. వర్సిటీ విస్తరణ కోసం కేటాయించిన ఆ 50 ఎకరాల భూమి ఖాళీగా లేదని... దాన్ని భవిష్యత్ విస్తరణ కోసం రిజర్వ్ చేసినట్లు తెలిపారు. ఈ స్థలంలో వర్సిటీకి అవసరమైన కొత్త అకడమిక్ భవనాలు, విద్యార్థుల కోసం హాస్టళ్లు, సిబ్బంది నివాస సముదాయాల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు.ఈ స్థలంలో చేపట్టబోయే ప్రాజెక్టులకు సంబంధించి సీపీడబ్ల్యూడీ హైదరాబాద్ విభాగం 'సమగ్ర ప్రాజెక్టు నివేదిక' ను సిద్ధం చేస్తోందని వివరించారు. ఆ నివేదిక రాగానే నిధుల మంజూరు కోసం కేంద్ర విద్యాశాఖ, హెఫా కు ప్రతిపాదనలు పంపుతామని లేఖలో పేర్కొన్నారు. అందుకే రెండు నెలల గడువు ఇవ్వాలని కోరారు.అసలేం జరిగిందం టే.. 1998లో ఉర్దూ యూనివర్సిటీని ఏర్పాటు చేయడం కో సం అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం గండిపేట మండలంలోని మణికొండ జాగీర్ గ్రామంలో.. సర్వే నంబర్ 211, 212లో ఉన్న సుమారు 200 ఎకరాలను కేటాయించింది. అయితే, ఇందులో 50 ఎకరాలు ఇంకా ఖాళీగానే ఉంది. దీంతో నిబం ధనల ప్రకారం వినియోగంలో లేని ఆ 50 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎందుకు వెనక్కి తీసుకోకూడదో తెలపాలని 2025, డిసెంబర్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్.. రెవెన్యూ శాఖ తరఫున వర్సిటీకి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.దీనిపై స్పందించిన వర్సిటీ.. తాము ఆ 50 ఎకరాల భూమిని వృథాగా ఉంచలేదని తెలిపింది. అక్కడ భారీ నిర్మాణాలు చేపట్టబోతున్నామని స్పష్టం చేసింది. వర్సిటీ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని తమ విజ్ఞప్తిని పరిశీలించాలని కోరింది.

## ఉపాధి హామీని నిర్వీర్యం చేసే కుట్ర

-మొదటిపేజీ తరువాయి

వీబీ జీ రామ్ జీ (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్) చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశామన్నారు. ఉపాధి హామీని రద్దు చేస్తే మళ్లీ వలసలు ప్రారంభమవుతాయని హెచ్చరించారు. కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చేందుకు, అదానీ-అంబానీలకు ప్రజలను కూలీలుగా మార్చేందుకు ఉపాధి హామీని రద్దు చేస్తున్నారని విమర్శించారు. వికసిత్ భారత్ కాదు.. సంక్షోభ భారత్‌ను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. నల్ల చట్టాల విషయంలో క్షమాపణ చెప్పే వరకు వదల్లేదని.. ఇప్పుడు ఉపాధి హామీ విషయంలోనూ క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. అధికారం ఉందని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ ఆరోపించారు.

**కార్యకర్తల త్యాగాల వల్లే...**

ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తల పాత్రను ముఖ్యమంత్రి రేవంత్ కొనియాడారు. కార్యకర్తల కష్టం, త్యాగాలతోనే అధికారంలో ఉన్నామని.. వచ్చిన పదవులన్నీ కార్యకర్తలు ఇచ్చినవేనని చెప్పారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ ఎన్నికల్లో 66 శాతంపైగా కాంగ్రెస్ గెలిచిందని, మున్సిపల్ ఎన్నికల్లోనూ గెలవాలని ధీమా వ్యక్తం చేశారు. కష్టపడినవాడు ఎప్పుడూ నష్టపోడని తెలిపారు. కాంగ్రెస్ మంత్రులంతా కష్టపడి పైకొచ్చినవారేనని, పార్టీ అవకాశం ఇస్తే తనతోపాటు ఎవరికైనా గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. ఉపాధీ హామీ పేరు మార్పు వెనుకలా కార్పొరేట్ కుట్ర దాగి ఉందని అన్నారు. కేంద్ర చేస్తున్నది వికసిత భారత్ కాదని సంక్షోభ భారత్ దిశగా నడిపిస్తోందని అన్నారు. బడా కంపెనీలకు మేలు చేసేలా చట్టంలో మార్పులు చేశారని అన్నారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన పీసీసీ, పీఏసీ విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు, సీనియర్ నేతలు మాట్లాడారు. కేంద్రం విధానాలపై ఫైర్ అయ్యారు. గ్రామీణ ప్రజలకు మరణ శాసనం రాసేలా మోదీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి పేరు మార్చి దాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కామెంట్ చేశారు. ప్రజలకు ఎంతో మేలు చేసే పథకం నుంచి మహాత్మ గాంధీ పేరు తీసేయడమే కాకుండా పని హక్కులు, నిధులు కుదించారని అన్నారు. ప్రజలకు పని కల్పించే పథకంలో పని మాయమైందని, ప్రజలకు సేవ చేసే అధికారులను కూడా తొలగించారని, ఇప్పుడు కేంద్రం ఇచ్చే నిధుల్లో కూడా కోత పెట్టారని మండిపడ్డారు. రాష్ట్రాలపై భారం మోపి ప్రజల ఉపాధికి గండి కొడుతున్నారని అన్నారు. అందుకే కేంద్రం తీసుకొచ్చిన నిర్ణయాలను వ్యతిరేకిస్తూ వేల గ్రామాల్లో తీర్మానాలు చేశారని వాటిని రాష్ట్రపతికి అందజేస్తామని తెలిపారు.

## రాహుల్ గాంధీని రేవంత్ రెడ్డి ఏం అన్నాడో నేనూ అదే అన్నాను

-మొదటిపేజీ తరువాయి

నాయకులు విమర్శలు చేస్తున్నారు. కానీ, నేను కొత్తగా ఏమీ అనలేదు. రేవంత్ రెడ్డి అన్న మాటనే నేను అన్నాను. మీ రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీని 'పప్పు' కాదు 'ముద్దపప్పు' అని అన్నారు. కాబట్టి ఆ విమర్శలు ఏమైనా ఉంటే రేవంత్ రెడ్డిపై చేయండి. మీ సోనియా గాంధీని మీ రేవంత్ రెడ్డి 'బలిదేవత' అన్నారు. అలాంటి వ్యక్తిని తీసుకువచ్చి మీరు ముఖ్యమంత్రిగా చేశారు. తనను ముఖ్యమంత్రిగా చేసిన రాహుల్ గాంధీని 'ముద్దపప్పు' అని అన్నది రేవంత్ రెడ్డే" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ 'దద్దమ్మ' కాంగ్రెస్ పాలనలో యూరియా కోసం రైతులు కుస్తీలు పట్టాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. ఒక్క బస్తా యూరియా కోసం కూడా భారీ క్యూలైన్‌లలో గంటల తరబడి నిలబడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి క్రాప్ హాలిడేలు ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో యూరియా కోసం కుస్తీలు లేవని, విత్తనాల కోసం పోటీ లేదని, కరెంటు కష్టాలు లేవని, క్రాప్ హాలిడేలు లేవని ఆయన వెల్లడించారు. పెండింగ్ పనులు పూర్తి చేస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందనే అక్కసుతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పక్కన పెట్టారని కేటీఆర్ ఆరోపించారు. కేవలం 10 శాతం పనులు పూర్తి చేస్తే వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉన్నా ఈ ప్రభుత్వం ఆ పని చేయడం లేదని విమర్శించారు. పెండింగ్ పనులు పూర్తి చేస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందని, తన బాస్‌కు కోపం వస్తుందనే భయంతో రేవంత్ రెడ్డి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆయన అన్నారు.

## మేడారం జాతరకు కేసీఆర్‌కు ఆహ్వానం..

-మొదటిపేజీ తరువాయి

కాసేపటి క్రితమే ఎర్రవల్లి ఫామ్ హౌస్ నుంచి మంత్రులు కొండా సురేఖ, సీతక్క వెళ్లిపోయారు.

అంతకుముందు మంత్రులిద్దరూ మాట్లాడుతూ..'మాజీ సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించారు. హెలికాప్టర్‌లో సతీసమేతంగా జాతరకు కేసీఆర్ వచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. ఆడబిడ్డలుగా కేసీఆర్ దగ్గరికి వచ్చాము. మాకు చీర పెట్టి కేసీఆర్ ఆహ్వానం పలికారు. ఇది రాజకీయాలు చేసే సమయం కాదు. మేడారం జాతరను ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోంది. అందరిని మేడారం జాతరకు రావాల్సిందిగా ఆహ్వానం పలుకుతున్నాం' అని అన్నారు.

## కార్పొరేషన్‌గా నల్గొండ



**నల్గొండ :** తెలంగాణ శాసనసభ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ, అభివృద్ధిలో భాగంగా జిల్లా కేంద్రమైన నల్లగొండను మున్సిపల్ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రవేశపెట్టిన బిల్లుకు అసెంబ్లీ ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో నల్లగొండ పట్టణ ముఖచిత్రం పూర్తిగా మారనుంది. నల్లగొండ పట్టణం శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సాధారణంగా ఒక పట్టణాన్ని కార్పొరేషన్‌గా గుర్తించడానికి రూ. 20 కోట్ల వార్షిక ఆదాయం, 2 లక్షల జనాభా ప్రాతిపదికగా ఉంటుంది.అయితే నల్లగొండ పట్టణం ఇప్పటికే రూ. 40 కోట్ల వార్షిక ఆదాయంతో పాటు 2.5 లక్షల జనాభాను కలిగి ఉండటంతో అప్‌గ్రేడ్ ప్రక్రియ సులభతరమైంది. ఒకప్పుడు కేవలం రూ. 10 వేల బడ్జెట్‌తో ప్రారంభమైన ఈ పట్టణం.. నేడు రియల్ ఎస్టేట్, వాణిజ్య రంగాల్లో దూసుకుపోతోంది. కార్పొరేషన్‌గా మారడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధుల రాక పెరగడమే కాకుండా అధునాతన మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ఇదే సమావేశంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తన నియోజకవర్గ సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోల్ గ్రామాన్ని కొత్త మండల కేంద్రంగా ప్రకటించాలని, అలాగే నకిరేకల్ పట్టణాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించే అవకాశం ఉంది.మరోవైపు, తెలంగాణ శాసనమండలి కార్యకలాపాలు ముగిశాయి. స్పీకర్ గుత్తా సుఖేందర్ రెడ్డి సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశాల్లో మున్సిపల్ సవరణ బిల్లుతో పాటు మరో కీలక నిర్ణయానికి మండలి ఆమోద ముద్ర వేసింది. తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ సేవలను గౌరవిస్తూ.. ఆయన కుమారుడికి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం కల్పించే బిల్లును డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టగా సభ్యులందరూ మద్దతు తెలిపారు. ఈ శాసనమండలి సమావేశాల్లో ఎమ్మెల్సీ కవిత చేసిన చివరి ప్రసంగం ఆసక్తి రేకెత్తించింది. తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన ఆమె.. సభలో వీడ్కోలు ప్రసంగం చేశారు. తన రాజీనామాను వెంటనే ఆమోదించాలని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# రోజుకో యాపిల్ తింటే ఎన్నో బెనిఫిట్స్ అనుకుంటున్నారా..?



ప్రస్తుతం మార్కెట్‌లో లభించే బెండకాయలు, ఆపిల్స్‌పై రసాయనాలు, స్ప్రేలు వాడుతున్నారని ప్రముఖ ఆర్గానిక్ వ్యవసాయదారుడు సతీష్ బాబు గద్దె వెల్లడించారు. బ్రోమైడ్ వంటివి కూరగాయలు, పండ్లపై ఉపయోగించి తాజాగా కనిపించేలా చేస్తున్నారని తెలిపారు. ఈ పద్ధతులు వినియోగదారుల ఆరోగ్యానికి హానికరం అని ఆయన హెచ్చరించారు. ఆహార కల్తీ ప్రస్తుత సమాజంలో ఒక తీవ్రమైన సమస్యగా మారింది. పాలు, కూరగాయలు, పండ్ల వంటి నిత్యవసర వస్తువులలో రసాయనాల వాడకం గురించి ప్రముఖ ఆర్గానిక్ వ్యవసాయదారుడు సతీష్ బాబు గద్దె ఇటీవల వివరించారు. పశువులకు హార్మోనల్ ఇంజెక్షన్లు ఇవ్వడం వల్ల అవి మనుషుల ఆరోగ్యంపై ఎంతవరకు ప్రభావం చూపుతాయో ఆయన ప్రశ్నించారు. పాలు వంటి ఉత్పత్తులకు వినియోగదారులు తక్కువ ధర చెల్లించడానికి మొగ్గు చూపడం వల్ల, ఉత్పత్తిదారులు అనైతిక పద్ధతులకు పాల్పడుతున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. పాలకు అధిక ధర ఉంటే, ఉత్పత్తిదారులు సహజసిద్ధమైన పద్ధతులను అనుసరించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కూరగాయల విషయంలో, బెండకాయలను ఉదాహరణగా తీసుకున్నారు. గతంలో ముదిరిన బెండకాయలు విరిస్తే విరిగిపోకపోయేవని, కానీ ఇప్పుడు మార్కెట్‌లో ఎంత లావుగా ఉన్నా అన్ని బెండకాయలు లేతగా, తాజాగా కనిపిస్తాయని తెలిపారు. దీనికి కారణం కోసే ముందు వాటిపై ఒక రకమైన స్ప్రే చేయడం అని ఆయన వెల్లడించారు. ఈ స్ప్రే చేసిన తర్వాత ముదిరిన బెండకాయలు కూడా లేతగా మారి, సులువుగా విరిగిపోతాయని వివరించారు. ఈ ప్రక్రియలో స్ప్రే చేసిన బెండకాయలు ఒక రోజు తర్వాత కోసి, హోల్‌సేల్‌కు, ఆపై రిటైల్‌కు వస్తాయని, అప్పటికే వాటిలో రసాయనాలు ఇమిడి ఉంటాయని ఆయన హెచ్చరించారు. పండ్ల విషయానికి వస్తే, ఆపిల్స్‌ను ఉదాహరణగా చూపారు. పోలాండ్ నుంచి ఒక నెల రోజుల ప్రయాణం తర్వాత కూడా చెన్నై ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన ఆపిల్స్ పాడవకుండా తాజాగా ఉన్నాయని ఆయన స్నేహితుడు చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. ఇవి మన లోకల్ మార్కెట్లకు వచ్చి, వినియోగదారుల ఇళ్లలో కూడా ఐదారు రోజులు తాజాగా ఉంటాయని అన్నారు. దీనికి కూడా కూరగాయలపై వాడే రసాయనాల లాంటి స్ప్రేలే కారణమని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా, కూరగాయలు, పండ్లపై వాడే రసాయనాలలో "బ్రోమైడ్" ఒకటి అని ఆయన స్పష్టం చేశారు. ఎలుకలను చంపడానికి వాడే బ్రోమైడ్ రసాయనాన్ని కూరగాయలు, పండ్లపై కొడుతున్నారని ఆయన తెలిపారు.

# మునగ ఈ వ్యాధుల పాలిట బ్రహ్మాస్త్రం..



మునగలో ఎన్నో పోషకాలతోపాటు.. ఔషధ గుణాలు పుష్కలంగా దాగున్నాయి.. మునగ మొక్క, వేర్లు, మునక్కాయలు, ఆకులు, పువ్వులు అన్నీ పవర్‌ఫులే.. అందుకే.. వీటిని రెగ్యులర్ గా తీసుకుంటే.. ఆరోగ్యానికి చాలా మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా దాదాపు అన్ని సీజన్లలో లభించే.. మునగలో ఆరోగ్యానికి మేలు చేసే విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. మునగలో ఎన్నో పోషకాలతోపాటు.. ఔషధ గుణాలు పుష్కలంగా దాగున్నాయి.. మునగ మొక్క, వేర్లు, మునక్కాయలు, ఆకులు, పువ్వులు అన్నీ పవర్‌ఫులే.. అందుకే.. వీటిని రెగ్యులర్ గా తీసుకుంటే.. ఆరోగ్యానికి చాలా మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా దాదాపు అన్ని సీజన్లలో లభించే.. మునగలో ఆరోగ్యానికి మేలు చేసే విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి.. మునగకాయ, మునగ ఆకులు.. దేనికదే ప్రసిద్ధి.. వీటిని సూప్ గా లేదా.. కూరగా, పప్పులో వేసుకుని తినవచ్చు.. ఇంకా జ్యూస్ గా కూడా తాగొచ్చు.. మునగాకులను ఆయుర్వేదం ప్రకారం.. తీసుకుంటే.. ఎన్నో సమస్యలను దూరం చేయొచ్చంటున్నారు నిపుణులు.. మునగ మొక్క దాని వేర్ల నుండి పువ్వుల వరకు ఔషధ గుణాలతో నిండిన మొక్క అని.. ఇది అనేక వ్యాధులను సులభంగా నయం చేయగలదని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అయితే.. మునగ ఆకులను పోషకాల పవర్‌హౌస్ గాపిలుస్తారు. కేవలం 100 గ్రాముల మునగాకులలో నారింజ కంటే ఏడు రెట్లు ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. ఈ ఆకు ఆరోగ్యానికి ఎంత ముఖ్యమో ఇది చూపిస్తుంది. మునగాకులలో మెగ్నీషియం, మాంగనీస్, విటమిన్లు ఐ, ఇ కూడా పుష్కలంగా ఉన్నాయి. ఈ ఆకులలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది.. కేలరీలు ఉండవని పేర్కొంటున్నారు. టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతుంటే మునగ మొక్క వేర్లను నీటిలో మరిగించి తాగితే ఫలితాలు కనిపిస్తాయి. తీవ్రమైన తలనొప్పి ఉంటే మునగాకులను బాగా నలిపి తలకు పట్టిస్తే తలనొప్పి క్రమంగా తగ్గిపోతుంది. మునగ మొక్క వేరు ఆరోగ్యానికి చాలా మంచిది.. మీకు గొంతు నొప్పి ఉంటే, మీరు దాని వేళ్ళతో కషాయం తయారు చేసి, నొప్పి నుండి ఉపశమనం పొందడానికి పుక్కిలించవచ్చు. మీరు దాని ఆకులను నమలడం ద్వారా మీ చక్కెర స్థాయిలను నియంత్రించవచ్చు.

## చింతపండు తినే అలవాటు ఉందా?



పుల్లని, తీపి కలగలిసిన రుచితో ఉండే చింతపండు వంటలకు దట్టిస్తే తినడానికి రుచికరంగా ఉండటమే కాకుండా ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. చింతపండును సాధారణంగా దాని వాసన, రుచి కోసం పలు వంటలలో ఉపయోగిస్తాం. ప్రతి ఇంటి వంటగదిలో వంటకు ఉపయోగించే రకరకాల పదార్థాలు ఉంటాయి. ఇందులో చింతపండు ఒకటి. చాలా మందికి ఈ పేరు వినగానే నోరు ఊరడం సహజం. పుల్లని, తీపి కలగలిసిన రుచితో ఉండే చింతపండు వంటలకు దట్టిస్తే తినడానికి రుచికరంగా ఉండటమే కాకుండా ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. చింతపండును సాధారణంగా దాని వాసన, రుచి కోసం పలు వంటలలో ఉపయోగిస్తాం. వంటల్లో కాకుండా కొంతమందికి చింతపండు పచ్చిగానే తినడం మహా ఇష్టం. చింతపండులో యాంటీఆక్సిడెంట్లు, ఫైటోకెమికల్స్, విటమిన్లు ం, అ, ఇ, ఐ, ః6, మెగ్నీషియం, భాస్వరం, కాల్షియం, ప్రోటీన్ వంటి ముఖ్యమైన పోషకాలు దండిగా ఉంటాయి. ఇవి శరీరాన్ని వివిధ ఆరోగ్య సమస్యల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. చింతపండు తినడం వల్ల చర్మ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. బరువు తగ్గడంలోనూ ఉపయోగపడుతుంది. తద్వారా రోగనిరోధక శక్తిని పెంచుతుంది. చింతపండులో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. బలమైన రోగనిరోధక వ్యవస్థ శరీరాన్ని అన్ని కాలాల్లో ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించడంలో సహాయపడుతుంది. కానీ దాని వినియోగం ఎల్లప్పుడూ మితంగానే ఉండాలి. ముఖ్యంగా పీరియడ్స్ సమయంలో మహిళలు అనుభవించే అసౌకర్యానికి చింతపండు ఎంతో మేలు చేస్తుంది. ఇది ఋతు తిమ్మిరి నుంచి ఉపశమనం పొందడంలో, శరీరంలో ఒఆఒ కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో, ఊఆఒ కొలెస్ట్రాల్‌ను పెంచడంలో సహాయపడుతుంది. అంతేకాదు ఇది రక్తపోటు, హృదయ స్పందన రేటును నియంత్రించడంలో, శరీర ద్రవాలను సమతుల్యం చేయడంలో కూడా ఉపయోగపడుతుంది.

# బరువు తగ్గాలనే ఆరాటంలో లేనిపోని సమస్యలు తెచ్చుకోకండి!



ఆరోగ్యం పట్ల అవగాహన పెరిగిన తర్వాత చాలామంది ఇప్పుడు కొత్త రకమైన డైట్ పద్ధతులను అనుసరిస్తున్నారు. అందులో ప్రధానంగా వినిపిస్తున్న పేరు 'ఫైబర్ మాక్సింగ్'. శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌కు చెక్ పెట్టాలన్నా, జీర్ణక్రియ మెరుగుపడాలన్నా పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని అందరూ భావిస్తుంటారు. అతి సర్వత్ర వర్జయేత్ అన్నట్లుగా.. ఏదైనా హద్దు దాటితే అది అమృతంలా కాకుండా విషంలా మారుతుంది. పీచు పదార్థాల విషయంలోనూ ఇదే జరుగుతోంది. గట్ ఆరోగ్యం కోసం అతిగా ఫైబర్ తీసుకోవడం వల్ల ప్రయోజనాల కంటే నష్టాలే ఎక్కువగా ఉంటాయని తాజా పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ ప్రకారం, వయస్సును బట్టి మనం తీసుకునే ఫైబర్ పరిమాణం మారుతుండాలి. పెద్దలు రోజువారీ ఆహారంలో సుమారు 30 గ్రాముల పీచు పదార్థం ఉండేలా చూసుకోవాలి. 15 ఏళ్లలోపు పిల్లలకు 20 గ్రాములు, మూడేళ్లలోపు చిన్నారులకు కేవలం 15 గ్రాముల ఫైబర్ సరిపోతుంది. అంతకంటే ఎక్కువ తీసుకుంటే శరీరంలోని సున్నితమైన జీర్ణ వ్యవస్థపై తీవ్రమైన ఒత్తిడి పడుతుంది.అతిగా పీచు పదార్థాలు తీసుకోవడం వల్ల పేగుల్లో చికాకు కలగడం, కడుపు బిగుతుగా ఉండటం వంటి ఇబ్బందులు ఎదురవుతాయి. ముఖ్యంగా ఫైబర్ ఎక్కువైనప్పుడు తగినంత నీరు తాగకపోతే మలబద్ధకం సమస్య మరింత జటిలమవుతుంది. అంతేకాకుండా, ఆహారంలోని క్యాల్షియం, ఐరన్, జింక్ వంటి కీలక పోషకాలను శరీరం గ్రహించకుండా ఈ ఫైబర్ అడ్డుకుంటుంది. దీనివల్ల బరువు విపరీతంగా తగ్గడంతో పాటు పేగుల్లో అడ్డంకులు కూడా ఏర్పడే ప్రమాదం ఉంది. ఫైబర్ మాక్సింగ్ డైట్ పాటించేవారు కొన్ని ముఖ్యమైన సూచనలు పాటించడం అవసరం. ఒకేసారి కాకుండా ఆహారంలో ఫైబర్ పరిమాణాన్ని క్రమంగా పెంచుకుంటూ పోవాలి. అప్పుడే జీర్ణాశయం ఆ మార్పుకు అలవాటు పడుతుంది. పీచు పదార్థాలు తీసుకున్నప్పుడు ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. లేకపోతే కడుపులో తిమ్మిర్లు వచ్చే అవకాశం ఉంటుంది. కృత్రిమ ఫైబర్ పౌడర్లకు బదులుగా పండ్లు, కూరగాయలు, చిక్కుళ్లు, తృణధాన్యాలను ఎంచుకోవాలి.





## చికెన్‌లో పెరుగు వేసి వండుతున్నారా?

నాన్ వెజ్ అంటే ఇష్టపడని వారు ఎవరు ఉంటారు చెప్పండి. చాలా మంది ఎంతో ఇష్టంగా చికెన్ వండుకొని తింటారు. ఇక చికెన్ చాలా టేస్టీగా ఉండటం కోసం అందులో వివిధ రకాల ఇగ్రీడియన్స్ వేస్తారు. ముఖ్యంగా, చాలా మంది చికెన్‌లో పెరుగు వేసి వండుతుంటారు. కానీ చికెన్‌లో పెరుగు వేసి వండటం అస్సలే మంచిది కాదు అంటున్నారు ఆరోగ్య నిపుణులు. చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకు చాలా మంది ఎంతో ఇష్టంగా చికెన్ తింటుంటారు. కొంత మంది చికెన ఫ్రై, మరికొంత మంది చికెన్ బిర్యానీ చేసుకొని తింటుంటారు. ఇక మంచి టేస్ట్, కర్రీ చిక్కగా, చాలా టేస్టీగా ఉండటం కోసం కొందరు పెరుగు కలుపుతుంటారు. అయితే ఇలా చేయడం వలన అనారోగ్య సమస్యలు దరిచేరే ప్రమాదం ఉన్నదంట. పెరుగు చల్లటి, పుల్లటి స్వభావం కలిగి ఉంటుంది. చికెన్ వేడి స్వభావంతో ఉంటుంది. అందువలన ఈ రెండింటి కలిపి తినడం వలన కడుపు సమస్యలు వస్తాయంట. ముఖ్యంగా అజీర్ణం, కడుపు నొప్పి, గుండెల్లో మంట వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉన్నదంట. అంతే కాకుండా పెరుగులో ఉండే యాసిడ్స్, చికెన్‌లో ఉండే ప్రోటీన్‌తో కలవడం, అలాడే, చికెన్, పెరుగు కలిపి తినడం వలన కొంత మందికి విరేచనాల వంటి సమస్యలు, ఆహారం తినాలనిపించకపోవడం వంటి సమస్యలు ఎదురు అవుతాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు ఈ కాంబినేషన్ తినడం చాలా ప్రమాదకరం అంటున్నారు ఆయుర్వేద నిపుణులు.

ఇవే కాకుండా చర్మ సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉన్నదంట. చర్మంపై దుద్దర్లు, దురద, అలెర్జీ వంటి సమస్యలు తలెత్తుతాయి. అంతేకాకుండా కొంత మందిలో ఇది అధిక బరువు, వాతానికి కూడా కారణం అవుతుంది. అందువలన వీలైనంత వరకు చికెన్‌లో పెరుగు వేయకపోవడమే మంచిదంట. ఒక వేళ మీరు చికెన్‌లో పెరుగు వేసి వండాలి? ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకూడదు అంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలంట. ముఖ్యంగా చికెన్‌లో పెరుగు వేయాలి అనుకుంటే అది ఎక్కువ పుల్లగా లేకుండా చూసుకోవాలి. అలాగే మ్యారినేషన్ చాలా తక్కువ సేపు చేయాలంట.

# దమ్మింటే ఖమ్మం జిల్లాలో పోటీ చెయ్

## కేటీఆర్‌కు పొంగులేటి సవాల్

**ఖమ్మం :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఛాలెంజ్ విసిరారు. దమ్ముంటే ఖమ్మం జిల్లాలో పోటీ చేయాలని సవాల్ చేశారు. జిల్లా పర్యటనకు వచ్చి గొప్పలు చెప్పడం మానుకోవాలని చెప్పారు. కేటీఆర్ నిన్న ఖమ్మం జిల్లాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ పర్యటనపై పొంగులేటి స్పందిస్తూ కేటీఆర్ పై విమర్శలు గుప్పించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గెలవడం మీ నాన్న తరం కాలేదు... నీ వల్ల ఏమవుతుందని అని అన్నారు. ముందు మీ ఇంట్లో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్రయత్నించారని పొంగులేటి మండిపడ్డారు. ప్రభుత్వం జోలికి వస్తే కాంగ్రెస్ పార్టీ పవర్ ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. కేటీఆర్ మతి భ్రమించి రాహుల్ గాంధీ, గాంధీ కుటుంబంపై మాట్లాడుతున్నారని, సూర్యుడి పైకి ఉమ్మితే అది తిరిగి తన ముఖం మీదే పడుతుందని గమనించాలని అన్నారు. అవినీతి, దోపిడీలకు పేటెంట్‌గా ఉన్న కల్వకుంట్ల ఫ్యామిలీ గాంధీ కుటుంబం గురించి మాట్లాడటం సరికాదని మండిపడ్డారు.జాతీయ నాయకుడిని విమర్శిస్తే తాను కూడా జాతీయ నాయకుడినవుతానని తాపత్రయపడటంలో తప్పు లేదు కానీ ఆశకు హద్దు ఉండాలని అన్నారు. ఎన్నికల్లో వరుసగా దెబ్బలు తిన్నా బుద్ధి తెచ్చుకోకుండా అవాకులు చెవాకు



లు పేలుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీరు రెఫరెండం అని చెప్పిన ఎన్నికల్లోనే ప్రజలు గూబ గుయ్యమనిపించారు. జూబ్లీహిల్స్, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తీర్పు ఇచ్చారు. ఇప్పుడు రాబోయే మున్సిపల్ ఎన్నికలను సెమీ ఫైనల్స్ అంటున్నారు... దేనికి సెమీ ఫైనల్?" అంటూ ప్రశ్నించారు.

**22 వేల కోట్లతో ఇందిరమ్మ ఇళ్లు**

సంక్రాంతి వేళ రాష్ట్ర ప్రజలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. రాష్ట్రంలో ఏప్రిల్ నెల నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు ప్రక్రియను ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తుంది. ఈ పథకం కింద ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇళ్లను నిర్మించినట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి వ్యక్తికి సొంతింటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.రాష్ట్రంలో ప్రతి సవంత్సరం 2 విడతలుగా ఇళ్ల మంజూరు కొనసాగుతుందన్నారు. అలాగే ఇళ్లు మొదటు పెట్టిన ప్రతి ఒక్కరికి బిల్లులు చెల్లిస్తున్నామని అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలతో పాటు ఇతర ఎమ్మెల్యేలు సైతం రాష్ట్రంలో మరిన్ని ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని తన దృష్టికి తీసుకొచ్చినట్టు ఆయన తెలిపారు. దాంతో పాటు ఇంతకు ముందు గృహ జ్యోతి కింద మంజూరు చేసిన ఇండ్ల నిర్మాణాన్ని కూడా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరినట్టు తెలిపారు. వాటిపై కూడా ప్రభుత్వం కసరత్తు చేస్తోందని ఆయన చెప్పుకొచ్చారు.ఇదిలా ఉండగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కూడా ఆయన మండిపడ్డారు. కాళేశ్వరం కడితే కమిషన్ వస్తుందని ఆలోచించిన గత ప్రభుత్వం.. పేదవాడి సొంతింటి కలను మాత్రం పట్టించుకోలేని విమర్శించారు. గృహ నిర్మాణ శాఖను సైతం నాశనం చేసిందని ఫైర్ అయ్యారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించిందన్నారు.

# 32 కమిటీలతో కవిత పార్టీ

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన సంస్థను స్వతంత్ర రాజకీయ శక్తిగా మార్చే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి ఎజెండా కమిటీ సభ్యులతో నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం ఒక సాంస్కృతిక సంస్థగా కాకుండా, తెలంగాణ సమగ్ర అభివృద్ధికి రోడ్‌మ్యాప్ రూపొందించే రాజకీయ పార్టీగా జాగృతి రూపాంతరం చెందబోతోందని ఆమె స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత పాలించిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల వైఫల్యాలను అధ్యయనం చేయడానికి కవిత ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే ప్రాథమిక నినాదంతో పాటు మొత్తం 32 కీలక అంశాలపై ఈ కమిటీలు క్షేత్రస్థాయిలో పర్యటించనున్నాయి. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ అభివృద్ధి బ్లూప్రింట్‌ను సిద్ధం చేయడమే ఈ కమిటీల ప్రధాన బాధ్యత. కేవలం ప్రాంతీయ పార్టీగానే కాకుండా, దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీల రాజ్యాంగాలను అధ్యయనం చేసి, జాగృతి కోసం ఒక




సరికొత్త , అత్యంత ప్రజాస్వామ్యబద్ధమైన రాజ్యాంగాన్ని రూపొందించాలని కవిత నిర్ణయించారు. పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం, పారదర్శకత ఉండేలా నిపుణుల కమిటీ ఈ ముసాయిదాను సిద్ధం చేస్తోంది. ఇది రాజకీయాల్లో కొత్త ఒరవడికి నాంది పలుకుతుందని ఆమె భావిస్తున్నారు. కమిటీలు ఈనెల 17వ తేదీలోకా తమ నివేదికలను వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్ సింగ్ నేతృత్వంలోని స్టీరింగ్ కమిటీకి సమర్పించాల్సి ఉంటుంది. ఆ నివేదికల ఆధారంగా రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించి, పార్టీ అధికారిక ప్రకటన , భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. క్షేత్రస్థాయి వాస్తవాల ఆధారంగానే తమ రాజకీయ ప్రయాణం ఉంటుందని కవిత స్పష్టం చేశారు. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో, ప్రజల గొంతుకగా నిలిచే మరో శక్తి అవసరమని జాగృతి భావిస్తోంది. గత ప్రభుత్వాల లోపాలను ఎత్తిచూపుతూనే, ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను ప్రజల ముందు ఉంచడం ద్వారా బలమైన రాజకీయ పక్షంగా ఎదగాలని కవిత వ్యూహరచన చేస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ 'జాగృతి' రాజకీయ ప్రస్థానం రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి ప్రకంపనలు సృష్టిస్తుందో వేచి చూడాలి.

# దివ్యాంగులను అన్ని విధాలుగా ప్రభుత్వ సహకారం

**బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలి.**

**ఓ౦ం మేఘారెడ్డి**

**వనపర్తి :** దివ్యాంగులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అందుకు గాను రేవంత్ సర్కార్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.బుధవారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాత మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఆర్టిఫీషియల్ లింబ్స్ మాన్యుఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, గ్రిడ్ కంట్రోల్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో జిల్లాలోని 730 మంది దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.గత సంవత్సరం దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగుల సంక్షేమ భవనానికి 1000 గజాల స్థలం కేటాయించడం జరిగిందని, అట్టి స్థలంలో భవన నిర్మాణానికి త్వరలోనే నిధులు మంజూరు చేయనున్నట్లు తెలియజేశారు.దివ్యాంగులు ఎందులోనూ తక్కువ కాదని, సమాజంలోని అన్ని రంగాల్లో సకలాంగులతో సమానంగా పోటీ పడుతున్నారని కొనియాడారు.రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందుల వల్ల కొంత ఆలస్యం అయినప్పటికి దివ్యాంగులకు ఇస్తామని ఏదైతే మేనిఫెస్టోలో పొందుపరిచామో వాటిని ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఆర్టిఫీషియల్ లింబ్స్ మాన్యుఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, గ్రిడ్ కంట్రోల్ ఆఫ్ ఇండియా తరపున జిల్లాలోని దివ్యాంగులకు 70.73 లక్షల విలువ గల ఉపకరణాలు 728 మంది దివ్యాంగులకు ఇస్తున్నందుకు యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలిపారు.కేంద్ర ప్రభుత్వ



కార్పొరేషన్లు సి.ఎస్.ఆర్., ఎ.డి.బి నిధులు వనపర్తి జిల్లాకు అత్యధికంగా కేటాయించి జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.అనంతరం దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 20 మందికి ఒక్కొక్కరికి రూ. 30 వేల చొప్పున చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలింకో డిప్యూటీ జనరల్ మేనేజర్ సంజయ్ సింగ్, గ్రిడ్ కార్యనిర్వహక సంచాలకులు యం.కె. రమేష్, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఆర్డీఓ సుబ్రమణ్యం, డి. డబ్ల్యు. ఒ సుధారాణి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అఫ్జలుఫిన్, తహసిల్దార్ రమేష్ రెడ్డి, దివ్యాంగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మీసాల మోహన్, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ లో బీజేపీ ఛీఫ్ రామచంద్రరావు పర్యటన

**వరంగల్ :** వరంగల్ జిల్లా పర్యటన సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు కు ఘన స్వాగతం లభించింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లాలో పర్యటించడం తనకు ఎంతో గర్వకారణమని రాంచందర్ రావు తెలిపారు. వరంగల్కు భారతీయ జనతా పార్టీకి ఒక ప్రత్యేకమైన భావోద్వేగ అనుబంధం ఉందని ఆయన గుర్తుచేశారు. 1984లో భారతీయ జనతా పార్టీకి లోక్సభలో కేవలం ఇద్దరు ఎంపీలు మాత్రమే ఉన్న కష్టకాలంలో, ఆ రెండు సీట్లలో ఒకటి వరంగల్ జిల్లాకు చెందిన జంగారెడ్డి విజయంగా నిలిచిందని ఎన్. రాంచందర్ రావు గుర్తు చేశారు. అటువంటి కీలక సమయంలో కూడా పార్టీకి అండగా నిలిచిన చారిత్రక నేల వరంగల్ అని అన్నారు. అలాంటి వరంగల్ భూమిపై అడుగుపెట్టడం తనకు ఎంతో



గర్వంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కాషాయ జెండాలతో, జై బిజెపి నినాదాలతో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో రాంచందర్ రావు పాల్గొన్నారు. ఈ ర్యాలీలో పార్టీ శ్రేణులు చూపించిన ఉత్సాహం, అచంచలమైన నిబద్ధత తనకు మరింత ప్రేరణనిచ్చిందని తెలిపారు. వరంగల్ బిజెపి కుటుంబ సభ్యులందరికీ ఈ సందర్భంగా ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తరువాత అయన భద్రకాళి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. భద్రకాళి అమ్మవారిని దర్శించుకోవడం గొప్ప ఆధ్యాత్మిక శక్తిని అందించిందని, పార్టీ ప్రయాణానికి ఇది ఒక ఆశీర్వాదంలా భావిస్తున్నానని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణలో భారతీయ జనతా పార్టీ ప్రయాణం మరింత వేగంగా, బలంగా సాగాలని ఆకాంక్షించారు. మాతృభూమికి మరింత గొప్పగా సేవ చేయడానికి బిజెపి కార్యకర్తలందరికీ శక్తి, ధైర్యం, జ్ఞానం ప్రసాదించాలని భద్రకాళి అమ్మవారిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు.

## రైతు ఉత్పత్తి దారుల ద్వారా సహకార సంఘాల ప్రగతి

**జిల్లా సహకార అధికారి సి.మనోజ్ కుమార్**

**జగిత్యాల :** రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అభివృద్ధి మరింత సులభతరం అవుతుందని జిల్లా సహకార అధికారి సి.మనోజ్ కుమార్ అభిప్రాయపడ్డారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయ సముదాయ సమావేశ మందిరంలో ఎఫ్పీఓ (రైతు ఉత్పత్తి సంస్థ)లుగా ఎంపికైన జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కు సామర్థ్య పెంపుదల( కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్) ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగం ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న జగిత్యాల జిల్లాలో ఎఫ్పీఓ ల ద్వారా సహకార సంఘాలు రైతులకు చేరువ కావాలని సూచించారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక అభివృద్ధి మార్పులకు శ్రీకారం చుట్టాలని ఎఫ్పీఓ లను కోరారు. మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో నూతన విధానాలను అనుసరించాలని సూచించారు. జిల్లాలోని అన్ని వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు కావలిసిన ఎరువులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అదేవిధంగా రైతులకు అవసరమైన విత్తనాలు కూడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎఫ్పీఓ సభ్యత్వ నమోదు లో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన రాయికల్ సొసైటీ పర్సన్ ఇన్ ఛార్జ్ సాయి కుమార్ గౌడ్, కార్యదర్శి రవి ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ కాకతీయ సహకార శిక్షణ సంస్థ డైరెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎఫ్పీఓ ల ద్వారా జిల్లాలో రైతులకు జాతీయ స్థాయిలో మార్కెట్లు అందుబాటులో వస్తాయన్నారు. ఎఫ్పీఓ ల ఏర్పాటు లో జగిత్యాల జిల్లా రాష్ట్రం లో రెండో స్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బుసరి శ్రీనివాస్,బీర్పూర్,రాయికల్ పాక్స్ మాజీ అధ్యక్షులు రాంచందర్ రావు, మల్లా రెడ్డి, ఇతర సంఘ సభ్యులు, సహకార శాఖ సిబ్బంది, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## వెయ్యికి పైగా చోరికి గురైన సెల్ ఫోన్లు..!

**రికవరీ చేసిన మల్కాజ్ గిరి కమిషనరేట్ పోలీసులు..**

**మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో పోగొట్టుకున్న/దొంగిలించబడిన 1039 మొబైల్ ఫోన్ల రికవరీ**

మల్కాజిగిరి పోలీసులచే రూ. 2 కోట్ల 8 లక్షల విలువైన ఫోన్లు స్వాధీనంఈ రోజుల్లో మొబైల్ పరికరాల వాడకం పెరగడం వల్ల మొబైల్ ఫోన్ల దొంగతనాలు/పోగొట్టుకోవడం పెరుగుతున్నాయి. తర్వాత ఈ ఫోన్‌లను వివిధ వ్యక్తులు రకరకాల మార్గాల ద్వారా పొంది ఉపయోగిస్తున్నారు. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రీ (అఇఎఖీ) అనేది ఇటువంటి మొబైల్ ఫోన్‌లను గుర్తించడానికి ఒక సౌకర్యం.మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ శ్రీ అవినాష్ మొహంతి, ఐపిఎస్ ఆదేశాల మేరకు, సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రీ (అఇఎఖీ) పోర్టల్ సహాయంతో పోగొట్టుకున్న/దొంగిలించబడిన మొబైల్ ఫోన్‌లను రికవరీ చేయడానికి సిసిఎస్ ఎల్బీ నగర్ మరియు మల్కాజిగిరిలో ఐటి సెల్ సహాయంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక బృందాలు ఆరు నెలల వ్యవధిలో రూ. 2 కోట్ల 8 లక్షల విలువైన సుమారు 1039 మొబైల్ ఫోన్‌లను రికవరీ చేశాయి.

## రోడ్డు భద్రత నియమాలు పాటించడం మనందరి భాద్యత

**జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం ? 2026**

**బైక్ ర్యాలీ విజయవంతం**

**జగిత్యాల :** రోడ్డు భద్రత నియమాలు పాటించడం మనందరి భాద్యత అని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు.జిల్లాలో రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం 2026 బైక్ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు.గురువారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం ? 2026 బైక్ ర్యాలీని జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యమని తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాల్సిన అవసరం ఉందన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదని హెచ్చరించారు. అధిక వేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని తెలిపారు. లైసెన్స్ లేకుండా వాహనం నడపకూడదన్నారు.వాహన పత్రాలు సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. రోడ్ సేఫ్టీ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ నుండి కొత్త బస్టాండ్ వరకు కొనసాగింది.హెల్మెట్ ధరించండి ? ప్రాణాలు కాపాడుకోండి అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు.జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ)బి.ఎస్. లత, జిల్లా అధికారులు, రవాణా శాఖ, పోలీస్, కలెక్టరేట్ సిబ్బంది, వివిధ స్థాయిల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ

**మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ విచారించిన సిట్**

**హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ విచారణ ముగిసింది. అడిషనల్ ఎస్పీ తిరుపతన్న , మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ను కలిపి సిట్ బృందం విచారణ చేసింది. బీఆర్ఎస్ హయం లో ఎస్ఐబీ కి రెండు ప్రయివేటు నంబర్లు ను జైపాల్ యాదవ్ ఇచ్చారు. జైపాల్ యాదవ్ మొబైల్ ను సిట్ బృందం సీజ్ చేసింది. అప్పట్లో ఎస్ఐబి లో ఉన్న తిరుపతన్న అడగడం తో ఇద్దరు ప్రయివేటు వ్యక్తుల నంబర్లు ను జైపాల్ యాదవ్ ఇచ్చారు. జైపాల్ యాదవ్ ను రెండు గంటలు పాటు విచారణ చేసి వాంగ్మూలం నమోదు చేసారు సిట్ అధికారులు. అడిషనల్ ఎస్పీ తిరుపతన్న తో మాట్లాడిన కాల్స్ క్లారిటీ సిట్ తీసుకుంది. తిరుపతన్న సమీప బంధువు కావడం, అలాగే ఒక భార్యాభర్తల మధ్య ఉన్న విభేదాలు గురించి చాల సార్లు తిరుపతన్న తో మాట్లాడినట్లు స్టేట్మెంట్ రికార్డ్ చేసారు.

## కాకగూడలో భూగర్భ డ్రైనేజీ పనుల ప్రారంభోత్సవం

**పాల్గోన్న కంటోన్మెంట్ బోర్డు సభ్యురాలు బానుక నర్మద**

**సికింద్రాబాద్ :** గురువారం నాడు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నిధులు రూ. 5 లక్షల వ్యయంతో 5వ వార్డు, బ్రుక్ బాండ్ కాలనీ, కాకగూడలో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లిఖార్జున్ మాట్లాడుతూ, తాను ప్రతినిత్యం స్థానిక బిజెపి నాయకులు కార్యకర్తలు కలుపుకుని ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తూ పరిష్కార దిశగా ముందుకు సాగుతున్నానని తెలిపారు. అలాగే స్థానిక పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ సహకారంతో అవసరమైన చోట్ల ఎంపీ నిధులు కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. భవిష్యత్తులో కంటోన్మెంట్ పరిధిలోని ప్రతి వార్డులో మౌలిక సదుపాయాలు మరియు అభివృద్ధి పనులను దశలవారీగా అమలు చేస్తామని ఆమె భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ సీపీఎస్. ప్రకాష్, వైస్ ప్రెసిడెంట్ పి. ప్రభాకర్ రావు, సెక్రటరీ కె. శశిధర్, ట్రెజరర్ ఎం. రమేష్, సభ్యులు మహేష్ కుమార్, యమునా చారి, వి.ఎస్. సంతోష్, చింతన్ సోలంకి, ఐ. కిషన్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ నూతన సంవత్సర శుభాకాంక్షలు ఎమ్మెల్యేను కలిసిన నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు

**శుభాకాంక్షలతో పాటు పలువురి నుంచి వినతులను స్వీకరించిన ఎమ్మెల్యే**

**సికింద్రాబాద్ :** కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ను గురువారం నియోజకవర్గం లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు తుకారం గేట్ లోని వారి నివాసంలో మరియు పికెట్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. తనను కలిసిన వారందరికీ ఎమ్మెల్యే నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి ఈ నూతన సంవత్సరంలో అందరూ ఆనందమయ జీవితం గడపాలని ఆకాంక్షించారు. జేబీఎస్– శామీర్ పేట్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో లోతుకుంట ప్రాంతంలో హనుమాన్ దేవాలయం తొలగించాల్సి రావడంతో అక్కడి స్థానికులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే శ్రీ గణేష్ గారిని కలిసి దేవాలయ పరిరక్షణకు సహకరించాలని కోరారు.

## బిజినెస్

### వెండి నగలకూ హాల్‌మార్క్?




ప్రస్తుతం బంగారు ఆభరణాలకే ఉంటున్న హాల్‌మార్క్.. ఇకపై వెండి నగలకూ రాబోతున్నదా? అంటే అవుననే సంకేతాలనే ఇస్తున్నాయి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) వర్గాలు. తప్పనిసరి హాల్‌మార్కింగ్ విధానం కిందికి వెండి ఆభరణాలు, కళాఖండాలను తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నది మరి. గత ఏడాది మొదలు దేశ, విదేశీ మార్కెట్లలో వెండి ధరలు దూసుకుపోతున్న విషయం తెలిసిందే. కిలో ఆల్‌టైమ్ హైకి చేరి రూ.2,56,000 పలికింది. ఈ నేపథ్యంలోనే మోసాలకు చెక్ పెట్టేలా వినియోగదారుల రక్షణార్థం వెండి నగలకూ హాల్‌మార్కింగ్ విధానాన్ని అవలంబించాలని చూస్తున్నట్టు బీఐఎస్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. నిజానికి సిల్వర్ హాల్‌మార్కింగ్ స్వచ్ఛంద ప్రాతిపదికన ఇప్పటికే దేశీయంగా అమల్లో ఉన్నది. అయితే పరిశ్రమ మాత్రం సిల్వర్ హాల్‌మార్కింగ్‌ను తప్పనిసరి చేయాలని డిమాండ్ చేస్తూ వస్తున్నది. కాగా, రెగ్యులేటరీ, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించామని బీఐఎస్ డైరెక్టర్ జనరల్ సంజయ్ గార్గ్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వెండికి అత్యంత ఆదరణ ఉన్న దేశాల్లో భారత్ కూడా ఒకటి.

### ఎనిమిదేళ్ల తర్వాత ఎయిరిండియా చేతికి డ్రీమ్‌లైనర్




టాటా గ్రూప్‌నకు చెందిన విమానయాన సంస్థ ఎయిరిండియా కొనుగోళ్లు జరిపిన విమానాలు ఒక్కొక్కొటిగా అందుబాటులోకి వస్తున్నాయి. తాజాగా బోయింగ్‌కు చెందిన 787-9 విమానం సంస్థ చెంతకు చేరింది. దాదాపు 8 ఏళ్ల తర్వాత డ్రీమ్‌లైనర్ విమానం ఎయిరిండియా ఫ్లీట్‌లో చేరడం గమనార్హం. ప్రైవేటీకరణ తర్వాత ఇదే తొలి డ్రీమ్‌లైనర్ కావడం విశేషం. జనవరి 7న సియాటెల్‌లోని తన ప్లాంట్ నుంచి బోయింగ్ ఈ విమానాన్ని డెలివరీ చేయగా... ఎయిరిండియా అందుకుంది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ తనిఖీల అనంతరం ప్రయాణానికి అందుబాటులోకి రానుంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్నప్పుడు 2017 అక్టోబర్‌లో చివరి డ్రీమ్‌లైనర్ ఎయిరిండియాలో చేరింది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత మరో డ్రీమ్‌లైనర్ కంపెనీకి చేరింది. సంస్థ అవసరాలకు అనుగుణంగా ఈ డ్రీమ్‌లైనర్‌ను బోయింగ్ రూపొందించింది. దీంట్లో ఎకానమీ, ప్రీమియం ఎకానమీ, బిజినెస్ క్లాస్ తరగతులు ఉండనున్నాయి. ఎయిరిండియాను కొనుగోలు చేసిన తర్వాత 2023లో 350 ఎయిర్‌బస్, 220 బోయింగ్ విమానాలకు టాటా గ్రూప్ ఆర్డర్ పెట్టిన సంగతి తెలిసిందే. అందులో 51 నారో బాడీ విమానాలు డెలివరీ కాగా.. తొలి వైడ్ బాడీ విమానం డెలివరీ అయ్యింది. ప్రస్తుతం ఎయిరిండియా వద్ద 300 విమానాలున్నాయి. 185 ఎయిరిండియా నడుపుతుండగా.. మిగిలినవి ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ నిర్వహిస్తోంది. మరికొన్ని డ్రీమ్‌లైనర్లు ఈ ఏడాదిలోనే అందుబాటులోకి రానున్నట్లు ఎయిరిండియా వర్గాలు చెబుతున్నాయి.

# బీమా కంపెనీల కక్కుర్తి!




బీమా కంపెనీలు వ్యాపార కక్కుర్తితో ప్రజలను తప్పుదోవ పట్టించి భారీగా మోసపూరిత పాలసీలను అంటగడుతున్నాయి. వ్యక్తుల అవసరాలకు సరిపడని, నియమ, నిబంధనలు, షరతులు గురించి పూర్తిగా వివరించకుండా కేవలం ప్రయోజనాల గురించే చెబుతూ తప్పుడు పాలసీలను (మిస్ సెల్లింగ్) విక్రయిస్తోన్నాయి. ఇవి ఏడాదికేడాదికి పెరగడం గమనార్హం. ఇన్సూరెన్స్ రెగ్యూలేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డిఎఐ) 2024-25 రిపోర్ట్ ప్రకారం.. 2023-24లో జీవిత బీమా కంపెనీలకు వ్యతిరేకంగా 1,20,726 ఫిర్యాదులు నమోదయ్యాయి. 2024-25లోనూ ఇదే స్థాయిలో 1,20,429 ఫిర్యాదులు వచ్చాయి. కాగా.. బీమా కంపెనీల అనైతిక వ్యాపార విధానాలపై ఫిర్యాదులు 26,667కు పెరిగాయి. 2023-24లో 23,335 అనైతిక ఫిర్యాదులు నమోదయ్యాయి. గతేడాది మొత్తం ఫిర్యాదుల్లో అనైతిక వ్యాపార పద్ధతులకు సంబంధించినవి 19.33 శాతం నుంచి 22.14 శాతానికి పెరిగాయని ఐఆర్‌డిఎఐ వెల్లడించింది. పలు బ్యాంక్‌లు, బీమా ఏజెంట్ల ద్వారా మిస్ సెల్లింగ్ పాలసీ విక్రయాలు జరుగుతున్నాయి. "అనైతిక బీమా పాలసీ విక్రయాలను నిరోధించేందుకు గాను తగిన విధానాలను అమలు చేయాలని బీమా సంస్థలకు సూచించాం. పాలసీదారునకు అనుకూలమైనా ప్లాన్‌ను అంచనా వేయడం, పంపిణీ ఛానల్ వ్యాప్తంగా కొన్ని నియంత్రణలు అమలు చేయడం, మిస్ సెల్లింగ్‌పై ఫిర్యాదుల పరిష్కారానికి ప్రణాళిక రూపొందించాలని.. తప్పుడు పాలసీల విక్రయానికి మూల కారణాలను గుర్తించేందుకు అధ్యయనం చేయాలని సూచించాము." అని ఐఆర్‌డిఎఐ తన నివేదికలో పేర్కొంది. 2024-25 సంవత్సరానికి జిడిపిలో బీమా రంగం వాటా 3.7 శాతంగా ఉందని ఐఆర్‌డిఎఐ తెలిపింది. ఇది ప్రపంచ సగటు 7.3 శాతం కంటే చాలా తక్కువ. 2024-25లో ఐఆర్‌డిఎఐ గ్రివెన్స్ కాల్ సెంటర్, బీమా బరోసాకు మొత్తంగా 2.57 లక్షల కాల్స్ వచ్చాయని తెలిపింది. ఇందులో 1.20 లక్షలు జీవిత బీమా, 1.37 లక్షల కాల్స్ వైద్య, సాధారణ బీమా అనుమానాలు, ఫిర్యాదులకు సంబంధించినవి ఉన్నాయి.

# రహస్య సమాచారం లీక్.. 'బ్యాంక్ ఆఫ్ అమెరికా'కు సెబీ నోటీసులు..!

భారత స్టాక్ మార్కెట్లకు చెందిన ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిబంధనలను బ్యాంక్ ఆఫ్ అమెరికా ఉల్లంఘించిందని మార్కెట్ రెగ్యులేటర్ సెబీ ఆరోపించింది. ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ స్టాక్ విక్రయాలకు సంబంధించిన డీల్ వేళ రహస్య సమాచారాన్ని లీక్ చేసిందని పేర్కొంది. అంతేగాక, ఈ వ్యవహారంపై దర్యాప్తును పక్కదోవ పట్టించే ప్రయత్నం చేసిందంటూ బ్యాంక్ ఆఫ్ అమెరికా కు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. గత నవంబరులోనే ఈ నోటీసులను జారీ చేయగా.. తాజాగా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ రాయిటర్స్ కథనం వెల్లడించింది. 2024 మార్చిలో ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ అసెట్ మేనేజ్‌మెంట్ స్టాక్ విక్రయాలకు సంబంధించిన లావాదేవీలను భారత్‌లోని బ్యాంక్ ఆఫ్ అమెరికా నిర్వహించింది. ఈ విక్రయాల విలువ దాదాపు 177 మిలియన్ డాలర్లు. ఆ సమయంలో స్టాక్ ధర, ఇతర రహస్య వివరాలను బ్యాంకు డీల్ టీమ్.. ఉద్యోగులు, ఇన్వెస్టర్లతో పంచుకుందని ఓ ప్రజావేగు ఆరోపించారు. దీంతో బ్యాంక్ ఆఫ్ అమెరికా అంతర్గత దర్యాప్తు జరిపి.. ఎలాంటి ఉల్లంఘనలు జరగలేదని పేర్కొంది. ఈ క్రమంలోనే ఈ వ్యవహారంపై సెబీ దర్యాప్తు చేపట్టగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ డీల్ విషయంలో అంతర్గత నైతిక కట్టుబాట్లను విస్మరించి బ్యాంక్ ఆఫ్ అమెరికా డీల్ టీమ్ రహస్య సమాచారాన్ని బయటపెట్టిందని సెబీ పేర్కొంది. వాస్తవాలను దాచి.. తప్పుడు స్టేట్‌మెంట్లతో దర్యాప్తును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిందని ఆరోపించింది. అయితే, దీనిపై బ్యాంక్ ఆఫ్ అమెరికా గానీ.. సెబీ గానీ ఇంతవరకూ స్పందించలేదు. మరోవైపు, ఈ వ్యవహారంపై సెటిల్‌మెంట్‌కు సెబీ వద్ద బ్యాంక్ ఆఫ్ అమెరికా అప్లికేషన్ దాఖలు చేసినట్లు సమాచారం.



# శ్రీలంక మాస్టర్ మైండ్.. వరల్డ్‌కప్ విన్నింగ్ కోచ్‌తో ఒప్పందం




టీ20 ప్రపంచ కప్ 2026కు ముందు శ్రీలంక క్రికెట్ బోర్డు (ాూజ) కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మెగా టోర్నీ కోసం తమ జట్టు బ్యాటింగ్ కోచ్‌గా భారత మాజీ క్రికెటర్ విక్రమ్ రాథోర్‌ను ఎస్‌ఎల్‌సీ నియమించింది. టీ20 వరల్డ్‌కప్ టోర్నీకి శ్రీలంక జట్టును సన్నద్ధం చేసేందుకు విక్రమ్ రాథోర్‌ను కన్సల్టెన్సీ ప్రాతిపదికన బ్యాటింగ్ కోచ్‌గా నియమించాము అని లంక క్రికెట్ బోర్డు ఒక ప్రకటనలో పేర్కొంది. రాథోర్ జనవరి 18న లంకతో జట్టుతో కలవనున్నాడు. ప్రపంచ కప్ ముగిసే వరకు జట్టుతోనే ఉండనున్నాడు. విక్రమ్‌కు కోచ్‌గా అపారమైన అనుభవం ఉంది. . 2019 సెప్టెంబర్ నుంచి 2024 జూలై వరకు భారత బ్యాటింగ్ కోచ్‌గా చేశారు. భారత్ 2024 టీ20 ప్రపంచ కప్ గెలవడంలోఅతడు కీలక పాత్ర పోషించాడు. బీసీసీఐ లెవల్ 3 కోచ్‌గా కొనసాగాడు. అతడు ప్రస్తుతం ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టుకు లీడ్ అసిస్టెంట్ కోచ్‌గా కూడా పనిచేస్తున్నాడు. కాగా శ్రీలంక ఇప్పటికే భారత మాజీ ఫస్ట్ క్లాస్ క్రికెటర్ రామకృష్ణన్ శ్రీధర్‌ను తమ ఫీల్డింగ్ కోచ్‌గా నియమించింది. రాథోర్ భారత బ్యాటింగ్ కోచ్‌గా ఉన్న సమయంలోనే ఫీల్డింగ్ కోచ్‌గా శ్రీధర్ పనిచేశాడు. శ్రీలంక క్రికెట్ బోర్డు ప్రపంచ కప్ లక్ష్యంగా భారత కోచింగ్ అనుభవాన్ని ఉపయోంచుకుంటుంది. అదేవిధంగా లెజెండరీ బౌలర్ లసిత్ మలింగ కూడా ఫాస్ట్ బౌలింగ్ కన్సల్టెంట్‌గా సేవలందించనున్నాడు. కాగా ఈ పొట్టి ప్రపంచకప్‌కు శ్రీలంక, భారత్ సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. శ్రీలంక తమ లీగ్ మ్యాచ్‌లన్నింటని స్వదేశంలోనే ఆడనుంది. ఫిబ్రవరి 7 నుంచి ఈ మెగా టోర్నీ ప్రారంభం కానుంది.

### మొన్నటివరకూ కోమాలో.. మృత్యుంజయుడిగా తిరిగొచ్చిన ఆస్ట్రేలియా దిగ్గజం..!



ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డామిన్ మార్టిన్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. ప్రాణాంతకమైన 'మెనింజిటిస్'తో బాధ పడుతున్న మార్టిన్ కోమా నుంచి బయటపడడమే కాదు.. దవాఖాన నుంచి ఇంటికొచ్చేశాడు. చావు అంచుల దాకా వెళ్లొచ్చిన ఈ మాజీ ఆటగాడి ఆరోగ్యం మెరుగుపడడంతో గురువారం వైద్యులు ఆస్పత్రి నుంచి పంపించేశారు. దాంతో.. మృత్యుంజయుడిలా తిరగొచ్చిన అతడిని చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. అసలేం జరిగిందంటే.. 54 ఏళ్లున్న డామిన్ మార్టిన్ ప్రాణాంతకమైన మెనింజిటిస్ వ్యాధితో పోరాడుతున్నాడు. తీవ్ర అనారోగ్యానికి గురైన మార్టిన్‌ను డిసెంబర్ 26న గోల్డ్ కోస్ట్‌లోని ఆస్పత్రిలో చేర్పించారు. మెదడు చుట్టున్న పొరలు వాపు, ఇన్‌ఫెక్షన్ కారణంగా అతడు బతికిబట్టకట్టడం కల్లే అనుకున్నారంతా. కానీ, అద్భుతం జరిగింది. అనూహ్యంగా అతడు ఇండ్యూస్డ్ కోమా నుంచి బయటపడ్డాడు. ఐసీయూలో చికిత్స అందించిన డాక్టర్లు.. మరో వార్డుకు మార్చారు. గురువారం డిశ్చార్జి చేసి ఇంటికి పంపించారు. మార్టిన్ ఆరోగ్యంపై అతడి స్నేహితుడు, మాజీ ఓపెనర్ ఆడం గిల్‌క్రిస్ట్ 'కోడ్ స్పోర్ట్స్'తో మాట్లాడాడు. 'మార్టిన్ విషయంలో అద్భుతం జరిగిందని చెప్పాలి. వైద్యానికి అసాధారణంగా స్పందించిన మార్టిన్ కోమా నుంచి బయటకొచ్చాడు. స్పృహలోకి వచ్చిన అతడు మాట్లాడడమే కాదు అందర్నీ గుర్తు పట్టాడు. దాంతో.. వైద్యులు అతడిని ఐసీయూ నుంచి మరో వార్డుకు మార్చారు. అతడు మరింత వేగంగా కోలుకోవడంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. ఈ కష్ట కాలంలో అభిమానులు చూపిన ప్రేమ, అందించిన దీవెనలు, ఆర్థిక సాయానికి అతడి భార్య అమంద కృతజ్ఞతలు చెబుతోంది' అని గిల్‌క్రిస్ట్ తెలిపాడు. ఆసీస్ వెటరన్ ఆటగాడైన మార్టిన్ 1992లో వెస్టిండీస్‌పై టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. అనతికాలంలోనే తన విధ్వంసక ఆటతో జట్టులో కీలక ప్లేయర్‌గా ఎదిగిన అతడు.. 1999, 2003లో ప్రపంచకప్ గెలుపొందిన జట్టులో సభ్యుడు. 67 టెస్టులు, 208 వన్డేలు ఆడాడు. భారత్ పర్యటనలో 2-1తో ఆసీస్ సిరీస్ గెలుపొందడంలో అతడి పాత్రే కీలకం.

## స్పోర్ట్స్

### యాషెస్ సిరీస్‌లో ఆసీస్ ఘన విజయం



యాషెస్ సిరీస్‌ను ఆస్ట్రేలియా ఘనంగా ముగించింది. స్వదేశంలో జరిగిన 2025-2026 ఐదు టెస్టుల యాషెస్ సిరీస్‌ను ఆస్ట్రేలియా 4-1 తేడాతో కైవసం చేసుకుంది. సిడ్నీ వేదికగా జరిగిన చివరి మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్ ద్వారా ఇంటర్నేషనల్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన ఉస్మాన్ ఖవాజాకు(ఖంఝిఅ ఖష్ట్రుఝిఝుయిఝు)సిరీస్ విజయంతో ఘనమైన వీడ్కోలు పలికింది. కాగా, రోండో ఇన్నింగ్స్‌లో 302/8తో ఐదో రోజు అటను కొనసాగించిన ఇంగ్లాండ్ 342 రన్స్‌కు ఆలౌటైంది. దీంతో ఇంగ్లాండ్ నిర్దేశించిన 160 పరుగుల లక్ష్యన్ని ఆసీస్ కేవలం 5 వికెట్లు మాత్రమే కోల్పోయి విజయాన్ని అందుకుంది. ఛేదనలో ఆస్ట్రేలియా ఓపెనర్లు ట్రావిస్ హెడ్(29), జాక్ వెదర్‌లాండ్(34) శుభారంభాన్నిచ్చారు. తదతనంతరం వచ్చిన బ్యాటర్లు లబుషేన్(37) మినహా ఎవరు రాణించలేదు. కెప్టెన్ స్టీవ్ స్మిత్(12), కెరీర్‌లోనే చివరి మ్యాచ్ ఆడుతున్న ఉస్మాన్ ఖవాజా(6) నిరాశపరిచారు. అలెక్స్ కేరీ(16), కామెరూన్ గ్రీన్(22) నాటౌట్‌గా నిలిచి విజయాన్ని అందించారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోష్ టంగ్(3/42) రాణించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్384, ఆసీస్ 567 రన్స్‌కు అలౌటయ్యాయి. 26 వికెట్లు తీసిన ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్ ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్‌గా ఎంపికయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో(163) మెరిసిన ట్రావిస్ హెడ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు.




## చిరంజీవి-వెంకటేష్ స్పెషల్ ఇంటర్వ్యూ ..
## 'మన శంకర్ వరప్రసాద్ గారు'పై హైప్ డబుల్

టాలీవుడ్‌లో దశాబ్దాలుగా స్టార్‌డమ్‌ను నిలబెట్టుకున్న సీనియర్ హీరోలుగా మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. అభిమానులు ఎప్పటి నుంచో వీరిద్దరిని ఒకే ఫ్రేమ్‌లో చూడాలని కోరుకుంటున్న విషయం తెలిసిందే. ఆ కలను నిజం చేస్తూ చిరంజీవి ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'మన శంకర్ వరప్రసాద్ గారు' చిత్రంలో వెంకటేష్ కీలక పాత్రలో కనిపించనున్నారు. భారీ అంచనాల మధ్య రూపొందిన ఈ సినిమా జనవరి 12న సంక్రాంతి స్పెషల్‌గా థియేటర్లలోకి రానుంది. విడుదల సమయం దగ్గర పడటంతో ప్రమోషన్స్‌ను మరింత వేగవంతం చేసిన చిత్ర బృందం, తాజాగా చిరంజీవి  వెంకటేష్ కాంబినేషన్‌లో ఒక ప్రత్యేక ఇంటర్వ్యూను ప్లాన్ చేసినట్టు తెలుస్తోంది. ఈ ఇంటర్వ్యూ ఈ రోజే జరగనుందని సమాచారం. ఈ కార్యక్రమానికి దర్శకుడు అనిల్ రావిపూడి లేదా యంగ్ హీరో తేజ సజ్జ హోస్ట్‌గా వ్యవహరించే అవకాశాలున్నాయని టాక్. ఇండస్ట్రీలో అరుదుగా కనిపించే ఈ సీనియర్ స్టార్ జోడీ ఒకే వేదికపై మాట్లాడటం అభిమానుల్లో భారీ ఉత్సాహాన్ని రేపుతోంది. ఈ ఇంటర్వ్యూలో సినిమా విశేషాలతో పాటు, చిరంజీవి  వెంకటేష్ మధ్య ఉన్న స్నేహం, కెరీర్ మైలురాళ్లు, సరదా సంఘటనలు చర్చకు వచ్చే అవకాశముందని అంచనా. వీరిద్దరి మాటలు, అనుభవాలు వినేందుకు అభిమానులు గంటల లెక్కన ఎదురు చూస్తున్నారు. ఇక సినిమా విషయానికి వస్తే, 'మన శంకర్ వరప్రసాద్ గారు' ఒక పూర్తి స్థాయి ఫ్యామిలీ, కామెడీ ఎంటర్టైనర్‌గా రూపొందింది. ఇప్పటికే సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ చిత్రానికి యూ/ఏ సర్టిఫికెట్ లభించింది. లేడీ సౌత్ సూపర్ స్టార్ నయనతార మరోసారి చిరంజీవితో జతకట్టడం ఈ సినిమాకు మరింత ఆకర్షణగా మారింది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'సైరా నరసింహారెడ్డి' మంచి విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్లపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్, టీజర్, ట్రైలర్, పాటలు అన్నీ కూడా ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన తెచ్చుకున్నాయి. కేథరిన్ థ్రేసా, సచిన్ ఖేడ్కర్, శరత్ సక్సేన, హర్షవర్ధన్, అభినవ గోమఠం, రఘు బాబు తదితరులు కీలక పాత్రల్లో నటించారు. వెంకటేష్ విషయానికి వస్తే, గత ఏడాది సంక్రాంతికి విడుదలైన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో ఆయన భారీ బ్లాక్‌బస్టర్ అందుకున్నారు. అదే దర్శకుడు అనిల్ రావిపూడితో మళ్లీ ఈసారి హీరోగా కాకుండా కీలక పాత్రలో రావడం ఆసక్తిని కలిగిస్తోంది. ఈ సంక్రాంతికి మరోసారి వెంకటేష్ లక్ కలిసి వస్తుందా? అలాగే చిరంజీవికి ఈ సినిమా మరో విజయాన్ని అందిస్తుందా? అన్నది రిలీజ్ తర్వాత తేలనుంది.

## సంక్రాంతి ధమాకా..
## ఓటీటీలోకి వచ్చేస్తున్న 'గుర్రం పాపిరెడ్డి'

టాలీవుడ్ యువ నటుడు నరేష్ అగస్త్య, 'జాతి రత్నాలు' ఫేమ్ ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన క్రేజీ క్రైమ్ కామెడీ ఎంటర్టైనర్ గుర్రం పాపిరెడ్డి. గతేడాది డిసెంబర్‌లో థియేటర్లలో విడుదలై తనదైన శైలిలో ప్రేక్షకులను అలరించిన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ సందడికి సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ జీ5 (వవ5) ఈ సినిమా డిజిటల్ హక్కులను సొంతం చేసుకుంది. సంక్రాంతి పండుగ కానుకగా జనవరి 16, 2026 నుంచి ఈ చిత్రం జీ5లో స్ట్రీమింగ్ కానుంది. "జర భద్రంఁడ ఇదంతా మోసం!" అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమా, పండుగ సెలవుల్లో ఓటీటీ ప్రియులకు ఫుల్ ఎంటర్టైన్మెంట్ అందించడం ఖాయంగా కనిపిస్తోంది. ఖమ్మం జిల్లాకు చెందిన గుర్రం పాపిరెడ్డి (నరేష్ అగస్త్య) ఎలాగైనా తక్కువ సమయంలో కోటీశ్వరుడు కావాలని కలలు కంటుంటాడు. ఈ క్రమంలోనే నర్స్ సౌదామిని (ఫరియా అబ్దుల్లా)తో కలిసి ఒక 'డెడ్ బాడీ' మార్పిడికి సంబంధించిన రిస్కీ ప్లాన్ వేస్తాడు. ఈ ప్రయాణంలో వారికి ఎదురైన వింత మనుషులు, ఊహించని ట్విస్టులు, అడుగడుగునా పండించే నవ్వుల సమాహారమే ఈ సినిమా. హాస్య బ్రహ్మ బ్రహ్మానందం, కోలీవుడ్ స్టార్ కామెడీ నటుడు యోగి బాబు కీలక పాత్రల్లో నటించడం ఈ సినిమాకు అతిపెద్ద ప్లస్ పాయింట్. వీరిద్దరి టైమింగ్ ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తుంది. మురళీ మనోహర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రాజ్ కుమార్ కసిరెడ్డి, జీవన్ కుమార్ ఇతర ముఖ్య పాత్రల్లో మెరిశారు.




## ఓటీటీలోకి శోభితా ధూళిపాళ్ల సస్పెన్స్ థ్రిల్లర్ 'చీకటిలో'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే

దక్షిణాది సినిమాలతో పాటు బాలీవుడ్‌లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న టాలెంటెడ్ నటి శోభితా ధూళిపాళ్ల త్వరలో ఒక పవర్‌ఫుల్ సస్పెన్స్ థ్రిల్లర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ అక్కినేని కోడలు నటించిన తాజా చిత్రం 'చీకటిలో'. ఈ సినిమాకు శరత్ కొప్పిశెట్టి దర్శకత్వం వహిస్తుండగా.. సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం రాబోతుంది. తెలుగుతో పాటు తమిళం, హిందీ భాషల్లో నేరుగా ఓటీటీలోకి రాబోతున్న ఈ సినిమాకు సంబంధించి స్ట్రీమింగ్ తేదీని వెల్లడించింది చిత్రబృందం. ఈ సినిమాను ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో జనవరి 23 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించింది.

## నవీన్ పొలిశెట్టి
## 'అనగనగా ఒక రాజు' ట్రైలర్ విడుదల

టాలీవుడ్ నటుడు నవీన్ పొలిశెట్టి తన కామెడీతో మరోసారి థియేటర్లలో నవ్వుల జాతర సృష్టించడానికి సిద్ధమయ్యారు. సంక్రాంతి రేసులో నిలిచిన మోస్ట్ అవేటెడ్ మూవీ 'అనగనగా ఒక రాజు' థియేట్రికల్ ట్రైలర్‌ను చిత్ర బృందం నేడు (జనవరి 8న) అత్యంత గ్రాండ్‌గా విడుదల చేసింది. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ ట్రైలర్ చూస్తుంటే నవీన్ పొలిశెట్టి మరోసారి బాక్సాఫీస్ వద్ద తన కామెడీ పవర్‌ను పక్కాగా చూపించబోతున్నట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా కింగ్ అక్కినేని నాగార్జున ఈ ట్రైలర్‌కు వాయిస్ ఓవర్ అందించడం ఒక పెద్ద సర్ప్రైజ్ అని చెప్పాలి. రాజు గారి కోసం బంగార్రాజు రంగంలోకి దిగారు అన్నట్లుగా సాగిన ఆయన బేస్ వాయిస్ ట్రైలర్‌కు మరింత జోష్‌ను అదనపు ఆకర్షణను ఇచ్చింది. గోదావరి జిల్లా నేపథ్యంలో, పెళ్లి చుట్టూ తిరిగే గందరగోళం మరియు హుషారైన డైలాగ్స్‌తో ట్రైలర్ ఆద్యంతం వినోదాత్మకంగా సాగింది. ఇందులో నవీన్ ఎనర్జీకి తోడు, హీరోయిన్ మీనాక్షి చౌదరి అందం కూడా సినిమాపై అంచనాలను భారీగా పెంచేశాయి. మరోవైపు ఈ ఏడాది సంక్రాంతి పోటీ అత్యంత రసవత్తరంగా ఉండబోతుంది. ప్రభాస్ 'ది రాజా సాబ్', చిరంజీవి 'మన శంకరవరప్రసాద్ గారు' వంటి భారీ చిత్రాల మధ్య జనవరి 14న 'అనగనగా ఒక రాజు' తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. 'జాతి రత్నాలు' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత నవీన్ చేస్తున్న ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్‌టైనర్ కావడంతో ట్రేడ్ వర్గాల్లో కూడా ఈ సినిమాపై గట్టి నమ్మకం ఉంది. మారి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి మిక్కీ జె మేయర్ సంగీతాన్ని అందించగా, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించాయి.



## ప్రీమియర్‌లకు ముందే రికార్డుల దిశగా 'ది రాజాసాబ్'.. ప్రభాస్ క్రేజ్ మరోసారి ప్రూవ్

డార్లింగ్ ప్రభాస్ హీరోగా తెరకెక్కిన తాజా చిత్రం 'ది రాజాసాబ్' విడుదలకు ముందే బాక్సాఫీస్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. మారుతి దర్శకత్వంలో హారర్‌ఫాంటసీ జానర్‌లో రూపొందిన ఈ సినిమా, జనవరి 8, 2026 నుంచి ప్రపంచవ్యాప్తంగా ప్రీమియర్ షోలతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్లు, ట్రైలర్, ప్రమోషన్ కంటెంట్ సినిమాపై అంచనాలను భారీగా పెంచాయి. సినిమా రిలీజ్‌కు ముందే నార్త్ అమెరికా మార్కెట్‌లో అరుదైన ఘనత సాధించడం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రీమియర్ షోలు ప్రారంభమయ్యేలోపే అక్కడ ఒక మిలియన్ డాలర్ల గ్రాస్ కలెక్షన్ దాటడం విశేషంగా మారింది. ప్రభాస్‌కు విదేశాల్లో ఉన్న భారీ ఫ్యాన్ ఫాలోయింగ్, ముందస్తు బుకింగ్స్‌లో స్పష్టంగా కనిపిస్తోందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. తొలి టాక్ పాజిటివ్‌గా వస్తే, అక్కడ కలెక్షన్లు మరింత వేగంగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఇటీవల కొన్ని పెద్ద సినిమాలు వాయిదా పడటంతో అంతర్జాతీయ మార్కెట్‌లో 'ది రాజాసాబ్'కు అనుకూల వాతావరణం ఏర్పడింది. ముఖ్యంగా థియేటర్ల సంఖ్య పెరగడం, ప్రైమ్ షో టైమింగ్స్ ఈ సినిమాకు కలిసొచ్చాయని సమాచారం.



Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

ధర్మఘంట





ధర్మఘంట జనవరి 08 ఖమ్మం

తెలంగాణ గ్రామ పాలన ఆఫీసర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఖమ్మం జిల్లా కమిటీ సర్వసభ సమావేశం గురువారం టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్.నాగుల్ మీరా ఆధ్వర్యంలో నిర్వహించారు.అనంతరం ఎన్నుకున్న కమిటీ వివరాలను ట్రెస్సా జిల్లా అధ్యక్షుడు తుంబూరి సునీల్ కుమార్ రెడ్డి ప్రకటించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు జేఏసీ చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాస్,ట్రెసా జిల్లా అధ్యక్షుడు తుంబురు సునీల్ రెడ్డి,రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారుమంచి శ్రీనివాసరావు, టీఎన్జీవోస్ రాష్ట్ర కార్యదర్శి జయపాల్,ట్రెసా రాష్ట్ర కోశాధికారి బొగ్గవరపు వెంకటేశ్వరరావు,ట్రెసా జిల్లా ప్రధాన కార్యదర్శి కన్నేటి వీరవెంకటప్రసాద్,మహిళా విభాగం వసంత,టిజిపిఓఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ నాగుల్ మీరా,రాష్ట్ర ఉపాధ్యక్షుడు శీలం వెంకటేశ్వర్లు, ట్రెసా జిల్లా బాధ్యులు మలీద వెంకట్,అజీజ్ లు పాల్గొన్నారు.

జిల్లా నూతన కమిటీ

జిల్లా అధ్యక్షుడుగా మన్నే గురుమూర్తి,జిల్లా ప్రధాన కార్యదర్శిగా చిమట వీరబాబు,
కోశాధికారిగా షేక్ జమాల్
వర్కింగ్ ప్రెసిడెంట్స్ గా షేక్ అన్వర్ పాషా,బానోతు రవికుమార్,మహిళా అధ్యక్షరాలుగా మాటూరి మమత,తూమాటి శైలజ, అసోసియేట్ అధ్యక్షుడుగా నెల్లూరి లవన్ కుమార్,జిల్లా ఉపాధ్యక్షులుగా కొండబాల వెంకటేశ్వర్లు,ఆరెపుల రమేష్, సింగిరెడ్డి దయాకర్ రెడ్డి,తేజవత్ కేసియా,చంద్రన్న గౌడ్,మెంటం శ్రీను,మానుకొండ సంపత్ కుమార్,ఆంగోతు ఉపేందర్, వడ్డే బోయిన ఉపేందర్,సహాయ కార్యదర్శిలుగా తిరుమల శెట్టి శ్రీనివాస్,గుడిపాటి బాలకృష్ణ, బానోతు వీరన్న,తురక వీరభద్రం,
తురక కోటయ్య,దొబ్బల చంద్రశేఖర్,జంగాల శ్రీనివాస్,షేక్ పాషా,మహిళా ఉపాధ్యక్షులుగా పడిగెల హైమావతి,నేరేటి శారద,
బొబ్బ యశోద,కుంజ రాధ,
మహిళ కార్యదర్శులుగా
కేతమ్మ,పెద్దల నాగవాణి,
దోమల అనిత,బానోతు విజయలక్ష్మి,వి.రంగమ్మ,జిల్లా రమణ,ఆర్గనైజింగ్ సెక్రటరీస్ గా మూడు శ్రీనివాస్,మూర్తి నాగరాజు,కాక వెంకటేశ్వర్లు, బానోత్ నర్సింగ్ నాయక్,షేక్ నాగుల్ మీరా,షేక్ జానీ, కొండబోయిన తిరుమల్ రావు,సిలువేరు నరేష్,కల్చరల్ సెక్రటరీస్ గా రెంటాల భిక్షం, పగిడికత్తిల వీరబాబు, సూర్యదేవర సుధాకర్,స్పోర్ట్స్ సెక్రటరీస్ గా మోదుగు వీరబాబు, ఆవుల నాగార్జున రెడ్డి, కె.భూపతిరావు,జిల్లా కార్యవర్గ సభ్యులుగా పోతనబోయిన నరసింహారావు,పాలపాటి శ్రీను,
ఎస్.పద్మ,జె.శారద,రమాదేవి,షేక్ మస్తాన్,ఇస్తారి,భూక్య విజయలక్ష్మి,ఎం.చంద్రకళ,
శ్రీదేవిలు నూతన కమిటీకి ఎన్నికయ్యారు.

# భవిష్యత్ గురించి కలలు కనండి సాకారం చేసుకోండి

- మంచి వ్యక్తులతో స్నేహం చేసి ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలి
- డ్రగ్స్ రహిత సమాజం కోసం విద్యార్థులు బ్రాండ్ అంబాసిడర్ గా మారాలి
- డ్రగ్స్ ఉపయోగించి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు
- డ్రగ్ ఫ్రీ సూర్యాపేటకొరకు కృషి చేయాలి
- డ్రగ్స్ కి వ్యతిరేకంగా కదం తొక్కిన యువత
- డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో మారుమోగిన సూర్యాపేట పట్టణ వీధులు
- డ్రగ్ ఫ్రీ ఇండియా ర్యాలీకి వేలాదిగా తరలి వచ్చిన విద్యార్థులు
- పాల్గొన్న జిల్లా ప్రిన్సిపల్ సెషన్ జడ్జి లక్ష్మి శారద,జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్,ఎస్పి కే నరసింహా








ధర్మఘంట జనవరి 08 సూర్యాపేట:

విద్యార్థులు బంగారు భవిష్యత్ నిర్మించుకునేందుకు కలలను కని వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషి చేయాలని జిల్లా ప్రిన్సిపల్ సెషన్ జడ్జి,జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ లక్ష్మి శారద అన్నారు. జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో గురువారం సూర్యాపేట పట్టణంలోని కోర్ట్ భవనం నుండి సంతోష్ బాబు చౌరస్తా మీదుగా పిఎస్ఆర్ సెంటర్ నుండి పోస్ట్ ఆఫీస్ మీదుగా జూనియర్ కళాశాల వరకు డ్రగ్ ఫ్రీ ఇండియా అవగాహనా ర్యాలీలో జిల్లా ఎస్పీ కె.నరసింహ,జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ లతో కలిసి జిల్లా ప్రిన్సిపల్ సెషన్ జడ్జి,జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ లక్ష్మి శారద పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సభలో జిల్లా జడ్జి మాట్లాడుతూ డ్రగ్స్ అనే మహమ్మారి చాపకింద నీరులా వ్యాపించి యువత జీవితాలను నిర్వీర్యం చేస్తుందని,వాటిని సమాజం నుండి నిర్మూలించేందుకు జిల్లాలోని పరిపాలన, పోలీస్,న్యాయ శాఖలు కృషి చేస్తున్నాయన్నారు.డ్రగ్స్ ఉపయోగించడం వల్ల మనసు,శరీరం,వ్యక్తిత్వం నిర్వీర్యం చెంది తప్పుడు పనులు చేసేలా ప్రేరేపిస్తాయని వాటి వల్ల మనకి ఎలాంటి ఉపయోగం లేదని ఆరోగ్యానికి హానికరం అని మాదకద్రవ్యాలు, గంజాయి లాంటి వాటిని తయారు చేసిన,రవాణా చేసినా,సేవించినా,అమ్మినా, కొనుగోలు చేసినా,తెలియక చేసినా ఎన్డిఎస్‌పి యాక్ట్ ప్రకారం నేరమవుతుందని, బయటికి రావడానికి కూడా బెయిల్ కూడా ఇవ్వకుండా శిక్షలు విధించడం జరుగుతుందని,20 సంవత్సరాల నుంచి యావజీవ శిక్ష పడేలా కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు.మాదకద్రవ్యాలు తెలియక చేదించిన,బానిసైన వారి కొరకు రిహాబిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసి డాక్టర్ల ద్వారా కౌన్సిలింగ్ ఇప్పించి వారిని మాదకద్రవ్యాల నుండి బయట పడేసి యధావిధిగా జీవితం కొనసాగించేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ న్యాయ సహాయం చేస్తుందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.జీవితంలో స్నేహితుల పాత్ర చాలా గొప్పదని జయాల్లో, అపజయాల్లో నేనున్నానంటూ వెన్నుతట్టే మంచి స్నేహితులు ఉంటే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని,అదే తప్పుడు స్నేహం అలవాటు అయితే చెడు మార్గాలలో వెళ్లి జీవితాలను నాశనం అవుతాయని తెలిపారు. మాదకద్రవ్యాలు పాఠశాలలో,కళాశాలలో చాక్లెట్స్ రూపంలో తయారుచేసి డ్రగ్స్ కు యువత ఎడిక్ట్ అయ్యేలా చేసి డ్రగ్స్ కు అలవాటు పడి తప్పుడు మార్గాలలో నేరాలు చేసేలా ప్రేరేపిస్తున్నారని,వాటి నుంచి మనం ముందుగానే మేల్కొని చుట్టుపక్కల ఎక్కడైనా మాదకద్రవ్యాలు కనిపిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని డ్రగ్ ఫ్రీ సూర్యాపేట నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ స్వామి వివేకానంద జన్మదినం సందర్భంగా భారతదేశంలో డ్రగ్స్ ను దూరం చేయుటకు డ్రగ్ ఫ్రీ ఇండియా ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని డ్రగ్స్ ఉపయోగించడం వల్ల జీవితాలు,కుటుంబాలు ఆగమయవుతున్నాయని డ్రగ్స్ అమ్మకం ద్వారా వచ్చిన డబ్బులు సమాజంలో కలహాలు సృష్టించి అభివృద్ధి చెందకుండా చేసేందుకు ఉపయోగిస్తున్నారని తెలిపారు.పాఠశాలలో, కళాశాలలోని టీచర్స్, లెక్చరర్స్ విద్యార్థుల యొక్క ప్రవర్తన,అలవాట్లపై నిఘా పెట్టాలని,మంచి ఆలోచనలు ఆచరణలోకి తీసుకొచ్చి కార్యాచరణగా అయి మంచి అలవాట్లుగా మారి మంచి క్యారెక్టర్ నిర్మించి మన గమ్యాన్ని చేర్చుతాయని తెలిపారు.విద్యార్థులకు కథ రూపంలో చెడు స్నేహం చేయటం ద్వారా డ్రగ్స్ ఉపయోగించటం వల్ల కలిగే నష్టాలను,మంచిగా చదవటం వల్ల కలిగే లాభాలను ఆసక్తి కలిగించేలా చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో నేడు డ్రగ్స్,గంజాయి ఉపయోగిస్తున్నారని,వాటిని సమాజం నుండి తొలగించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీయనుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.ఎస్పీ కె.నరసింహ



మాట్లాడుతూ యువత భారతదేశ గొప్ప వనరులని, బావి భారత పౌరులని, సమాజం నుండి గంజాయి,డ్రగ్స్ తొలగించేందుకు విద్యార్థులే ప్రచారకర్తలుగా అంబాసిడర్ గా మారాలని కోరారు.డ్రగ్స్, గంజాయి అమ్మిన,కొనుగోలు చేసిన చట్టరిత్యా నేరమని కఠినమైన శిక్షలు పడతాయని,వాటిని సేదించటం వల్ల ఆరోగ్యం నాశనం అవుతుందని ఇలా చాలామంది మధ్యలోనే జీవితాలు కోల్పోతున్నారని అన్నారు.డ్రగ్స్,గంజాయి మహమ్మారిని సమాజం నుండి కూకటివేళ్ళతో తీసివేయాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం జిల్లా ఎస్పీ అందరిచే ప్రతిజ్ఞ చేపించారు.అనంతరం ప్లెక్సీపై సంతకాలు చేశారు. డ్రగ్స్ ఫ్రీ ఇండియా ర్యాలీకి విద్యార్థులు వేలాదిగా తరలివచ్చి డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో సూర్యాపేట పట్టణ వీధులు మారుమోగాయి.ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఫర్హీన్ కౌసర్,ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రజిత గోపు, ఫస్ట్ ఎడిషనల్ జూనియర్ జడ్జి అపూర్వ రవళి,సెకండ్ ఎడిషనల్ జూనియర్ జడ్జి మంచాల మమత,బార్ అసోసియేషన్ చైర్మన్ లింగయ్య,సెక్రటరీ రాజు,ఆర్ డి ఓ వేణుమాధవ్,డీఎస్పీ ప్రసన్నకుమార్,జిల్లా అధికారులు,ఉపాధ్యాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు హాజరయ్యారు.

## చండూరు మున్సిపాలిటీలో 12 మందిని గాయపర్చిన పిచ్చికుక్క

ధర్మఘంట జనవరి 8 చండూరు

నల్లగొండ జిల్లా చండూరు మున్సిపాలిటీ పరిధిలో గురువారం పిచ్చికుక్క స్వైర విహారం చేస్తూ యూనియన్ బ్యాంకు,కస్తాల రోడ్డు సమీపంలో పనుల నిమితం వివిధ గ్రామాల నుండి వచ్చిన వారితో పాటు మున్సిపాలిటీకి చెందిన 12 మందిపై దాడి చేసి గాయపరచడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. గమనించిన స్థానికులు గాయపడిన వారిని చండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి,పిచ్చికుక్కను వెంటాడి చంపేశారు.పిచ్చికుక్క కాటుకు గురైన వారికి ఆసుపత్రి వైద్య సిబ్బంది యాంటి రేబిస్ వాక్సిన్ ఇచ్చి చికిత్స అందించారు.తీవ్రంగా గాయపడిన 10 మందిని మెరుగైన చికిత్స కోసం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వైద్యాధికారి మాస రాజు తెలిపారు.

## ద్విచక్ర వాహనదారుడికి చైనా మంజా దారం ఎటాక్

**పెను ప్రమాదం నుండి తప్పించుకున్న వాహనదారుడు**

**సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఘటన**



ధర్మఘంట జనవరి 8 సూర్యాపేట:

చైనా మంజా దారం గురించి అధికారులు ఎన్ని ప్రకటనలు చేసినా,ఎన్ని ఆంక్షలు విధించినా వ్యాపారాల విక్రయాలు ఆగడం లేదు, కొనుగోలు చేసేవారు మారడం లేదు.దీనితో ఏదో ఒకచోట చైనా మంజా దారాలు ప్రత్యక్షమవుతూనే ఉన్నాయి, ప్రజలు ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారు,తీవ్రంగా గాయపడిన ఆసుపత్రుల్లో చేరుతూనే ఉన్నారు.ఇలాంటి ఘటనే గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఓ ద్విచక్ర వాహనదారుడికి ఎదురైంది. గాలిపటానికి ఉన్నటువంటి చైనా మాంజా దారం వాహనదారునికి అడ్డు రావడంతో వాహనాన్ని సడన్ బ్రేక్ వేయడం ద్వారా పెను ప్రమాదం నుండి తప్పించుకున్నాడు.ఏ మాత్రం ఏమారపాటుగా ఉన్నా పరిస్థితి ఊహించడమే కష్టంగా ఉండేది. ఇప్పటికైనా అధికారులు,పోలీసు యంత్రాంగం ప్రజల ప్రాణాలకు హాని కలిగించే చైనా మంజా దారాల విక్రయాలపై దృష్టిసారించి,ఈ సంక్రాంతి సంబరాలకు గమ్య స్థానాలకు చేరుకునే కుటుంబాలలో ఎలాంటి విషాదఛాయలు అలుముకోకుండా గట్టి నిఘా పెట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

## రేషన్ నిర్వహణ చేత కాక పోతే రాజీనామా చేయండి

**పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిటీ మాచన రఘునందన్**

ధర్మఘంట జనవరి 08 చండూరు




చౌక దుకాణాల నిర్వహణలో ఆలసత్వం,నిర్లక్ష్యం పనికి రావని పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిటీ మాచన రఘునందన్ హెచ్చరించారు. గురువారం నల్లగొండ జిల్లా చండూరులో రేషన్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ కొందరు డీలర్లు బాధ్యతారాహిత్యంతో ఉండటం వల్ల ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.రేషన్ నిర్వహణ చేతకాక పోతే డీలర్ షిప్ కు రాజీనామా చేయడం ఉత్తమమని,జాతీయ ఉత్పత్తి పథకం గౌరవప్రదమైన ఉపాధి అవకాశమని,కార్డు దారులను విఐపిలుగా పరిగణించాలని సూచించారు.కనీస సమాచారం ఇవ్వకుండా రేషన్ దుకాణం మూసి ఉంచితే కేసు నమోదుకు కూడా వెనకాడే ప్రసక్తే లేదని రఘునందన్ హెచ్చరించారు.

## సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**

ధర్మఘంట జనవరి 08 నల్లగొండ:



సంక్రాంతి సెలవుల నేపథ్యంలో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు.గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మాట్లాడుతూ ఇళ్లకు తాళం వేసి వెళ్లే వారు తప్పనిసరిగా భద్రతా చర్యలు తీసుకోవాలని,పండుగల సమయంలో దొంగతనాల నివారణకు 24 గంటల పోలీస్ పెట్రోలింగ్ ఉంటుందని,రద్దీ, నిర్మానుష్య ప్రాంతాలు, అపార్ట్మెంట్లు,కాలనీలపై ప్రత్యేక నిఘా పెట్టి,ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలు,ఆర్థిక సంస్థల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు.ప్రజలు సీసీటీవీ కెమెరాలు,అలారం సిస్టమ్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఇల్లు ఖాళీగా ఉందని సోషల్ మీడియాలో పోస్ట్ చేయవద్దని హెచ్చరించారు. బంగారు ఆభరణాలు,నగదు బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలని,పత్రికలు,పాలు పేరుకుపోకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, పొరుగువారితో సమన్వయం చేసుకుని పరస్పర నిఘా పనిమనుషులు,డ్రైవర్ల వెరిఫికేషన్ తప్పనిసరి చేయాలని,అపార్ట్మెంట్లు, కాలనీల్లో వాచ్‌మన్‌లను అప్రమత్తం చేయాలన్నారు.నైట్ పెట్రోలింగ్,ప్రత్యేక పోలీస్ చర్యలు కొనసాగుతున్నాయని,అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే డయల్ 100 లేదా పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని,పోలీసులకు సహకరించి నల్లగొండ జిల్లాను నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

ధర్మఘంట

## పలువురి కుటుంబ సభ్యులను పరామర్శించిన, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**ధర్మఘంట, జనవరి 08, నకిరేకల్:**

నియోజకవరిదిలోని, కట్టంగూర్ మండల కేంద్రానికి చెందిన గుండు చంద్రయ్య అనారోగ్యంతో మరణించగా వారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు..

2). నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామ 1వవార్డు సభ్యులు కొల్లు సుగుణమ్మ ప్రమాదవశాత్తు గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుడంగా వారిని పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు..

3).అనారోగ్యంతో మరణించిన నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామానికి చెందిన కామళ్ల సుధీర్ గారు అనారోగ్యంతో మరణించగా వారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు..

04). నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని 06వ వార్డుకి చెందిన దొరపల్లి భిక్షమయ్య గారు అనారోగ్యంతో మరణించగా వారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు..

## మీడియా అకాడమీ చైర్మన్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు

**చిన్న పత్రికల సంఘం తరపున మర్యాదపూర్వక భేటీ**

**హైదరాబాద్, జనవరి 8: (ధర్మఘంట ప్రతినిధి):**



తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని గురువారం సాయంత్రం ఆయన కార్యాలయంలో తెలంగాణ స్మాల్ మీడియం న్యూస్ పేపర్స్ & మ్యాగజైన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యూసూఫ్ బాబు మర్యాదపూర్వకంగా కలిసి తన సంఘం తరపున నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గోళ్ళ రమేష్, ప్రధాన కార్యదర్శి అశోక్, వెంకటయ్య తదితరులు పాల్గొని చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## కుందూరు జైవీర్ రెడ్డిని కలిసిన నల్గొండ టీం



**ధర్మఘంట, జనవరి 08, నాగార్జునసాగర్:**

నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి హైదరాబాదులోని నివాసంలో ఆల్ ఇండియన్ మ్యారేజ్ బ్యూరోస్ మెడియేటర్స్ సొసైటీ సంస్థ సభ్యులు కలిసి మ్యారేజ్ బ్యూరో వ్యవస్థకి సహకరించాలని కోరారు. పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో కోట్ల సునీత దేవి జిల్లా అధ్యక్షురాలు కట్టా సుధాకర్ రెడ్డి రాష్ట్ర అధికార ప్రతినిధి సంగిరెడ్డి పద్మారాంరెడ్డి లక్ష్మి శ్రీనివాస్ నాయక్ మిర్యాలగూడ సుగుణయ కందుల విజయ్ కుమార్ గుండెబోయిన రాముల యాదవ్ దాసరి కృష్ణ కారం పార్వతమ్మ ఉప్పల్ ప్రభాకర్ కొమ్ము అమృత సంస్థ ఫౌండర్ రమేష్ నేత తదితరులు పాల్గొన్నారు

## వాసవి క్లబ్, వాసవి ఎన్నారై క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

**ముఖ్య అతిధిగా పాల్గొన్న వాసవి క్లబ్ గవర్నర్ వీరేళ్లి సతీష్**




**ధర్మఘంట, జనవరి 08 సూర్యాపేట**

వాసవి క్లబ్ సూర్యాపేట, వాసవి ఎన్నారై క్లబ్ సూర్యాపేట ఆద్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు, వంటల పోటీలు నిర్వహించడం హర్షణీయమని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 104 ఎ గవర్నర్ వీరవెల్లి సతీష్ అన్నారు. గురువారం నాడు స్థానిక రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద వాసవి క్లబ్, వాసవి ఎన్నారై క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు, వంటల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలకు కన్సలేషన్ ప్రైజ్ లు, వంటల పోటీలలో గెలుపొందిన విజేతలకు గందూరి షాపింగ్ మాల్ తరపున గందూరి క్రపాకర్ చీరలను బహుమతులుగా అందజేశారు. ముగ్గుల పోటీల విజేతలకు మణిముఖర జువెల్లర్స్ వారు బహుమతులు అందజేశారు. పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రియ గోల్డ్ కంపెనీ వారు నూనె ప్యాకెట్ లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వీరవెల్లి సతీష్ మాట్లాడుతూ వాసవి క్లబ్ లు సమాజసేవలో ముందు ఉంటాయని, మన సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తాయని అన్నారు. ముగ్గుల పోటీలు, వంటల పోటీలలో పెద్దసంఖ్యలో పాల్గొన్న మహిళలకు అభినందనలు తెలియజేశారు. పోటిలలో సంక్రాంతి పండుగ, తెలంగాణ గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించే ముగ్గులను రంగులతో వేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అద్యక్ష కార్యదర్శులు, ఓరుగంటి సతీష్, మాశెట్టి నరేష్, కోశాధికారి మైనంపల్లి సతీష్, ఎన్నారై క్లబ్ అద్యక్షకార్యదర్శులు దాచేపల్లి సత్యనారాయణ, ఇమ్మడి శ్రీనివాస్, కోశాధికారి చల్లా శ్రీనివాస్ లు పాల్గొన్నారు. వారితో పాటు ఐపిఇ లు సింగిరికొండ రవీందర్, తోట శ్యామ్ ప్రసాద్, గుండా శ్రీదేవి, ఐపి సి లు కలకోట లక్ష్మయ్య, రాచకొండ శ్రీనివాస్, చల్లా లక్ష్మయ్య, మిట్టపల్లి రమేష్, వెంపటి శబరినాథ్, బిక్కుమళ్ల కృష్ణ, తల్లాడ సోమయ్య, క్యాబినెట్ సెక్రటరీ నూనె కిషోర్ కుమార్, ట్రెజరర్ ఉప్పల వెంకటరమణ, గుండా శ్రీధర్, చల్లా సత్యనారాయణ, యామా సంతోష్, జూలకంటి నాగరాజు, బజ్జూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## టీఏఈవో యూనియన్ సూర్యాపేట జిల్లా బాడీ ఏకగ్రీవ ఎన్నిక




**ధర్మఘంట, జనవరి 08, సూర్యాపేట:**

టిఎన్ జీవో ఆధ్వర్యంలో తెలంగాణ అగ్రికల్చర్ ఎక్స్ టెన్షన్ ఆఫీసర్ (టీ ఏఈవో) యూనియన్ సూర్యాపేట జిల్లా బాడీ నీ గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎలక్షన్ ఆఫీసర్లుగా టీఎన్జీవో జనరల్ సెక్రటరీ దున్న శ్యామ్, ఉమ్మడి నల్గొండ జిల్లా టీఏఈవో జిల్లా అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీ ఆధ్వర్యం లో ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా టీఏఈవో సూర్యాపేట జిల్లా అధ్యక్షుడి గా పెద్దపంగ ప్రణయ్ (ఏఈఓ - దూపహాడ్), జనరల్ సెక్రటరీ గా ధరావత్ మనోజ్ కుమార్ (ఏఈఓ- పొనుగోడు), ట్రేజరర్ గా షేక్ ముస్తఫా (ఏఈఓ లింగగిరి), అసోసియేట్ ప్రెసిడెంట్ గా ఆతుకూరి ఉప్పయ్య (ఏఈఓ - బృందావనపురం), యూనియన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా యూనియన్ నాయకులు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతూ యూనియన్ పక్షాన మన ఉద్యోగుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో నల్గొండ టి ఎన్జిఓ వైస్ ప్రెసిడెంట్ వహీద్, సూర్యాపేట జిల్లా ఏఈవోలు పాల్గొన్నారు.

## తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ క్యాలెండర్ ఆవిష్కరణ



**ధర్మఘంట, జనవరి 08, సూర్యాపేట:**

తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సూర్యాపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ గెజిటెడ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్ ఉద్యోగులకు ఎంతగానో ఉపయోగపడేలా ఉందన్నారు. ఉద్యోగులకు కావాల్సిన ముఖ్యమైన తేదీలను ఇందులో పొందుపర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలోఅడిషనల్ కలెక్టర్ కె. సీతారామారావు, జిల్లా అధ్యక్షులు అధ్యక్షులు భూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి భూక్య పాండు నాయక్, అసోసియేట్ ప్రెసిడెంట్ నాగేందర్, కోశాధికారి రవికుమార్, వైస్ ప్రెసిడెంట్ స్వప్న, ఆర్గన ఆర్గనైజర్ సెక్రటరీ యాదగిరి, ఉదయ్ కుమార్, జాయింట్ సెక్రెటరీ రాంబాబు, పద్మావతి, కల్చరల్ అండ్ స్పోర్ట్స్ సెక్రెటరీ మల్సూర్, సభ్యులు ఉమామహేశ్వర్, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మడ అడవుల పునరుద్ధరణకు పటిష్ట చర్యలు

## నేషనల్ క్యాంపా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆనంద్ మోహన్






**విజయవాడ**

సముద్ర తీర ప్రాంతాల్లో క్షీణిస్తున్న మడ అడవులను పునరుద్ధరించి, ఆ ప్రాంతాల్లో నివసించే ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడమే మిస్టీ పథకం ప్రధాన ఉద్దేశ్యం అని నేషనల్ క్యాంపా, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆనంద్ మోహన్ తెలిపారు. కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర అటవీ శాఖల సంయుక్తంగా తీరప్రాంత ఆవాసాలు, స్పష్టమైన ఆదాయాల కోసం మాంగ్రోవ్ ఇనీషియేటివ్ పై విజయవాడ లెమన్ ట్రీ ప్రీమియర్ లో గురువారం రెండు రోజులపాటు నిర్వహించే జాతీయ వర్క్‌షాప్ ను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన నేషనల్ క్యాంపా, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆనంద్ మోహన్ మాట్లాడుతూ.. సముద్ర తీరప్రాంతాల్లో క్షీణిస్తున్న మడ అడవులను రక్షించి, సముద్రం కోత నుంచి కాపాడటమే లక్ష్యంగా మిస్టీ పథకం పనిచేస్తుందన్నారు. ప్రస్తుతం ఇది సుమారు రెండున్నర ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ పథకానికి జాతీయ కాంపా నిధుల నుండి 10 శాతం కేటాయిస్తున్నారన్నారు. మొత్తం 825 కోట్ల రూపాయల కేటాయింపుల్లో ఇప్పటివరకు కేవలం 100 కోట్లు మాత్రమే వినియోగించబడ్డాయన్నారు. గుజరాత్, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో మడ అడవుల విస్తీర్ణం ఎక్కువగా ఉన్నప్పటికీ, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు మరియు కేరళ వంటి రాష్ట్రాలు ఈ పథకంలో ఆశించిన స్థాయిలో భాగస్వామ్యం లేదన్నారు. మడ అడవులు ప్రకృతి సిద్ధమైన రక్షణ గోడలా పనిచేసి తుపానులు, ఉప్పెనల వంటి ప్రకృతి వైపరీత్యాల నుండి తీర ప్రాంతాలను కాపాడతాయన్నారు. మడ అడవుల క్షీణత వల్ల భూగర్భ జలాల్లో ఉప్పు నీరు చేరి వ్యవసాయ భూములు దెబ్బతింటున్నాయన్నారు. వీటిని కాపాడుకోవడం వల్ల స్థానిక రైతుల భూములు సురక్షితంగా ఉంటాయన్నారు. ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ డాక్టర్ పీవీ చలపతిరావు స్వాగతోపన్యాసం చేస్తూ.. దేశవ్యాప్తంగా తీర ప్రాంత రాష్ట్రాల అటవీ శాఖ అధికారులు, జాతీయ సంస్థల ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు ఈ వర్క్ షాప్‌లో పాల్గొన్నారన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్‌లో మడ అడవుల విస్తీర్ణం పెరుగుతూ ఉండటం ఒక సానుకూల అంశమని, భవిష్యత్తులో తీర ప్రాంతాన్ని మరింత సురక్షితంగా మార్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మడ అడవులను ఎలా అభివృద్ధి చేయాలి, తీర ప్రాంత రక్షణలో వాటి పాత్రపై లోతైన చర్చలు జరిగుతున్నాయన్నారు. పశ్చిమ బెంగాల్, గుజరాత్ తర్వాత, ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికంగా మడ అడవులు ఉన్నాయన్నారు. మన రాష్ట్రంలో సుమారు 50,000 హెక్టార్లలో ఈ అడవులు ఉండగా, అందులో 40,000 హెక్టార్లు నోటిఫై చేయబడ్డాయన్నారు. మడ అడవులు తుఫానులు, సునామీలు మరియు ఉప్పెనల నుండి ప్రాథమిక స్థాయి రక్షణగా నిలుస్తాయని, డెల్టా ప్రాంతాల్లోకి ఉప్పు నీరు చొచ్చుకు రాకుండా అడ్డుకుంటాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన మిస్టీ పథకం ద్వారా మడ అడవుల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నారని, 2028 వరకు ఈ పథకం కొనసాగుతుందన్నారు. రాష్ట్ర తీర ప్రాంతంలో దాదాపు 30 శాతం కంటే ఎక్కువ భాగం కోతకు గురవుతోందని, దీనిని అరికట్టడానికి 'నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్' సహకారంతో మేనేజ్మెంట్ ప్లాన్స్ సిద్ధం చేస్తున్నారన్నారు. కృష్ణా-గోదావరి డెల్టా ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌కు అన్నపూర్ణ లాంటిదని, ఇక్కడ లభించే చేపలు, ఇతర వనరులు మన దేశానికి అవసరమైన ప్రోటీన్, కార్బోహైడ్రేట్లను అందిస్తాయన్నారు. వర్క్ షాపులో డైరెక్టర్ ఎన్సీసీఆర్ (నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్) డాక్టర్ ఆర్ఎస్ కంకార, ఇన్ స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ వీఎల్ రాయ్ కుల్లయ్, డిప్యూటీ ఇన్ స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్స్ (డీఐజీఎఫ్) ప్రశాంత్ రాజగోపాల్, ఎన్టీఆర్ జిల్లా డీఎఫ్వో జి. సతీష్ రెడ్డి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ జిల్లాలకు చెందిన ఫారెస్ట్ అధికారులు, తదితరలు పాల్గొన్నారు.

## లూయిస్ బ్రెయిలీ సేవలు చిరస్మరణీయం

**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**విజయవాడ**

లూయిస్ బ్రెయిలీ అందించిన సేవలు చిరస్మరణీయమైనవని, ఎలాంటి సౌకర్యాలూ లేని రోజుల్లో చేతివేళ్లతో చుక్కలను స్పృశించడం ద్వారా చదవగలిగే లిపిని ఆవిష్కరించడం ద్వారా లూయిస్ బ్రెయిలీ మహా మనిషిగా నిలిచారని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. గురువారం నగరంలోని ఎంజీ రోడ్డు ఠాగూర్ గ్రంథాలయంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ బ్రెయిలీ దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పాల్గొన్నారు. విభిన్న ప్రతిభావంతులు, అధికారులు, చిన్నారులతో కలిసి లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి.. శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ దృష్టికి సంబంధించిన సమస్యలు ఉన్నాయని కలత చెందకుండా బ్రెయిలీ చూపిన మార్గంలో నడిచి తామెవరకీ తక్కువ కాదని నిరూపిస్తూ ఎదిగినప్పుడే బ్రెయిలీకి నిజమైన నివాళులు అర్పించినవారమవుతామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ.. బ్రయిలీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 3న నిర్వహించిన విభిన్న ప్రతిభావంతుల ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన దివ్యాంగ ఉద్యోగులకు మెరిట్ అవార్డులు అందించారు. నగరంలో లూయిజ్ బ్రెయిలీ విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని వివిధ సంఘాల ప్రతినిధులు కోరగా ఈ అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఛైర్‌పర్సన్ జి.నారాయణస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించి చేయూతనందిస్తోం దన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని బాగా చదువుకునేం దుకు అవసరమైన ఉపకరణాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విజువల్లీ ఛాలెంజ్డ్ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషిచేస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు, దృష్టిలోపం కలిగిన విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా విభిన్న

ధర్మఘంట

# ప్రమాదకరంగా మణుగూరు బిటిపిఎస్ రోడ్డు!

**మేడారం జాతర సందర్భంగా పొంచి ఉన్న ప్రమాదాలు**

**యుద్ధ ప్రాతిపదికన రోడ్లు నిర్మించాలి**

**సిఎస్ఆర్ నిధులు స్థానిక గ్రామాలకు ఖర్చు చేయాలి**

**సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య**




**మణుగూరు**

మణుగూరు నుండి భద్రాద్రి పవర్ ప్లాంట్ వరకు ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారిందని, జనవరి 28 నుండి జరిగే మేడారం జాతర సందర్భంగా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని యుద్ధ ప్రాతిపదికన రోడ్లు నిర్మించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య అన్నారు. గురువారం స్థానిక శ్రామిక భవనంలో గుండి భీమయ్య అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ.. మణుగూరు సాయిబాబా టెంపుల్ నుండి బయ్యారం క్రాస్ రోడ్డు వరకు ఈ సంవత్సరం కురిసిన భారీ వర్షాలు మరియు ఇసుక, బొగ్గు లారీల రాకపోకల కారణంగా రోడ్డు విధ్వంసం అయిందన్నారు. మణుగూరు బొగ్గు గనుల నుండి రోజుకు 17వేల టన్నుల బొగ్గును బి టి పి ఎస్ కు సరఫరా చేస్తున్నారని అన్నారు. భారీ వాహనాల రాకపోకల కారణంగా రోడ్డు ప్రమాదకరంగా మారిందన్నారు. రోడ్డుపై భారీ గుంతల కారణంగా ఇటీవల భద్రాద్రి పవర్ ప్లాంట్ లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ చిక్కుడు గుంట వద్ద ఇంటి నుండి రోడ్ ఎక్క సందర్భంలో ప్రమాదం గురై చనిపోయాడని అన్నారు. బిటిపిఎస్ ప్రారంభం నాటి నుండి ఈ రోడ్డు అధ్వాన్నంగా తయారయింది అన్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులు పట్టించుకోకపోవడం కారణంగా అనేక ప్రమాదాలు జరిగినాయి అని అన్నారు. పదుల సంఖ్యలో ప్రజలు మరణించారని తెలిపారు. భారీ వాహనాలు రాకపోకల సందర్భంగా ఈ విపరీతమైన దుమ్ము ఎగిసి పడడంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలకు రోడ్డు కనిపించడం లేదన్నారు. దీని కారణంగా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. సాంబాయిగూడెం, చిక్కుడుగుంట గ్రామాలలో ఉన్న ప్రధాన రహదారి వెంబడి ఇరువైపులా రోడ్డు కోతకు గురైంది అన్నారు ఆదమరచి ప్రయాణం చేస్తే ప్రమాదం జరుగుతుందన్నారు. జనవరి 28 నుండి జరిగే మేడారం జాతరకు అనేక రాష్ట్రాల నుండి ప్రజలు లక్షల సంఖ్యలో ఈ రోడ్డు వెంబడి ప్రయాణం చేస్తారని తెలిపారు. దూర ప్రాంతాల నుండి వచ్చేవారికి రోడ్డుపై అవగాహన లేని కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం మరియు ఆర్ అండ్ బి శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. మణుగూరు సబ్ డివిజన్ కేంద్రంగా సింగరేణి, బి టి పి ఎస్ , బిపిఎల్, హెవీ వాటర్ ప్లాంట్ ఉన్నాయని అన్నారు. సిఎస్ఆర్ నిధులు మణుగూరు ప్రాంత ప్రజలకు ఉపయోగించకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో మౌలిక సౌకర్యాలు లేక అనేక గ్రామాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని అన్నారు. సిఎస్ఆర్ నిధులు ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగానే సిఎస్ఆర్ నిధుల పక్కదారి పడుతున్నాయని అన్నారు. రాష్ట్ర మంత్రులకు వారి కేటాయించబడిన గ్రామాలకు సిఎస్ఆర్ నిధులు మళ్ళిస్తున్నారని అన్నారు. మణుగూరు పట్టణ అభివృద్ధి చెందాలంటే సిఎస్ఆర్ నిధులతో పాటు వెనకబడిన గ్రామాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి అంతర్గత రోడ్లు, మౌలిక సదుపాయాల కొరకు ఉపయోగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి సత్ర పల్లి సాంబశివరావు, సిపిఎం సీనియర్ నాయకులు కొడిశాల రాములు, పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు దామల్ల వెంకన్న, బొల్లం రాజు, పార్టీ మండల కమిటీ సభ్యులు కుంజరాజు, ఉప్పతల నరసింహారావు, కొండ్రు గౌరీ, పల్లపు నాగేశ్వరరావు, బూర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ బోరులో 01 హెచ్ పి మోటర్ ఏర్పాటు



**జూలూరుపాడు**

మండల కేంద్రంలోని పడమటి నరసాపురం గ్రామపంచాయతీ నందు గ్రామ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి నూతన సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామపంచాయతీ సెక్రటరీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న బోర్వెల్ లో వన్ హెచ్పి సామర్థ్యం గల మోటర్ ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం గ్రామ అభివృద్ధి లక్ష్యంగా చేపట్టిన ముఖ్యమైన చర్యగా గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో త్రాగునీటి కొరత లేకుండా నిరంతరం నీటి సరఫరా కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో కూడా గ్రామ అభివృద్ధికి సంబంధించిన పనులు ప్రాధాన్యతతో చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పడమట నరసాపురం సర్పంచ్ సంఘం లక్ష్మి కుమారి, ఉప సర్పంచ్ ఆళ్ల ప్రవీణ్ కుమార్ గ్రామ పంచాయతీ సెక్రటరీ హారిక, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు లేళ్ళ అప్పి రెడ్డి, వెలగా తిరుపతిరావు, సంఘం చినరాజు, తెల్లబోయిన మల్లికార్జున రావు, కట్రం నరసింహారావు, పుప్పాల శ్రీనివాసరావు, లేళ్ళ నవీన్ రెడ్డి, సంఘం నాగరాజు, బురం రమేష్, కోడెం సైదులు, కోడెం వెంకటేశ్వర్లు, దామెర్ల రాములు, దామెర్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే జారె




**అశ్వారావుపేట**

అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఈరోజు దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ముందుగా గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను అందజేశారు. అనంతరం బాలరాజుగూడెం పంచాయతీ దిబ్బగూడెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రీ ప్రైమరీ పాఠశాలను ప్రారంభించారు. అనంతరం పట్వారిగూడెం ప్రధాన సెంటర్ నందు రోడ్డు విస్తరణ పనులు పరిశీలించారు. తదుపరి అశ్వారావుపేట మండల కేంద్రంలో సీఎం కప్ టార్చ్ ర్యాలీ ను ప్రారంభించారు. విద్యుత్ ప్రమాదంలో మరణించిన అశ్వారావుపేటకు చెందిన జూజం బంగారు రావు కుటుంబానికి, అలాగే దమ్మపేట మండలం, రంగవారిగూడెం గ్రామానికి చెందిన తంగేళ్ళముడి పోలయ్య కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున మొత్తం రూ. 10 లక్షల ఎక్స్గ్రేషియా చెక్కులను అందజేశారు. అనంతరం దమ్మపేట మండలం, అక్కినేపల్లి పంచాయతీ వెంకటరాజపురం గ్రామంలో నిర్వహించిన విద్యుత్ ప్రజాబాట కార్యక్రమంలో పాల్గొని విద్యుత్ అధికారులతో కలిసి కరెంట్ సమస్యల పరిష్కారం మెరుగైన సేవలు ప్రభుత్వ రాయితీలు గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గుండాలలో రోడ్ సేఫ్టీ మంత్ నిర్వహించిన సీఐ లోడిగ రవీందర్





**గుండాల**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల ప్రకారం నేషనల్ రోడ్ సేఫ్టీ మంత్ లో భాగంగా గుండాల సీఐ లోడిగ రవీందర్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ నుండి గుండాల వీధుల గుండా హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం గుండాల ప్రధాన కూడలి వద్ద వాహనదారులతో సీఐ లోడిగ రవీందర్ మాట్లాడుతూ.. రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని, రోడ్డు ప్రమాదాలు నివారించడానికి వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని లేనియెడల చాలా మంది మృత్యువాత పడుతున్నారని, ప్రమాదం జరిగిన క్షణంలో హెల్మెట్ ఒక కవచంలాగా మారి ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు. అదేవిధంగా అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వంటివి చేయరాదని, మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాక్టర్, లారీ వంటి వాహనాలకు రేడియం స్టిక్కరింగ్ తప్పనిసరిగా చేయించాలని తద్వారా ఆగి ఉన్న వాహనం వల్ల జరిగే ప్రమాదాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రతి వాహనదారుడు లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, గతంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సుమారుగా వంద మంది వాహనదారులకు లైసెన్సులు ఇప్పించామని అన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ ప్రతి ఒక్క వాహనదారుడు సురక్షితమైన ప్రయాణం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రంలో పోలీస్ సిబ్బంది, వాహనదారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్ క్రీడలకు ధరఖాస్తుల ఆహ్వానం

**గుండాల**




తెలంగాణ ప్రభుత్వం గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు క్రీడాకారులలోని ప్రతిభను వెలికితీసి, రాష్ట్రంలో క్రీడల వ్యవస్థను బలోపేతం చేయడానికి, జనవరి 17 నుంచి ఫిబ్రవరి 14 వరకు నిర్వహించనున్న సీఎం కప్ 2026 పోటీలకు ఆసక్తిగల యువతీ యువకులు ధరఖాస్తు చేసుకోవాలని గుండాల ఎంపీడీఓ బాలరాజు, ఎంఈఓ పార్వతమ్మ తెలిపారు. ఈ పోటీలు 44 క్రీడాంశాలతో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నాలుగు దశల్లో జరుగుతాయన్నారు. గ్రామస్థాయిలో జనవరి 17 నుంచి 22 వరకు, మండల స్థాయిలో జనవరి 28 నుంచి 31 వరకు, నియోజకవర్గ స్థాయిలో ఫిబ్రవరి 3 నుంచి 7 వరకు, జిల్లా స్థాయిలో ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనదలచిన క్రీడాకారులు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (ఎస్ఏటీజీ) వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# స్టేషన్ తడకలపూడిలో ఫ్రీ ప్రైమరీ స్కూల్ ప్రారంభం.



**టేకులపల్లి**

స్టేషన్ తడికలపూడి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రీ ప్రైమరీ స్కూల్ ను తావూరియాతండా పంచాయతీ సర్పంచ్ తేజావత్ అను, కాంప్లెక్స్ హెచ్ఎం ధరావత్. రాంచందర్ సింగ్ గురువారం ప్రారంభించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. మారుమూల గ్రామాలలో కూడా పిల్లలకు విద్యను అభ్యసించుటకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రీ ప్రైమరీ స్కూలు మన గ్రామంలో ఏర్పాటు చేయడం మన అదృష్టమని, గ్రామంలో ఉన్న ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, వేల రూపాయలు ఖర్చుపెట్టి ప్రైవేట్ పాఠశాల చదివే దానికంటే అనుభవజ్ఞులైన అధ్యాపకులచే

భోధించబడే ఈ ప్రైమరీ స్కూల్లో చదవడం చాలా మేలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బానోత్ హచ్చులాల్, ఉపాధ్యాయుడు వి రవి, తావుర్యాతండా సుజాత, పంచాయతి కార్యదర్శి ధరావత్ అజయ్, ఉప సర్పంచ్ లేజావత్ సుమన్, వార్డు మెంబర్స్ లకావత్ రమేశ్, మూడ్ నరేష్, మూతి కల్పన, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ లకావత్ లక్ష్మీ, ప్రీ ప్రైమరి పాఠశాల సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, మరియు ప్రేమ పెద్దలు, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# వీబీజీ రాంజీ పేరుతో తెస్తున్న పథకాన్ని రద్దు చేసే వరకు పోరాడుదాం..!

**మున్సిపల్ ఎన్నికలకు సిద్ధంకండి - సిపిఎం**



**ఇల్లందు**

సిపిఎం పార్టీ మండల స్థాయి విస్తృత సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక కర్షక వ్యవసాయ కూలీలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పోరేట్ శక్తుల కు ఊడిగం చేస్తున్నారని, అందులో భాగంగానే స్వాతంత్రానికి ముందు తర్వాత కార్మికులు సాధించుకున్న 29 చట్టాలనురద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లు తెచ్చారని, రైతు వ్యతిరేక విత్తన చట్టం తెచ్చారని, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి గ్యారెంటీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ వీబీజీ రాంజీ నీ అమలు లోకి తెచ్చారని, ఇదంతా కార్పోరేట్ శక్తులకు ఊడిగం చేసే చర్య అని అన్నారు. పార్టీ రాష్ట్ర నాయకులు ఏ జే రమేష్ మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, మతోన్మాదానికి వ్యతిరేకంగా నికరంగా సిపిఎం పార్టీ రాజీ లేని పోరాటం కూడా చేస్తున్నదని అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంధ్య, అబ్దుల్ నబి, సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ కుమార్, మన్యం మోహన్ రావు, ఖాదర్, సర్వన్ కుమార్, మాదారపు, వెంకటేశ్వర్లు, మరియా, అబ్బాస్, నాగరాజు, సత్యనారాయణ కోరి, సుజాత, సంతోష, వెంకన్న గెలిచిన ఇందిరా నగర్,సుభాష్ నగర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు సోమ సుజాత,కొమరం సరోజ,విజయకుమార్, ఆర్ బి జే రాజు తదితరులు పాల్గొన్నారు.

# పార్థివ దేహానికి నివాళులర్పించిన బీఆర్ఎస్ పార్టీ మంగపేట మండల అధ్యక్షులు కుడుముల లక్ష్మి నారాయణ

**మంగపేట**



మంగపేట మండలం, నర్సింహాసాగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ నాయకులు అయినా జిగట శ్రీనివాస్ తల్లి గారైన జిగట లక్ష్మి మృతి చెందగా వారి మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను మంగపేట మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కుడుముల లక్ష్మి నారాయణ ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీ పేద ప్రజలకు ఆపదలో కష్టాలలో అండగా ఉంటుంది అధికారంలో లేకున్న కానీ బిఆర్ఎస్ పార్టీ నాయకులను కంటికి రెప్పలా కాపాడుకుంటాంము. వీరి వెంట మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్, నర్సింహసాగర్ గ్రామ కమిటీ అధ్యక్షులు ఉడుగుల శ్రీనివాస్ యాదవ్, మండల ఆర్గనైజేషన్ సెక్రటరీ చల్లగురుగుల తిరుపతి, యూత్ నాయకులు గౌని రమేష్ , మంగపేట మండల సోషల్ మీడియా ఇంచార్జ్ గుడివాడ శ్రీహరి, గ్రామ సీనియర్ నాయకులు, వజ్జ సోమన్న తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సీఎం కేసీఆర్‌కు మేడారం ఆహ్వాన పత్రికను అందజేసిన మంత్రుల

## మేడారం రావాల్సిందిగా కేసీఆర్‌ను ఆహ్వానించిన మంత్రులు సీతక్క, సురేఖ





**మంగపేట**

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకు స్వయంగా ఆహ్వానం అందజేశాను అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కేసీఆర్ ని కలుసుకోలేకపోయాను అందుకే కెసిఆర్ ని స్వయంగా ఆహ్వానించేందుకు ఇక్కడికి వచ్చాము సాంప్రదాయ బద్ధంగా నిర్వహించుకునీ జాతర మేడారం ఆదివాసి బిడ్డలుగా పుట్టిన సమ్మక్క సారలమ్మ జాతర ప్రపంచంలోనే అతి పెద్ద ఆదివాసి జాతర ప్రాంతాలకు అతీతంగా అందరి కోరిన కోరికలు తీర్చే తల్లులు సమ్మక్క సారాలమ్మలు మేడారం మహా జాతరకి కెసిఆర్ ను ఆహ్వానించాము కెసిఆర్ గారు, ఆయన సతీమణి శోభమ్మను మేడారం రావాల్సిందిగా ఆహ్వానించాము. తల్లుల బంగారాన్ని, బట్టలను కెసిఆర్ దంపతులకు బహుకరించి మేడారం రావలసిందిగా ఆహ్వానించాము. మా ఆహ్వానాన్ని కెసిఆర్ స్వీకరించారు. కెసిఆర్ నివాసానికి వచ్చిన మాకు చీరలు బహుకరించడం సంతోషంగా ఉంది. రాజకీయాలు మాట్లాడుకునే సమయం కాదు.. రాష్ట్ర పండుగగా ఎప్పటి నుంచో మనము జాతర నిర్వహించుకుంటున్నాము. ఆడబిడ్డలుగా మేము కేసీఆర్ ని ఆహ్వానించాము. మా ఆహ్వానానికి కేసీఆర్ సానుకూలంగా స్పందించారు. మేడారం జాతరకు వస్తానని కేసీఆర్ చెప్పారు. మంత్రులతో పాటు ములుగు డిసిసి అధ్యక్షులు పైడాకుల అశోక్, సిద్దిపేట డిసిసి అధ్యక్షులు ఆకాంక్ష రెడ్డి లు కెసిఆర్ ను కలిశారు.

# 69వ ఎస్జీఎఫ్ అండర్17 బాలుర జాతీయ కబడ్డీ పోటీలు

## రెండో రోజు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లు





**పినపాక**

తెలంగాణ రాష్ట్రంలో స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 69వ అండర్17 బాలుర జాతీయ కబడ్డీ పోటీల్లో భాగంగా గురువారం జరిగిన రెండో రోజు మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగి క్రీడాభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో వివిధ రాష్ట్రాలు, జాతీయ స్థాయి విద్యా సంస్థల జట్లు అత్యంత పోటీతత్వంతో తలపడుతూ విజయం కోసం హోరాహోరీగా పోరాడాయి. ఉదయం సెషన్‌లో మధ్యప్రదేశ్ 5040తో పంజాబ్ పై, విద్యాభారతి 5540తో కేవీఎస్ పై, ఒడిశా 5243తో చండీగఢ్‌పై గెలుపు సాధించాయి. ఆంధ్రప్రదేశ్ 7043తో త్రిపురపై ఘన విజయం సాధించగా, పుదుచ్చేరి 6046 తో సీఐఎస్‌సీఈను మట్టికరిపించింది. తెలంగాణ జట్టు 4640తో తమిళనాడుపై విజయం సాధించగా, కర్ణాటక 4035తో ఢిల్లీని, మహారాష్ట్ర 4134తో హిమాచల్ ప్రదేశ్‌ను ఓడించాయి. రాజస్థాన్ జట్టు 3422 తేడాతో ఉత్తరాఖండ్‌పై గెలుపొందింది. మధ్యాహ్నం సెషన్‌లో హర్యానా 7125తో కేవీఎస్‌పై ఆధిపత్యం చూపింది. మధ్యప్రదేశ్ 5235తో ఎన్వీఎస్‌ను, మణిపూర్ 4934తో జార్ఖండ్‌ను, సీబీఎస్ఈ





3935తో పశ్చిమ బెంగాల్‌ను ఓడించాయి. గుజరాత్ 3832తో జమ్మూ & కాశ్మీర్‌పై, కేరళ 3935తో సీబీఎస్ఈ వెల్ఫేర్‌పై గెలుపొందాయి. ఉత్తరప్రదేశ్ 3432తో ఛత్తీస్‌గఢ్‌పై విజయం సాధించగా, విద్యాభారతి 4938తో అస్సాం, పంజాబ్ 5934తో ఎన్వీఎస్‌పై ఘన విజయాలు సాధించాయి. రెండో రోజు మ్యాచ్‌లలో ఆటగాళ్లు ప్రదర్శించిన శక్తి, నైపుణ్యం, వ్యూహాత్మక ఆటతీరు ప్రేక్షకులను ఉత్సాహపరిచింది. నిర్వాహకులు తెలిపారు, రాబోయే రోజుల్లో పోటీలు మరింత ఉత్కంఠభరితంగా కొనసాగనున్నాయి.



## నెంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపితే కఠిన చర్యలు

**– అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్లు ఉమర్ ఫరూక్, రాజశేఖర్ రెడ్డి**



**బూర్గంపహాడ్**

నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు ఉమర్ ఫరూక్ రాజశేఖర్ రెడ్డి లు తెలిపారు. బూర్గంపహాడ్ మండల పరిధిలో గురువారం పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో భాగంగా నంబర్ ప్లేట్ లేని నూతన వాహన యజమానికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా వాహనదారులకు పలు సూచనలు చేశారు. హెల్మెట్ లేని వాహనదారులకు హెల్మెట్ ధరించాలని మొదటి తప్పుగా పరిగణించి హెల్మెట్ తప్పనిసరి పెట్టుకోవాలని ఈసారి హెల్మెట్ లేకుండా కనిపిస్తే జరిమానా విధిస్తామని వాహనదారులను హెచ్చరించారు. అలాగే నెంబర్ ప్లేట్ లేని వాహనాల లో అక్రమంగా గంజాయి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని నూతనంగా వాహనాలు కొనుగోలు చేసిన వారు తప్పనిసరిగా వాహన రిజిస్ట్రేషన్ చేసుకున్న వెంటనే నంబర్ ప్లేట్ ను పెట్టుకోవాలని తెలిపారు. వేరే వారి వద్ద పాత వాహనాలు కొనుగోలు చేసే వారు తప్పనిసరిగా నంబర్ ప్లేట్ ఉండే విధంగా చూడాలని సి బుక్కు తమ పేరుకు మార్చు కోవాలని నెంబర్ ప్లేట్ లేని వాహనాలను కొనుగోలు చేయొద్దని సూచించారు. ఈ వాహన తనిఖీలలో ఆర్టిఏ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మత్తు కంటే ఆనందాన్ని ఇచ్చేది గౌరవప్రదమైన జీవితం

**– న్యాయమూర్తి పి.శివ నాయక్**



**భద్రాచలం**

తాత్కాలికంగా మత్తు కలిగించే ఆనందం కన్నా, జీవితంలో ఉన్నత స్థాయిలో ఉన్నప్పుడు సమాజం మనకు ఇచ్చే ఆనందం కోటి రెట్లు గొప్పదని భద్రాచలం జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పి. శివ నాయక్ విద్యార్థులకు సూచించారు. గురువారం నాడు భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా న్యాయ సేవలు ప్రాధికార సంస్థ నిర్వహించిన మత్తుమందుల అవగాహన, న్యాయ అవగాహన మరియు ఆరోగ్య సంక్షేమ మార్గ నిర్దేశ పథకంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతి మరియు జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 5 నుండి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా స్థానిక డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు మత్తు పదార్థాలు వాడకం వలన జరిగే అనర్థాలపై వారికి విపులంగా వివరించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కే. జాన్ మిల్టన్, భద్రాచలం జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ దుర్గ భవాని, బార్ అసోసియేషన్ అధ్యక్షులు దేవదానం, శిశు మహిళా సంక్షేమ అధికారి రూప, న్యాయవాది తిరుమల రావు, కళాశాల ఎన్.ఎస్.ఎస్ పిఓ డా. ఎం.కిరణ్ కుమార్, ఎన్.ఎస్.ఎస్ పిఓ బి. సుధాకర్, రావు,అధ్యాపకులు ఎన్.హిమజ, కపిల భారతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## స్కావెంజర్‌పై టేకులపల్లి ఎంఈవో జగన్ విచారణ





**టేకులపల్లి**

టేకులపల్లి మండలంలో ని బొమ్మనపల్లి ప్రభుత్వ పాఠశాలను గురువారం ఎంఈవో జగన్ మధ్యాహ్న భోజనం నిర్వహణపై, స్కావెంజర్ పై విచారణ చేపట్టారు. స్కూల్ లో ఉపాధ్యాయురాలు, వంట నిర్వహకురాలు, స్కావెంజర్ ను విచారించి వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని, వంటశాల, స్టోర్ రూమ్ తాళాలు హెచ్ఎం వద్దనే ఉంచుకోవాలని తెలిపారు. ప్రతి రోజు నాణ్యమైన భోజనం పెడుతున్నరా లేదా పర్యవేక్షించాలని హెచ్ఎంను ఆదేశించారు. వంటశాలలో దాచిన బియ్యం 117 కేజీలపై పంచనామా నిర్వహించి, స్థానిక డీలర్ గుగులోత్ హేమచందర్ కు అందజేసీ చేసినట్లు ఉన్నతాధికారులు వివరాలను వెల్లడించినట్లు ఆర్ ఐ రత్తయ్య తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కాలంగి హరికృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా భయ్య అభిమన్యు మాట్లాడుతూ.. మెనూ ప్రకారం భోజనం అమలు చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలని తెలిపారు. వంట నిర్వహకురాలి పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని బొమ్మనపల్లి జడ్పీహెచ్ఎస్ స్కూల్ పర్యవేక్షించాలని కోరారు.

## క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య



**ఇల్లందు**

తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రిస్మస్ ఆరాధనలో స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొని మాట్లాడుతూ.. క్రైస్తవ సోదరులందరు క్రిస్మస్ పండుగను గొప్పగా జరుపుకోవాలనే ఉద్దేశంతో చర్చిల అధునికరణకు ప్రతి నియోజకవర్గానికి 50 చర్చిలకు ఆర్థిక చేయుత అందించిన ఏకైక ప్రజా ప్రభుత్వమని, అన్ని వర్గాల సంక్షేమం లక్ష్యంగా, పేదలందరి అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఇల్లందు నియోజవర్గం ప్రజలందరి పై ఆ ప్రభువు ఆశీస్సులు ఉండాలని ఎమ్మెల్యే తెలియజేశారు. అనంతరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ చైర్మన్ బానోత్ రాంబాబు, ఇల్లందు పరిసర ప్రాంత దైవజనులు తదితరులు పాల్గొన్నారు.

## టెట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహణ

**– జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




**కొత్తగూడెం**

టెట్2026 పరీక్షల నిర్వహణలో భాగంగా గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అబ్దుల్ కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజికల్ సైన్సెస్‌లో నిర్వహించిన టెట్ పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఈ పరీక్షా కేంద్రంలో సెషన్×కు మొత్తం 100 మంది అభ్యర్థులు కేటాయించగా, అందులో 87 మంది హాజరై 13 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. అదే విధంగా సెషన్××కు 100 మంది అభ్యర్థులు కేటాయించబడగా, 56 మంది హాజరై 44 మంది గైర్హాజరయ్యారని కలెక్టర్ వివరించారు. రెండు సెషన్లలోనూ పరీక్షలు ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రంలో భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టడంతో పాటు, పరీక్షా నియమ నిబంధనలు కట్టుదిట్టంగా అమలు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు.